




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 307 | బుధవారం | 08-10-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



డిజిటల్ వ్యవసాయంలో అగ్రగామిగా తెలంగాణ
ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ప్రకారం కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ
కొత్త సంస్కరణలతో జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక 03


# అడుగడుగునా జాగ్రత్త

హైకోర్టులో బిసి రిజర్వేషన్‌పై విచారణ నేపథ్యంలో ముఖ్యనేతలతో సిఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం

హైకోర్టులో వాదనలు వినిపించాల్సిందిగా ఫోన్‌లో అభిషేక్ సింఘ్వీని కోరిన ముఖ్యమంత్రి



ప్రజాపక్షం/హైదరాబాద్

వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బిసిలకు రిజర్వేషన్ కల్పించే అంశంపై అడుగడుగునా జాగ్రత్తలు చేపడుతున్న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు, హైకోర్టులోనూ కేసు గెలిచేందుకు తన సర్వశక్తులు ఒడ్డుతోంది. బిసి రిజర్వేషన్ల అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గంట గంటకు పరిస్థితిని అంచనా వేస్తూ ముందుకు వెళుతుంది. ఈ క్రమంలో బుధవారం హైకోర్టులో బిసి రిజర్వేషన్ కేసు విచారణ నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, చేపట్టాల్సిన చర్యలు తదితర అనుబంధ అంశాలను చర్చించేందుకు ఏకైక ఎజెండాతో మంగళవారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొననున్నారు. ఈనెల 8న హైకోర్టులో తరువాయి 2లో

## అందరి చూపు హైకోర్టు వైపు

**స్థానిక రిజర్వేషన్లపై నేడు విచారణ**

అందరి చూపు ఆవైపే ఏ నలుగురు కలిసిన అదే చర్చ. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఏ తీర్పు ఇవ్వబోతుంది, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రస్తుత రిజర్వేషన్‌ను కొనసాగించేందుకు అనుమతి ఇస్తుందా అన్న దానిపై విస్తృతంగా చర్చ సాగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో విడుదల చేసింది. ఆ జీవో ప్రకారం స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రిజర్వేషన్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఈ నెల తొమ్మిదిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం తరువాయి 2లో

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి కోటా పిటిషన్‌లో సిపిఐ ఇంప్లీడ్

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన కేసులో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసింది. బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో తమను ప్రతివాదిగా చేర్చాలని కోరుతూ సిపిఐ తరుపున తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం నాడు ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు వర్తించే జిఒ 9ను సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు పెంచడాన్ని సమర్థిస్తూ, దానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని, ఆ కేసులో తమను కూడా ప్రతివాదులుగా చేర్చాలని కోరుతూ సిపిఐ ఇంప్లీడ్ పిటిషన్ వేసింది. ఇప్పటికే విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు సహా స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించే బిల్లులకు శాసనసభలో సిపిఐ సంపూర్ణంగా మద్దతు పలికింది.




## డిజిటల్ టెక్నాలజీ పురోగతికి కృషి

ముగ్గురు అమెరికన్లకు భౌతికశాస్త్రంలో నోబెల్

**స్టాక్‌హోం:** అసాధ్యమైన క్వాంటమ్ టన్నెలింగ్‌పై పరిశోధనలు చేసి డిజిటల్ టెక్నాలజీని మరింత ముందుకు తీసుకుపోయేందుకు కృషి చేసినందుకు భౌతికశాస్త్రంలో ముగ్గురు అమెరికా శాస్త్రవేత్తలకు ఉమ్మడిగా నోబెల్ బహుమతి లభించింది. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్.డెవోరెట్, జాన్ ఎం.మార్టినిస్‌లకు ఈ ప్రపంచ అత్యున్నత గౌరవం లభించింది. ఈనాడు సెల్‌ఫోన్లు పనిచేయడానికి ఆయన కనుగొన్న అంశాలే కారణం. కొత్త తరం క్వాంటం తరువాయి 2లో



## స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్, సిపిఐ చర్చలు

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సిపిఐ నేతల భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్‌తో సిపిఐ నేతల ప్రతినిధి బృందం మంగళవారం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంఎల్‌ఎ క్వార్టర్స్‌లో ఆయన నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఇ.టి. నరసింహ, కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇరు పార్టీల మధ్య జెడ్‌పిటిసి, ఎంపిటిసి, పంచాయతీ ఎన్నికల్లో అవగాహనపై చర్చ జరిగింది. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ,సిపిఐ మధ్య అవగాహనతో పోటీ చేశాయని అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కలిసి పోటీ చేయాలని సమావేశం అభిప్రాయపడింది.



## నల్లగొండలో విద్యార్థిని దారుణ హత్య

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్

నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో విద్యార్థిని దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారెడ్డిగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని (17) ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే నల్లగొండ మండలం గుట్టకింది అన్నారం గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ అనే యువకుడితో కొంత కాలంగా ప్రేమ తరువాయి 2లో

## గాజాలో ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న జాతి హననాన్ని నిలిపేయాలి

- పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు డిమాండ్
- వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, మైనారిటీ సంఘాలు సంఘీభావ ప్రదర్శన
- ధర్నా చౌక్ వద్ద ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు




ప్రజాపక్షం /హైదరాబాద్

గాజాలో ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న జాతి హననాన్ని తక్షణమే నిలిపివేయాలని పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. అనైతిక యుద్ధంతో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమెన్ నెతన్యాహూ, అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ గడిచిన రెండేళ్ల కాలంలో 65 వేల మంది ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులను నిరసిస్తూ పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో వామ పక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, పలు మైనార్టీలు సంఘాలు నాయకులు, కార్యకర్తలు పాలస్తీనా మద్దతుగా మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ప్రపంచ దేశాలు, ప్రజలు గాజాపై దాడులు ఆపాలని కోరుతున్నా కనీస యుద్ధ విలువలను పాటించకుండా తమ నరమేథాన్ని సాగిస్తూనే ఉన్నారని వక్తలు విమర్శించారు. ప్రత్యక్షంగా ఇజ్రాయిల్, పరోక్షంగా అమెరికా దేశం గాజా (పాలస్తీనా)ను భస్మీపటలం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రదర్శనను ఉద్దేశించి తరువాయి 2లో



## ఐక్యంగా, బలంగా ముందుకెళదాం

**తేజస్వీ యాదవ్‌తో భేటీలో డి.రాజా**

**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రతిపక్ష మహాకూటమిలో సీట్ల సర్దుబాటుపై చర్చలు మొదలయ్యాయి. 24 స్థానాల్లో పోటీ చేయాలని సిపిఐ భావిస్తోంది. ఇదే క్రమంలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మంగళవారం బిహార్ రాజధాని పట్నాలో ఆర్‌జెడి నాయకుడు, మహాకూటమి సమన్వయ కమిటీ చైర్మన్ తేజస్వీ యాదవ్‌తో భేటీ అయ్యారు. బిహార్‌లో వామపక్షాలు, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతకు బలం పెంచుకోవడంపై చర్చించారు. ప్రజలు మెచ్చే రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్నారు. ఐక్యంగా, బలంగా ముందుకెళదామని, ప్రజా ప్రభుత్వాన్ని తెద్దామని డి.రాజా అన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేశ్ పాండే, జాతీయ కార్యదర్శి సంజయ్ కుమార్, జాతీయ సమితి సభ్యుడు అజయ్ కుమార్ సింగ్, ఆర్‌జెడి నాయకులు అబ్దుల్ బారి సిద్దీఖీ, సంజయ్ యాదవ్ (ఎంపి), ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మగ్నీ లాల్ మండల్, జాతీయ ప్రధాన కార్యదర్శి భోలా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులంతా ఓటేసేలా ఇసి హామీనివ్వాలి**

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరగాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆకాంక్షించారు. అర్హులైన ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోగలగాలని, ఇందుకు ఎన్నికల సంఘం హామీ ఇవ్వాలని, అది ఆ సంస్థ రాజ్యాంగబద్ధ కర్తవ్యమని అన్నారు. బిహార్ 24 స్థానాల్లో పోటీ చేయాలని సిపిఐ కోరుకుంటోందని, ఆ మేరకు ఏకాభిప్రాయం కుదురుతుందని తరువాయి 12లో

## ఆ 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలు ఇవ్వండి

ఎన్నికల సంఘానికి 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ :** బిహార్ ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తు తర్వాత రూపొందించిన తుది ఓటర్ల జాబితా నుండి మినహాయించబడిన 3.66 లక్షల మంది ఓటర్ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు మంగళవారం ఎన్నికల సంఘాన్ని కోరింది. ఆగస్టులో ముసాయిదా జాబితాలో ప్రచురించబడిన తర్వాత తుది జాబితాలో చేర్చబడిన వారిలో ఎక్కువ మంది కొత్త ఓటర్లేనని, మినహాయించబడిన ఏ ఓటరు కూడా దీనిపై ఫిర్యాదు లేదా అప్పీల్ దాఖలు చేయలేదని ఎన్నికల సంఘం అత్యున్నత న్యాయస్థానానికి వివరించింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాజకీయ పార్టీలు ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఐ (ఎం) సహా కొంత మంది పిటిషనర్లు తుది ఓటర్ల జాబితా నుండి ఓటర్లకు ఎన్నికల సంఘం (ఇసి) ఎలాంటి నోటీస్ జారీచేయకుండా, తరువాయి 2లో

## ఈ నెల 15 లోగా సాయుధ పోరాటాన్ని త్యజిస్తాం

పోలీసులు గస్తీని నిలుపుదల చేయండి

మావోయిస్టు మాడ్ కమిటీ లేఖ

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మావోయిస్టు సాయుధ పోరాటాన్ని త్యజించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈనెల 15వ తేదీ లోగా ఆయుధాలను దీనికి సంబంధించిన పని పూర్తి చేస్తామని, అప్పటి వరకు ఎలాంటి కూంబింగ్‌లు నిర్వహించకుండా పోలీస్ గస్తీని నిలుపుదల చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మావోయిస్టు మాడ్ కమిటీ కార్యదర్శి రాణిత అలియాస్ సానిత పేరిట మంగళవారం ఓ లేఖ విడుదలైంది. ప్రస్తుతం మావోయిస్టులపై కొనసాగుతున్న తీవ్ర నిర్బంధ తరువాయి 2లో

## గాజా సంక్షోభానికి రెండేళ్లు

67 వేల మంది పాలస్తీనియన్లు మృతి

మరో 1.65 లక్షల మందికి గాయాలు

కైరోలో రెండోరోజు కొనసాగిన చర్చలు




**జెరూసలెం:** మధ్యప్రాచ్యంలో పాలస్తీనాపై దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇజ్రాయెల్ దురాక్రమణ కారణంగా పరాకాష్టకు చేరిన ప్రత్యక్షహింస, దాడులకు అక్టోబరు ఏడో తేదీతో రెండేళ్ళు పూర్తయ్యాయి. సరిగ్గా ఇదేరోజు (అక్టోబరు 7,2023)న హమాస్ ఉగ్రవాదులు సరిహద్దులను ఛేదించి ఇజ్రాయెల్‌పై దాడిచేశారు. నోవా సంగీతోత్సవంపై దాడిచేశారు. 1200 మందిని హతమార్చి 251 మందిని బందీలుగా తీసుకువెళ్ళడంతో గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. ఈ దాడుల్లో 67 వేలమంది పాలస్తీనా ప్రజలు మరణించారు. మరో 1.65 లక్షలమంది గాయపడ్డారు. వికలాంగులయ్యారు. 200 మంది చిన్నారులు ఆకలి చావులకు గురయ్యారు. లక్షల సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు వ్యతిరేకించినాగానీ, అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టు వారెంటు జారీ చేసినాగానీ నెతన్యాహూ తన దారుణ ప్రతీకార తరువాయి 2లో

## టూరిజంలో అవకతవకలు

టిజిటిడిసి నిధులు గోల్‌మాల్

రూ.1.05 కోట్లు కాజేసిన వైనం

ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన సిసిఎస్ పోలీసులు

సూత్రధారి తాత్కాలిక ఉద్యోగి

ఇద్దరు ఎజిఎంల సస్పెన్షన్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)లో భారీగా అవకతవకలు జరిగాయి. సంస్థలో పనిచేస్తున్నవారే నిధులను పక్కదారి పట్టించారు. ఇందులో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న జూనియర్ అకౌంటెంట్ ప్రధాన పాత్ర వహించారు. ప్రభుత్వ ఖాతాలో ఉన్న నిధులను సంస్థతో ఎలాంటి సంబంధంలేని ప్రైయివేటు వ్యక్తుల ఖాతాలోకి మళ్లించారు. ఇలా రెండున్నరేళ్ల నుంచి ఈ భాగోతం కొనసాగింది. అయినా అధికారులు గుర్తించలేక పోయారు. ఇప్పటి వరకు టిజిటిడిసికి చెందిన రూ.1.05 కోట్లు పక్కదారి పట్టించారని అధికారుల విచారణలో తేలింది. ఈ మేరకు




టిజిటిడిసి డిజిఎం టి.సమాదానమ్ హైదరాబాద్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిసిఎస్ పోలీసులు జూనియర్ అకౌంటెంట్ కె.శృతితో పాటు ఆమె భాయ్‌ఫ్రెండ్స్ పాకనటి హరికృష్ణ, బాలగాని శ్రావణ్‌కుమార్, సింతల రాహుల్, గడ్డం ప్రీతిక, ఎం.శ్రావణ్‌కుమార్, పి.మల్లిక, మేటకడప భాగ్యవతిలపై బిఎన్ఎస్ యాక్ట్ 316(5), 318(4), 336(3),340(2) రెడ్ విత్ 3(5) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. సిసిఎస్ ఎకనామిక్ ఆఫెన్స్ వింగ్ ఎస్ఐ మంద్రా శిరీష దర్యాప్తు చేస్తున్నారు.

**నిధులు మళ్లిన విధానం ఇలా..**

హిమాయత్‌నగర్‌లోని టిజిటిడిసిలో కె.శృతి ఐదేళ్ల నుంచి జూనియర్ అకౌంట్‌టెంట్ తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తుంది. టిజిటిడిసి నిధులు బ్యాంకు ఖాతా నెంబర్ 62281683607లో ఉంటాయి. టిజిటిడిసి తమ ఉద్యోగులకు, ఇతర కాంట్రాక్టర్లకు ఈ ఖాతా నుంచే నిధులను విడుదల చేస్తుంది.నిధులు ఎవరెవరికి ఏఏ అకౌంట్‌ల లోకి నిధులు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## తుదియత్నం విఫలమైతే మేక్రాన్‌కే పగ్గాలు!

**పారిస్:** ఫ్రాన్స్ ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకార్ను పదవికి రాజీనామా చేసిన 24 గంటల తర్వాత కూడా ఆ దేశంలో రాజకీయ సంక్షోభం మరింత ముదురుతోందే తప్ప ఉపశమనం కలగడం లేదు. లెకార్నుకు దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ తుది అవకాశం ఇచ్చారు. బుధవారం లెకార్ను అన్ని వర్గాలతోనూ సమావేశం జరిపి చివరి ప్రయత్నాలు చేస్తారు. ఈ ప్రయత్నాలు కూడా విఫలమైతే ఇక మేక్రానే స్వయంగా ప్రధానమంత్రి పాలనా బాధ్యతలను కూడా చేపడతారు. బుధవారంనాడు లెకార్ను విపక్షాలకు విందు ఏర్పాటు చేసి అందరినీ ఆహ్వానించి తుది ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు వామపక్షాలు కూడా ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో తమ పట్టు బిగించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశంలో వామపక్షాల భాగస్వామ్యం లేకుండా పరిపాలన అసాధ్యం అని సర్వత్రా వామపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ఇదిలా ఉండగా, లెకార్ను ప్రభుత్వ పతనంపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌ను అభిశంసించడమే పరిష్కారమార్గంగా 51 శాతంమంది అభిప్రాయపడ్డారు.



## వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న భారత్–అమెరికా చర్చలు

**దోహా:** భారత్–అమెరికా ప్రతినిధుల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయని భారత వాణిజ్య, పరిశ్రమలశాఖా మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. బహుశా వీలైతే ఈ ఏడాది నవంబరునెల చివరిలోపే రెండు దేశాల మధ్య సంభాషణలు ముగుస్తాయని అన్నారు. ఖతార్ రాజధాని దోహాకు ఒకరోజు అధికారిక పర్యటనకు వచ్చిన పీయూష్ గోయల్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, వాణిజ్య ఒప్పందంపై వివిధ స్థాయిల్లో చర్చలు స్థిరంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ చర్చలు ఏ విధంగా మరింత ముందుకు తీసుకువెళ్ళాలనే విషయంపై ప్రతిరోజూ తాము ఒక స్పష్టత ఇస్తామని కూడా చెప్పారు. నవంబరు గడువులోపే చర్చలు ముగించాలని రెండు దేశాల ప్రతినిధులు గట్టి పట్టుదలతో ఉన్నాయని చెప్పారు. గతనెలలో గోయల్ సారథ్యంలో ప్రతినిధులబృందం చర్చల నిమిత్తం న్యూయార్క్‌కు వెళ్ళింది. ఈ సమావేశం తర్వాత రెండు దేశాలూ చర్చలు కొనసాగించాలని నిర్ణయించాయి. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం 'షట్‌డౌన్' పరిస్థితిని ఎదుర్కొంటున్నందున ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని తదుపరి ఎప్పుడు, ఎక్కడ చర్చలు జరపాలన్న విషయాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుండి అమెరికా ప్రభుత్వంలో కేవలం అత్యవసర విభాగాలు మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన శాఖలకు సంబంధించిన ఉద్యోగులు లక్షలమంది వేతనాలు లేకుండా సెలవుల్లో ఇళ్ళలోనే కూర్చుని ఉన్నారు. అమెరికా కాంగ్రెస్‌లో రెండు కీలకమైన ఆర్థిక బిల్లులను ఆమోదించే విషయంలో అధికార–ప్రతిపక్ష రిపబ్లికన్, డెమోక్రటిక్‌పార్టీల చట్టసభ సభ్యులు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ ఉండిపోవడంతో బిల్లులు మాత్రం ఆమోదం పొందడం లేదు. తాజాగా ఐదోసారి అమెరికా కాంగ్రెస్ బిల్లులను ఆమోదించడంలో విఫలం కావడంతో ఏడు రోజులుగా ఆ దేశంలో ప్రభుత్వ షట్‌డౌన్ కొనసాగుతోంది.

# సొంత ప్రజలపైనే బాంబులువేసి చంపుతోంది

### భద్రతామండలిలో పాకిస్థాన్‌పై భారత్ విమర్శ




**న్యూయార్క్:** పాకిస్థాన్ ప్రభుత్వం తన సొంత ప్రజలపైనే బాంబులవర్షం కురిపించి హతమారుస్తోందని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో భారతదేశం నిశిత విమర్శలు చేసింది. 'మహిళలు, శాంతి, భద్రత' అనే అంశంపై బహిరంగ చర్చ సందర్భంగా ఐక్యరాజ్యసమితిలో భారత్ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ప్రసంగించారు. భారత్‌పై పాకిస్థాన్ ప్రతినిధి తొలుత తీవ్ర ఆరోపణలు చేయడంతో హరీశ్ తన ప్రసంగంలో ఆ దేశ బండారాన్ని బయటపెట్టారు. 1971లో పాకిస్థాన్ ఆపరేషన్ సెర్చ్‌లైట్‌ను నిర్వహించి ఒక పద్ధతి ప్రకారం తన దేశంలో ఉన్న 4,00,000 మంది మహిళలపై అత్యాచారాలు చేసి హత్య చేసిందని, ఇందుకోసం తన సొంత సైన్యాన్నే ఉపయోగించుకుందని హరీశ్ విమర్శించారు. జమ్మూ కశ్మీరు భారత భూభాగంగా గుర్తించడానికి తిరస్కరిస్తున్న పాకిస్థాన్ ప్రతి సంవత్సరం ఎడతెగని దాడులు చేయిస్తోందని, ఇది అత్యంత దురదృష్టకరమైనదని విమర్శించారు.

''తన సొంత ప్రజలపైనే బాంబులు వేసి చంపుతున్న ఒకదేశం ఒక పద్ధతిప్రకారం సామూహిక హత్యాకాండకు పాల్పడుతోంది, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ప్రపంచాన్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నంచేస్తోంది'' అని విమర్శించారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను యావత్ ప్రపంచం చూస్తూనే ఉందని అన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌గా పిలుస్తున్న ఒకనాటి తూర్పు పాకిస్థాన్‌పై 1971 మార్చి 25న పాకిస్థాన్ సైన్యం అత్యంత కిరాతకంగా పౌరులను హత్యచేయడం ప్రారంభించిందని, ఆపరేషన్ సెర్చ్‌లైట్ పేరుతో దారుణాలకు పాల్పడిందన్నారు. రష్యా ప్రతినిధి అధ్యక్షతన ఈ భద్రతామండలి సమావేశం జరిగింది. పాకిస్థాన్ తన ప్రకటనలో జమ్మూ కశ్మీరు గురించి ప్రస్తావించడాన్ని భారత ప్రతినిధి తీవ్రంగా పరిగణించి స్పందించారు. జమ్మూ కశ్మీరులో మహిళలు దశాబ్దాలుగా లైంగిక దోపిడీకి గురవుతున్నారంటూ పాకిస్థాన్ ప్రతినిధి చేసిన ఆరోపణలపై హరీశ్ స్పందిస్తూ, పాకిస్థాన్ సైన్యం చేసిన ఘోర కృత్యాలను ప్రపంచం దృష్టికి తీసుకువచ్చారు. మహిళలు, శాంతి, భద్రత విషయంలో భారతదేశం ఎంతమాత్రం వెనక్కు తగ్గకుండా కట్టుబడి ఉందన్నారు. ఈ విషయంలో తన అనుభవాలను అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకుని ఎదురవుతున్న సవాళ్ళకు ఉమ్మ డి పరిష్కారాలు సాధించేందుకు భారతదేశం సిద్ధంగా ఉందన్నారు. ఐక్యరాజ్య సమితి శాంతిదళాలలో భారతదేశం తనవంతు పాత్ర నిర్వహించడం ప్రపంచశాంతిపట్ల భారత్‌కు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని గుర్తుచేశారు.

1960వ దశకంలో భారతీదేశం కాంగోలో మహిళా వైద్యాధికారులను నియమించిందని, ఐక్యరాజ్యసమితి శాంతి దళాలలలో తమదేశ మహిళలు సేవలు అందించారని గుర్తు చేశారు. మహిళల నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు వారి సమానత్వ కోసం పాటుపడేందుకు ఇవి కేవలం చిన్న చిన్న ఉదాహరణలు మాత్రమేనన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి వచ్చిన మహిళా శాంతి దళాల అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చిన విషయాన్ని కూడా హరీశ్ గుర్తుచేశారు. ఈ సదస్సులో 35 దేశాలకు చెందిన శాంతిదళాల ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు.




## బలూచిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ పేల్చివేత

**షికార్‌పూర్:** పాకిస్థాన్ సింధ్ రాష్ట్రం షికార్‌పూర్ జిల్లాలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మరోసారి పేల్చివేశారు. మంగళవారం ఉదయం 'సుల్తాన్‌కోట్ గ్రామ సమీపంలో జరిగిన ఈ ఘటనలో నాలుగు బోగీలు పట్టాలు తప్పాయి. ఎవరూ మరణించలేదు. కనీసం ఏడుగురుపైగా ప్రయాణికులు గాయపడ్డారు.పేలుడు సమయంలో రైలులో 270 మంది ప్రయాణిస్తున్నారు. దీంతో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై ఇప్పటివరకూ బలూచిస్థాన్ వేర్పాటువాదులు ఏడుసార్లు దాడులకు పాల్పడనట్లయింది. ఐఇడి పేలుడు పదార్థాలు ఉంచి రిమోట్ కంట్రోల్ ద్వారా రైలును పేల్చివేశారు. ఈ దాడిలో రైలు పట్టాలు, బోగీలు ధ్వంసమయ్యాయి. ఈ మార్గంలో రైళ్ళ రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికులను బస్సులలో వారి వారి గమ్యస్థానాలకు తరలించారు. ధ్వంసమైన రైల్వే ట్రాకును బాగుచేసే చర్యలు చేపట్టామని, ఈ పనులు పూర్తి కావడానికి పది గంటలు సమయం పడుతుందని డివిజనల్ రైల్వే అధికారి ఒకరు చెప్పారు. సింధ్ రాష్ట్ర హోంమంత్రి జియా లాంజర్ తక్షణం పూర్తి వివరాలు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. ఈ చర్యకు తామే బాధ్యులమని బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ సంస్థ ప్రకటించుకుంది. బలోచ్ స్వాతంత్రం కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేసింది. గడచిన ఐదు సంవత్సరాలుగా బలూచిస్థాన్ స్వాతంత్ర్యంకోసం ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చింది.

## 53 మంది ఐరాస సిబ్బందిని చెరబట్టిన హౌతీలు

**వాషింగ్టన్:** యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులు తాజాగా మరో తొమ్మిదిమంది ఐక్యరాజ్యసమితి సిబ్బందిని బందీలుగా చేయడాన్ని సంస్థ అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజార్రిక్ తీవ్రంగా ఖండించారు. గడచిన ఆగస్టునెలలో కూడా 18 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బందిని యెమెన్‌లోని సనాలో బందీలుగా తీసుకువెళ్ళడమే కాకుండా ఐక్యరాజ్యసమితి ఆస్తులను స్వాధీనం చేసుకోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆనాడు ఇజ్రాయెల్ దాడుల్లో హౌతీల ప్రధాన మంత్రి హతుడయ్యారు. ఆ వెనువెంటనే హౌతీలు సమితి సిబ్బందిని బందీలను చేశారు. ఇలాంటి చర్యలకు స్వస్తిచెప్పాలన్నారు. 2021 నుండీ ఇప్పటివరకూ హౌతీలు 53 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బందిని తమ బందీలుగా చేసుకున్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ఈ చర్యలను ఇప్పటికే ఖండించారు. యెమెన్‌లో ఉన్న సంస్థ ఆస్తులను, కార్యాలయాలు, భవంతులను హౌతీ ఉగ్రవాదులు అక్రమంగా తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. తాజాగా ఎప్పుడు మళ్ళీ ఐక్యరాజ్యసమితి సిబ్బందిని బందీలుగా తీసుకువెళ్ళారన్న విషయాన్ని డుజెర్రిక్ వివరంగా చెప్పలేదు. ఐతే హౌతీలు మాత్రం ఐక్యరాజ్యసమితి వివక్షతో వ్యవహరిస్తోందని, ఇజ్రాయెల్ దాడులను ఖండించలేదని విమర్శిస్తున్నారు. యెమెన్‌లో ఇటు హౌతీల పరిపాలన, మరోవైపు సౌదీల మద్దతుతో ఈడెన్‌లో ప్రభుత్వం కొనసాగుతున్నాయి. 2014 నుండి యెమెన్‌లో అస్థిరత కొనసాగుతోంది.

## అందరి చూపు హైకోర్టు వైపే (మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే ఎంపిటిసి, జెడ్పిటిసి, సర్పంచుల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి మించిందని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పిటిషన్‌ను స్వీకరించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఈనెల ఎనిమిదికి తీర్పును వాయిదా వేయడంతో పాటు కీలక వ్యాఖ్యలు చేసింది. షెడ్యూల్ విడుదల చేసినా, నోటిఫికేషన్ ఇచ్చినా తుది తీర్పుకు లోబడి ఉండాలని వ్యాఖ్యానించింది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఉత్కంఠ నెలకొంది. సర్పంచుల పదవి కాలం 2024 జనవరి 30న ముగియగా, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవి కాలం ముగిసి ఏడాది గడిచిపోయింది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదు. పాలకు వర్గాలు లేక స్థానిక సంస్థల పరిస్థితి దయనీయంగా మారింది. కనీస అభివృద్ధి పనులు చేపట్టే పరిస్థితి లేదు. ఎట్టకేలకు ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ముందుకొచ్చి షెడ్యూల్ విడుదల చేసిన వేళ రిజర్వేషన్ చిక్కుముడిగా మారి హైకోర్టు తీర్పు కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సమర్థిస్తే నవంబర్‌లో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం ఈనెల తొమ్మిదిన నోటిఫికేషన్ విడుదల కానుండగా అదే రోజు నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మొదటి దశ అక్టోబర్ 23న ఎంపిటిసి, జెడ్పిటిసిలకు ఎన్నికలు జరగనుండగా రెండవ దశ అక్టోబర్ 27న ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు నవంబర్ 11న జరగనుంది. సర్పంచ్ ఎన్నికలు మూడు దశల్లో జరగనుండగా తొలి దశకు ఈనెల 17న, రెండవ దశకు 21న మూడవ దశకు 25న నోటిఫికేషన్ విడుదల కానుంది. సర్పంచ్ ఎన్నికలు అక్టోబర్ 31, నవంబర్ నాలుగు, నవంబర్ ఎనిమిది తేదీలలో మూడు దశలలో జరగనుండగా ఎన్నికల లెక్కింపు పోలింగ్ ముగిసిన వెంటనే జరగనుంది.

స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రస్తుత జీవో ప్రకారం ఎన్నికలకు న్యాయస్థానం అనుమతిస్తే పైన పేర్కొన్న ప్రకారం ఎన్నికలు జరుగుతాయి. లేదంటే న్యాయస్థానం తీర్పుకు లోబడి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఎన్నికల భవితవ్యం ఆధారపడి ఉంది. రిజర్వేషన్ సానుకూలంగా ఉన్న అభ్యర్థులు రంగంలోకి దిగేందుకు జంకుతున్నారు. న్యాయస్థానం తీర్పు తర్వాత సానుకూలమైతే ఎన్నికల సందడి మొదలవుతుంది. లేదంటే మరో నిర్ణయం కోసం ఎదురు చూడాల్సిందే.

## దారుణ హత్య (మొదటి పేజీ తరువాయి)

వ్యవహారం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో మంగళవారం డైట్ కళాశాల సమీపంలోని ఓ గదిలోకి కృష్ణ, ఆ విద్యార్థిని వెళ్లారు. ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తడంతో విద్యార్థినిని కృష్ణ దారుణంగా హతమార్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. హత్యకు ముందు అత్యాచారం చేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, టూటౌన్ ఎస్ఐ సైదులు, ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. నిందితుడు గడ్డం కృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అడుగడుగునా జాగ్రత్త (మొదటి పేజీ తరువాయి)

బిసి రిజర్వేషన్లపై కేసు విచారణ సందర్భంగా స్వయంగా హాజరు కావలసిందిగా న్యాయ కోవిదుడు అభిషేక్ సింఘ్విని ఫోన్‌లో సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం కోరారు. కాగా సోమవారం సుప్రీంకోర్టులో బిసి రిజర్వేషన్ల కేసు విచారణ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కూడిన బృందం ముందు రోజే ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులు, ఉన్నతాధికారులతో చర్చించింది. బిసి రిజర్వేషన్ల కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరపున సోమవారం సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయ కోవిదుడు అభిషేక్ సింఘ్వి, సిద్ధార్థ దవేలు హాజరు కాగా, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టుకు వెళ్లి వాదనలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. సిఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు బుధవారం హైకోర్టులో కేసు విచారణ నేపథ్యంలో స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని సోమవారం ఢిల్లీలో సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వి ని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మంత్రుల బృందం ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.

## అవకతవకలు (మొదటి పేజీ తరువాయి)

జమ చేయాలో టిజిటిడిసి ఫైనాన్స్ విభాగం నుంచి ఒక లీస్టు శృతి వద్దకు వస్తుంది. ఈ లీస్టును శృతి బ్యాంక్ అధికారులకు ఈ మెయిల్ చేస్తుంది. ఈ లీస్టులో ఉన్న వ్యక్తుల ఖాతాలకు బ్యాంక్ అధికారులు టిజిటిడిసి ఖాతా నుంచి మళ్లిస్తుంది. ఇక్కడే శృతి తన వద్దకు వచ్చిన లీస్టును గోల్‌మాల్ చేస్తుంది. ఆ లీస్టులో తనకు తెలిసిన ఏడుమంది భాయ్‌ఫ్రెండ్ పేర్లను చేర్చేది. ఆ తరువాత ఆ లీస్టును బ్యాంక్ అధికారులు పంపేది.

లిస్టులో ఉన్న వ్యక్తుల ఖాతాలోకి బ్యాంక్ అధికారులు టిజిటిడిసి ఖాతాలోంచి నిధులను మళ్లించేవారు. ఇలా శృతి తన ఏడు మంది భాయ్‌ఫ్రెండ్‌ల ఖాతాలోకి టిజిటిడిసి నిధులు జమ అయిన తరువాత వాళ్లు ఆ నిధులను తిరిగి శృతికి చెందిన నాలుగు బ్యాంక్ ఖాతాలోకి మళ్లించేవారు. ఇలా వచ్చిన నిధులను శృతి తన సొంతానికి వాడుకుంది. అయితే టిజిటిడిసి ఎవరెవరికి ఎంత డబ్బులు చెల్లించారు అనే విషయంపై ఇటీవల ఎండిగా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతి ఆరా తీయగా రూ.రూ. 1,05,82,572 నిధులు తమకు సంబంధంలేని వ్యక్తులకు వెళ్లాయని తేలింది.దీనిపై ఆరా తీయగా నిందితులు పకనాటి హరి కృష్ణ యాక్సిస్ 922010028149275 4లోకి రూ.76,572 , బాలగాని శ్రావణ్ కుమార్ ఎస్‌బిఐ ఖాతా 35346507100లోకి రూ. 1,85,600, చింతల రాహుల్ ఎస్‌బిఐ 39116652539 ఖాతాలోకి రూ.81,91,200, గడ్డం ప్రీతిక డిబిఎస్ బ్యాంక్ ఖాతా 881037658427లోకి రూ. 3,85,600, ఎం. శ్రావణ్ కుమార్‌కు చెందిన ఎస్‌బిఐ 39692419322 3 ఖాతాలోకి రూ.86,000, పి. మల్లికా ఎస్‌బిఐ 34338491833 3 ఖాతాలోకి రూ.86,000, మెటకప్ప భాగ్యవతికి చెందిన ఎస్‌బిఐ 62283490986 ఖాతాలోకి రూ.3,86,000 డబ్బులు టిడిటిడిసి ఖాతాలోంచి వచ్చి పడ్డాయి. శృతి ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించి, తారుమారు చేసిందని విచారణలో తేలింది.

ఇద్దరు అధికారుల సస్పెండ్: ఎండి వల్లూరు క్రాంతి టిజిటిడిసి నిధులు రెండున్నర సంవత్సరాల నుంచి పక్కదారి పడుతున్నా సంబంధిత ఫైనాన్స్ అధికారులు పర్యవేక్షించలేదు. అసలత్వం ప్రదర్శించిన ఫైనాన్స్ విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌లు రాజేష్, మహేష్‌లను సస్పెండ్ చేసినట్లు టిజిటిడిసి ఎండి వల్లూరు క్రాంతి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

టెక్నాలజీ అభివృద్ధికి ఆయన పరిశోధనలు బాటలు పరిచాయి. నోబెల్ కమిటీ 2025లో 119వ సారి భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించింది. గత ఏడాది కృత్రిమ మేధలో అగ్రశ్రేణి శాస్త్రవేత్త జాన్ హోప్‌ఫీల్డ్, జియోఫ్రీ హింటన్‌లకు నోబెల్ లభించింది. ఇంగ్లాండ్ కేంబ్రిడ్జ్‌లో జన్మించిన జాన్ క్లార్క్ (83) బర్కెలే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో భౌతికశాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేస్తూ పరిశోధనా విద్యార్థులు డెవోరెట్, మార్టినిస్‌లతో కలిసి ఒక బృందంగా ఏర్పడి సూపర్ కండక్టర్స్‌లో క్వాంటమ్ టన్నెలింగ్‌పై 45 ఏళ్ళక్రితం పరిశోధనలు ప్రారంభించారు. దీంట్లో చాలా ప్రతికూల పరిస్థితుల్లో కణాలు తరంగాల రూపం దాలుస్తాయి. అసాధ్యం అనుకున్న ప్రామాణికత

## పురోగతికి కృషి (మొదటి పేజీ తరువాయి)

లను అందుకోలేకపోయినాగానీ అవరోధాలను అధిగమించి కణాలు తరంగాల రూపంలో అనేకవైపుల నుండి ఉద్భవించి ముందుకు చొచ్చుకుపోతాయి. డిజిటల్ టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌లో అవగాహన చేసుకోవాల్సిన కీలకాంశం ఇదే. శాంతా బార్బారాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ లో శాస్త్రవేత్త మార్టినిస్, యాలేలో శాస్త్రవేత్త డెవోరెట్‌లు రీసెర్చ్ విద్యార్థులుగా ఉంటూ క్లార్క్‌తో కలిసి పరిశోధనలు చేశారు. తనకు నోబెల్ బహుమతి రావడంపై జాన్ క్లార్క్ పాత్రికేయుల ప్రశ్నలకు ఫోన్ ద్వారా స్పందిస్తూ, ''ఇది నా జీవితంలో చాలా దిగ్భ్రాంతి కలిగించే విషయం'' అన్నారు. తనతోపాటు ఈ పరిశోధనలలో కృషి చేసినవారికి కూడా ఈ ఘనత దక్కుతుందని చెప్పారు. ''మా పరిశోధనా ఫలితం క్వాంటం కంప్యూటింగ్ ఆధారంగా జరిగిందన్నారు. ''మనం చూడని ఎత్తులకు సైన్స్ ను ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు ముందుకు తీసుకువెళ్ళారని ''ఫిజిక్స్ టు డే'' ఎడిటర్ ఇన్ చీఫ్ రిచర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్ చెప్పారు. చాలా సున్నితమైన కొలమానాలకు క్వాంటం సెన్సర్స్‌ను ఉపయోగిస్తారు. ఉదాహరణకు అయస్కాంతక్షేత్రంలో దీని ఉపయోగం ఎక్కువ. సమాచారాన్ని ఎన్‌కోడ్ చేసే క్రిప్టోగ్రఫీకి ఎంతగానో ప్రయోజనం ఉందన్నారు.

సిపిఐ జాతీయ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ ఇజ్రాయెల్ పాలస్తీనా ప్రజలపై అనైతిక దాడులకు తెగపడుతూ 65 వేలమందిని అమానుషంగా చంపివేసిందని, ఇందులో 50 శాతం మంది చిన్నారులు, మహిళలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ సైన్యాలు ఒకవైపు బాంబుల వర్షం కురిపిస్తూ మరోవైపు గాజాలో ప్రజలకు ఎలాంటి సహాయం అందకుండా అడ్డుకుంటూ వారిని ఆకలి చావులకు గురి చేస్తోందన్నారు. అగ్ర రాజ్యాలు ఖనిజాల సంపద, ముడి చమురు కోసం చేస్తున్న ఆధిపత్య దుర్మార్గాలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని ఆయన కోరారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ యావత్ ప్రపంచం, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి యుద్ధాన్ని నిరసిస్తూ తక్షణమే నిలిపివేయాలని కోరుతున్నా ఇజ్రాయిల్, అమెరికా ఏ మాత్రం పట్టించుకోకుండా దాడులు కొనసాగించడం గర్హనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఎఐటియుసి అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, కార్యదర్శి

## జాతి హననాన్ని నిలిపేయాలి (మొదటి పేజీ తరువాయి)

బి.వెంకటేశం, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, ఐఫ్టూ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ప్రధాన కర్యాదర్శి జి.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి అనూష, ప్రసన్న, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామరాజు, జె.కె.శ్రీనివాస్, మేడ్చల్‌జిల్లా నాయకులు ఇ.ఉమామహేష్, డి.జె.ప్రసాద్, ఎస్ఎన్.మూర్తి, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు డి.జి. నరసింహారావు, టి.సాగర్, విరసం నేత వరవరరావు, వామపక్ష పార్టీల నేతలు హమ్మేష్, గోవర్ధన్, చలపతిరావుతో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంఘీభావ ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు

పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో వామపక్ష నాయకులు, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ నాలా నుంచి ధర్నా చౌక్ వరకు భారీప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ ధర్నా చౌక్ చేరుకోగానే అనుమతులు లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. వందల సంఖ్యలో మోహరించిన పోలీసులు నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకునేందుకు యత్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అప్పటికే భారీగా చేరుకున్న పోలీసులు పలువురు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలను అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సిపిఐ జాతీయ సీనియర్ నాయకులు అజీజ్ పాషా, సిపిఐహైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఐఫ్టూ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, కార్యదర్శి డి.జి.నరేంద్ర ప్రసాద్, ఎవైఐఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు ఎండి.అబ్బాస్, టి.సాగర్‌తో విద్యార్థి, యువజన సంఘాలతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులను కార్యకర్తలు ఉన్నారు.

మారణకాండ ఆపలేదు. చివరకు నెతన్యాహూ ప్రపంచదేశాలమధ్య ఏకాకిగా మిగిలిపోయే పరిస్థితి వచ్చిన తరుణంలో ట్రంప్ గాజాలో యుద్ధం ముగించేందుకు 20 అంశాల ప్రణాళిక ప్రతిపాదించారు. ఈ ఒప్పందంపై ఇష్టంగానో,అయిష్టంగానో ఇజ్రాయెల్–హమాస్ అంగీకారం తెలియజేసిన తర్వాత బందీలు–ఖైదీల విడుదల ప్రక్రియను ఖరారు చేసేందుకు ఈజిప్టు,ఖతార్ మధ్యవర్తిత్వంతో కైరోలో ఇజ్రాయెల్–హమాస్ ప్రతినిధుల మధ్య పరోక్ష చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ చర్చలు మంగళవారంనాటికి రెండోరోజుకు చేరుకున్నాయి. 251 బందీల్లో పోయినవారు పోగా కొందరు గత మార్చినెలలో విడుదలయ్యారు. ఇంకా 48 మంది బందీలు హమాస్ వద్ద ఉన్నారు. వీరిలో కేవలం 20 మాత్రమే సజీవులుగా ఉన్నారు. వీరితోపాటు 28 మృతదేహాలను కూడా స్వాధీనం చేయాలని హమాస్‌ను ఇజ్రాయెల్ కోరుతోంది. కైరోలో చర్చలకు ఒక డెడ్‌లైన్ విధించారా? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్టీ సమాధానం తప్పించుకున్నారు. ఈ పరోక్ష చర్చల్లో హమాస్ తరపున అగ్రశ్రేణి నాయకుడు ఖలీల్ హయ్యా, అమెరికా తరపున స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ తదితర ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ ప్రణాళికలో మొదటిదశను అమలు

## సంక్షోభానికి రెండేళ్లు (మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు అనేక అంశాలపై అంగీకారం కుదిరింది. ట్రంప్ ప్రణాళికకు భారత్,చైనా సహా ప్రపంచవ్యాప్తంగా అనేకమంది నాయకులు తమ మద్దతు తెలియజేశారు. ఐతే హమాస్ ఆయుధాలను త్యజించడం, గాజాలో భవిష్యత్ పరిపాలన వంటి అనేక అంశాలపై ఇప్పటికీ అనిశ్చితి నెలకుని ఉంది. స్వతంత్ర పాలస్తీనా ఆవిర్భావానికి అంగీకరించబోమని ఇప్పటికీ నెతన్యాహూ చెబుతున్నారు. హమాస్ కూడా ట్రంప్ ప్రణాళికలో అనేక అంశాలను వ్యతిరేకించింది. వాటిపై తదుపరి చర్చలు జరగాలని కోరుతున్నది. హమాస్ ఆయుధాలు వదిలిపెడితే ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరించుకుంటుందనేది ఈ ప్రణాళికలో ఒక కీలక అంశం. ఆయుధాలను వదిలిపెట్టే విషయంపై హమాస్ స్పందించలేదు. ట్రంప్,టోనీ బ్లెయిర్ సారథ్యంలో గాజాలో కొత్త ప్రభుత్వం నడుస్తుందన్నది ట్రంప్ ప్రణాళిక ప్రతిపాదన. కాగా ప్రతికూల ఆలోచనలు చేయవద్దని, హమాస్ ఆయుధాలు వదిలిపెట్టాక విజయాన్ని ఆస్వాదించాలని నెతన్యాహూను తాను మందలించినట్లు వచ్చిన వార్తలను ట్రంప్ ఖండించారు. లేదు, లేదు, అవన్నీ అబద్ధాలు, ఈ ప్రణాళికపట్ల నెతన్యాహూ మొదటినుండీ చాలా సానుకూల దృక్పథంలో ఉన్నారని చెప్పారు. మరోవైపు ప్రపంచవ్యాప్తం గా పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ప్రజలు వేలు,లక్షల సంఖ్యలో ప్రదర్శనలు చేస్తున్నారు. బ్రిటన్‌లో ప్రధానమంత్రి కీర్‌స్టార్‌మర్ ఆదేశాలను కూడా ధిక్కరించి వేలాదిమంది లండన్‌లో విద్యార్థులు వీధుల్లోకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. విశ్వవిద్యాలయాలలో ''విద్యార్థుల నిరసనలు బ్రిటిష్ వ్యతిరేకం'' అని ప్రధానమంత్రి స్టార్‌మర్ విమర్శించారు. మరణించిన అమరులకు విద్యార్థులు నివాళులు అర్పించారు. పాలస్తీనియన్లకు సంఘీభావంగా లివర్‌పూల్‌లో 'బేక్ సేల్' కార్యక్రమం నిర్వహించారు.

ఇంకోవైపు ఇజ్రాయెల్‌లో కూడా వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి హమాస్ దాడుల్లో మరణించిన తమ ఆత్మీయులు,బంధువు లకు, స్నేహితులకు నివాళులు అర్పించారు. ప్రధానమంత్రి నెతన్యాహూ ఇప్పటివరకూ చేసిన తప్పిదాలకు వివరణ ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉత్తర గాజా నుండి ఇజ్రాయెల్‌లోకి రాకెట్ ప్రయోగం జరిగింది. ఈ దాడిలో ఎవరూ గాయపడలేదు.

## సిజెఐపై దాడి పిరికిపంద చర్య: సోరెన్

**రాంచీ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ఘటనను పిరికిపంద చర్యగా జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అభివర్ణించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్య ఆత్మపై దాడిగా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ గౌరవం, స్వాతంత్ర్యం ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా మూలస్థంభం. దానిపై చేయి ఎత్తడం అంటే దేశ రాజ్యాంగంపై చేయి ఎత్తడంతో సమానమని ఆయన అభిప్రాయపడ్డారు.

## పోరాటాన్ని త్యజిస్తాం (మొదటి పేజీ తరువాయి)

కార్యకాలాపాల నేపథ్యంలో మావోయిస్టు పార్టీ మాడ్ కమిటీ ఈలేఖను విడుదల చేయడం పట్ల తీవ్ర చర్చ సాగుతోంది. శాంతిచర్చల కోసం మే నెల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి, మా బ్యూరో ఇంచార్జ్ నేతృత్వంలో జరిపిన ప్రయత్నాలకు తాము పూర్తి మద్దతు ఇచ్చామని, పోరాటాన్ని త్యజించడానికి అంగీకరించామని పేర్కొన్నారు. కామ్రేడ్ సోను కార్యకర్తలకు చేసిన విజ్ఞప్తులను, ప్రజలకు చేసిన విజ్ఞప్తులను మేము చదివామని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విప్లవాత్మక ఉద్యమంలో అవసరమైన మార్పులు చేయడంలో సిసి విఫలమైందన్నారు. ఉద్యమం క్రమంగా బలహీన పడిందని, ప్రజలు మద్దతు కూడా తగ్గిందని, ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని అందిపుచ్చుకోవడం విఫలమైనట్లు చెప్పారు. ఈ పరిస్థితుల్లో సాయుధ పోరాటాని విడిచి అన్ని స్నేహపూర్వక సంస్థలతో కలిసి ప్రజలలో పనిచేసేందుకు నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. మా నిర్ణయాన్ని డివిజన్‌లోని పార్టీకి, పీపుల్స్ కన్‌స్ట్రక్షన్ కార్మికులకు వివరించాల్సి ఉందని, ఈ సాయుధ పోరాటాన్ని సాధ్యమైనంత తక్కువ కాలంలో త్యజించడానికి సిద్ధంగా ఉన్నామని, మాడ్ ప్రాంతంలో చట్ట విరుద్ధమైన ఎటువంటి కార్యకలాపాలు జరగవని ప్రకటిస్తూనే, పోలీసు గస్తీని ఈ నెల 15వరకు ఆపాలాని, సాయుధ పోరాటాన్ని నిలుపుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ లేఖలో రాణిత అలియాస్ సనిత పేర్కొన్నారు.

## వివరాలు ఇవ్వండి (మొదటి పేజీ తరువాయి)

కారణాలు తెలియజేయలేదని చెప్పిన తర్వాతే న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలను జారీచేసింది. ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ నిర్వహించాలని ఎన్నికల సంఘం జూన్ 24న తీసుకున్న నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్ల బ్యాచ్‌ను విచారించిన ధర్మాసనం ఓటర్లను మినహాయించిన ఏ సమాచారాన్ని అయినా గురువారం (అక్టోబరు 9)నాటికి ఎన్నికల సంఘానికి సమర్పిస్తుందని, ఆ సమయంలోనే ఈ పిటిషన్లపై తదుపరి విచారణ జరుగుతుందని పేర్కొంది. అత్యున్నత న్యాయస్థానం దీనిపై మాట్లాడుతూ అందరి దగ్గర ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ ఉన్నదని, సెప్టెంబరు 30న తుది జాబితా కూడా ప్రచురించబడిందని, అవసరమైన వాటిని తులనాత్మకమైన విశ్లేషణ ద్వారా అందించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టు ఆదేశాలవల్ల ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా జరిగేందుకు వీలు ఏర్పడిందని ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ రాకేష్ ద్వివేదికి జస్టిస్ బాగ్చీ వెల్లడించారు. ప్రారంభంలోనే, ఆర్‌జెడి తరపున వాదించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఎన్నికల సంఘం అవసరమైన నియమాలను పాటించలేదని, ఓటర్ల జాబితాను శుభ్రపరచడానికి బదులుగా సమస్య జటిలం అయ్యిందని వాదించారు. ముసాయిదా జాబితా ప్రచురించబడిన తర్వాత దాఖలు చేసిన అభ్యంతరాలను తొలగించిన 3.66లక్షల ఓటర్ల జబాబితాను ఎన్నికల సంఘం ఇవ్వలేదని ప్రశాంత్‌భూషణ్ ధర్మాసనానికి సమర్పించారు. బిహార్‌కు చెందిన యాక్టివిస్ట్ తరపున న్యాయవాది వృందా గ్రోవర్ హాజరయ్యారు. బిహార్ ఎన్నికల ప్రధానాధికారి వెబ్‌సైట్ కేవలం విభజించబడిన డేటాను మాత్రమే ఇస్తోందని వాదించారు. 243మంది శాసనసభ్యులు ఉన్న బిహార్ అసెంబ్లీకి నవంబరు 6న తొలివిడత 121 సీట్లకు ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహించనుంది. మిగతా 122సీట్లకు నవంబర్ 11న పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబరు 14న ఓట్ల లెక్కింపు జరుపనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.




# జనరల్
STATE & REGIONAL NEWS

## సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి దురదృష్టకరం: వినోద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ఖండించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని సంరక్షించేందుకు ప్రధాన రాజకీయ పక్షాలు పాటు పడాలని, కానీ దేశంలో అలాంటి పరిస్థితులు లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నేతలు విద్వేషపూరిత భావాలు వ్యక్తపరుస్తూ, ప్రజలను రెచ్చగొడుతున్నారని, అందుకే ఇలాంటి దాడి చేసే ఆలోచనలు వస్తున్నాయని, తమ వెనుక నాయకులు ఉన్నారనే ధీమా ఉండటమే ఈ దాడి జరిగేందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# డిజిటల్ వ్యవసాయంలో అగ్రగామిగా తెలంగాణ

### జర్మనీ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను అగ్రగామిగా నిలపాలన్నదే సంకల్పమని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పెట్టుబడి వ్యయం, రసాయనాల వినియోగాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే తమ సంకల్పమని వివరించారు. సాగులో నూతన ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామన్నారు. కృత్రిమ మేధ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఒటి) లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌ను రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు ఎలా అనుసంధానం చేయాలనే అంశంపై మంగళవారం సచివాలయంలో జర్మనీకి చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ' ప్రతినిధుల బృందంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంది. రాష్ట్ర జనాభాలో సుమారు 55 శాతం మందికి జీవనోపాధి కల్పిస్తోంది. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకు తన చేయూతను అందిస్తోంది. మరో వైపు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ కు రాష్ట్రం గ్లోబల్ హబ్ గా మారింది. ఇలాంటి తరుణంలో డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను ఆదర్శంగా నిలపాలని సంకల్పించాం' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'రోజురోజుకూ వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. పైగా... సాగులో పురుగు మందుల వినియోగం పెరిగి పర్యావరణానికి ఎంతో హానీ జరుగుతోంది. ఇలాంటి తరుణంలో పెట్టుబడి వ్యయం, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలంటే కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను వ్యవసాయానికి అనుసంధానించాల్సిన అవసరం ఉంది. అందుకు అనుగుణంగానే మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తోంది' అని వివరించారు. 'అత్యాధునిక సెన్సార్ల ద్వారా నేల స్వభావాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా పురుగు మందుల వినియోగాన్ని తగ్గించొచ్చు. ఫలితంగా రసాయనాల కొనుగోలు ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గుతుంది. రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. సుస్థిరమైన, క్లైమేట్‌రెసిలియెంట్ వ్యవసాయ పద్ధతులకు మార్గం సుగమం అవుతుంది' అని చెప్పారు. అనంతరం... రాష్ట్రంలో గత రెండేళ్లుగా వేములవాడకు సమీపంలోని మూడు గ్రామాల్లో 'ఫ్రాన్‌హోఫర్ హెచ్‌హెచ్ఐ' ఆధ్వర్యంలో అమలవుతున్న 'యాక్సిలరేటింగ్ క్లైమేట్ రెసిలియెంట్ అగ్రికల్చర్ ఇన్ తెలంగాణ' ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చొరవ చూపాలని సంస్థ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పోరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, జర్మనీ రాయబార కార్యాలయం( న్యూఢిల్లీ) ఫుడ్ అగ్రికల్చర్ డివిజన్ హెడ్ వోల్కర్ క్లైమా, ఫ్రాన్ హోఫర్ హెచ్ హెచ్ఐ ప్రతినిధులు డా.సెబాస్టియన్ బోస్సే, డా.రఘు చలిగంటి తదితరులు పాల్గొన్నారు.



## కమ్యూనిస్టు దిగ్గజం రాజ్ బహదూర్ గౌర్‌కు నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కమ్యూనిస్టు దిగ్గజం, కార్మిక అగ్రనేత డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్‌కు సిపిఐ నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. రాజ్ బహదూర్ గౌర్ వర్థంతి సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి సాబీర్ పాషా, రమావత్ అంజయ నాయక్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లివుల్లా ఖాద్రి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

## భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు ఈ నెల 26న రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రైలు 'భవ్య గుజరాత్' ప్యాకేజ్ (9 రాత్రులు 10 రోజులు) ప్యాకెజ్‌తో ఉంది. మధ్యాహ్నం 03:00 గంటలకు రేణిగుంట రైల్వే స్టేషన్ నుండి ఈ రైలు సికింద్రాబాద్‌కు మరుసటిరోజు ఉదయం 08:00 గంటలకు, నిజామాబాద్ ఉదయం 11:30 గంటలకు, నాందేడ్ మధ్యాహ్నం 02:00 గంటలకు, పూర్ణా జంక్షన్ మధ్యాహ్నం 02:50 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు ద్వారకా, సోమనాథ్, అహ్మ దాబాద్, ఎకతానగర్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ రైలు ప్యాకేజ్ ధరలు స్లీపర్ కోచ్ రూ.18,400, త్రీటైర్ ఎసి రూ.30,20, టూటైర్ ఎసిరూ.39,900 ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో రోజుకు మూడు భోజనాలు, వసతి, రవాణా సదుపాయం, ప్రతి బోగీలో ఐఆర్‌సిటిసి సిబ్బంది అందుబాటులో ఉంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ : www.irctctourism.com ఫోన్ నంబర్లు: 9701360701, 9281030749, 9281030750, 9281495843పై సంప్రదించాలని ఆయన తెలిపారు.

# ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ప్రకారం కాళేశ్వరం పునరుద్ధరణ

### పెండింగ్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత
### ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్షా సమావేశం..



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారం కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరించనున్నట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత–చెవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుతో పాటు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ (ఎస్ఎల్‌బిసి) టన్నెల్‌ను ఎట్టి పరిస్థితుల్లోను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి తన చాంబర్‌లో మంగళవారం ఉన్నతాధికారులతో విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రథమ ప్రాధాన్యత కింద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో తుమ్మడిహట్టి నిర్మాణం చేపడుతుందన్నారు. ఇందుకు ఇంజనీరింగ్ బృందాలు రెండు ప్రత్యామ్నాయ కాలువ మార్గాలను పరిశీలిస్తున్నాయన్నారు. ఇందులో మైలారం నుండి 71.5 కిలోమీటర్ల గ్రావిటీ కాలువ,14 కిలోమీటర్ల సొరంగం ద్వారా సుందిల్లాకు నీరు తరలించడం, మరో మార్గం ప్రకారం మధ్యలో పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఎల్లంపల్లి ద్వారా నీటిని మళ్లించడం ఈ రెండు ప్రత్యామ్నాయాలో అన్నివిధాలుగా అనుకూలమైన మర్గాన్ని ఎంచుకోనున్నట్లు తెలిపారు. భూగర్భ ఎస్ఎల్‌బిసి టన్నెల్ తెలంగాణ నీటి పారుదల నిర్మాణంలో కీలక భాగమని, దీనిని డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సాంకేతిక, పరిపాలనా అడ్డంకులను తొలగిస్తున్నామని, ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ఉన్నత స్థాయి పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జాతీయ సంస్థలు మరియు నిపుణ సంస్థలను పునరుద్ధరణ పనుల్లో పాల్గొనాలని కోరామని చెప్పారు. ప్రముఖ ఐఐటీ ప్రధాన సాంకేతిక భాగస్వామిగా వ్యవహరించే అవకాశం ఉందని, ఇది తెలంగాణ నీటి పారుదల శాఖకు చెందిన చీఫ్ డిజైన్ ఆర్గనైజేషన్ (సిడిఓ)తో కలిసి పని చేస్తుందని వివరించారు. వర్షాకాలానికి ముందు పరీక్షలు పూర్తచేసి వర్షాకాలం అనంతరం పూర్తి పునరుద్ధరణ పనులను ఏడాదిలో పూర్తి చేయనున్నామని తెలిపారు. పునరుద్ధరణ ప్రక్రియ ఎన్‌డీఎస్ఏ సిఫారసులకు అనుగుణంగా ఉంటుందని, ఏదైనా వ్యత్యాసం లేదా ఆలస్యం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వారానికి ఒకసారి పురోగతి సమీక్షలు నిర్వహించి సాంకేతిక ఫలితాలను పద్ధతిగా నమోదు చేయాలని ఆదేశించారు. న్యాయ పరమైన అంశాల పరంగా కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ II (కెడబ్ల్యూడీటీ II) ముందు జరుగుతున్న విచారణల పురోగతిని సమీక్షించారు. సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తెలంగాణ వాదనలు ముగించారని, ఆంధ్రప్రదేశ్ తమ సమర్పణలను ప్రారంభించిందని తెలిపారు. ప్రతి సమావేశానికి సంబంధించిన సవివరమైన నివేదికలను సిద్ధం చేయాలని, ఢిల్లీలోని న్యాయ బృందంతో, రాష్ట్ర సుప్రీంకోర్టు న్యాయవాదులతో సమన్వయం చేసుకోవడం ద్వారా వాదనల్లో ఏకరూపత ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమ్మక్క–సారక్క ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యూసి)ను సంప్రదించి నీటి కేటాయింపు మరియు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టిఏసీ) ఆమోదం కోరిందని, ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని అన్నారు. సీతమ్మసాగర్, మొడికుంటవాగు, చనక–కోరటా పంపిణీ వ్యవస్థలు కాళేశ్వరం ప్రాజెక్టుల పెట్టుబడి ఆమోద దరఖాస్తులు కేంద్రానికి సమర్పించామని, వాటి సమీక్ష ప్రధాన్ మంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) పరిధిలో తుది దశకు చేరుకుందని తెలిపారు. దేవదుల ప్రాజెక్టు శాఖ ప్రధాన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఒకటని, ప్యాకేజీతో పాటు అదనపు మూడవ దశ ప్యాకేజీలకు ఆమోదం లభించిందని తెలిపారు. డిండి ప్రాజెక్టుపై సమగ్ర సమీక్షా నివేదిక సిద్ధం చేయాలని, ఇందులో భౌతిక పురోగతి, నిధుల వినియోగం, పెండింగ్ పనులు ఉండాలని ఆదేశించారు. నీటి పారుదల రిజర్వాయర్ల మట్టిని, అవక్షేపాలను తొలగించే ప్రతిపాదనతో అదనపు ప్రభుత్వ వ్యయం లేకుండా రిజర్వాయర్ల సామర్థ్యాన్ని మెరుగుపర్చే స్వయం సమర్థ విధానాన్ని రూపొందించడమే లక్ష్యమని తెలిపారు.

# 'ఇందిరమ్మ ఇండ్ల'పై ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరా

### బెంగుళూరులో ఖర్గేను పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై బెంగుళూరులో విశ్రాంతి తీసుకుంటున్న ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న 'ఇందిరమ్మ ఇండ్ల పథకం' నిధుల చెల్లింపులు, లబ్ధిదారుల ఎంపిక విధానం, ఒక్కో ఇంటికి యూనిట్ కాస్ట్ తదితర అంశాలను మల్లికార్జున్ ఖర్గే అడిగి తెలుసుకున్నట్టు మంత్రి పొంగులేటి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో గడచిన పది సంవత్సరాలలో పేదలు ఆశించిన మేరకు ఇండ్ల నిర్మాణాలు జరగకపోవడంతో ఇందిరమ్మ ఇండ్లకు డిమాండ్ అధికంగా ఉన్నదని మంత్రి పొంగులేటి వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మొదటి దశలో ఈ ఏడాది రూ. 22,500 కోట్లతో నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున 4.50 లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, లబ్దిదారుల ఎంపిక పూర్తయిందని, దాదాపు మూడు లక్షలా ఐదు వేల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి లబ్దిదారులకు ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్దిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, పేదరికమే అర్హతగా ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. అడవులను నమ్ముకొని జీవించే చెంచులకు కూడా తొలిసారిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎటువంటి అవినీతి అక్రమాలు చోటుచేసుకోకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఒక 'కాల్ సెంటర్'ను ఇటీవల ఏర్పాటు చేశామని , కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులపైన 24 గంటల్లోనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరు బాగుందని ఇలాగే ముందుకు సాగాలని ఖర్గే అభినందించినట్టు మంత్రి పొంగులేటి తెలిపారు.

**ఖర్గేను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం బెంగళూరులో పరామర్శించారు. ఇటీవల పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని, పూర్తి ఉత్సాహంతో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి ఆయన మార్గదర్శకత్వం అత్యంత అవసరమన్నారు.



## కొత్త సంస్కరణలతో ఉప ఎన్నికలు

### పార్టీల ప్రతినిధులతో ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో, ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎంఐఎం సహా పలు పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. రానున్న ఉప ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన నూతన సంస్కరణలతో నిర్వహించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సంస్కరణలు తొలిసారిగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో, అలాగే దేశవ్యాప్తంగా జరగనున్న 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు. సిఈఓ సుదర్శన్‌రెడ్డి ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలతో ఏర్పాట్లను సమీక్షించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు సిఈఓ లోకేశ్ కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఉప సిఈఓలు హరి సింగ్, సత్యవాణి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ముఖ్యంగా తీసుకొచ్చిన చర్యలు ఇవి..**

- ☞ ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా ఏర్పాట్లు.
- ☞ ఓటర్లు తమ అభ్యర్థులను సులభంగా గుర్తించేందుకు ఈవిఎంలపై రంగు ఫోటోలు ఉంచడం.
- ☞ మహిళా ఓటర్ల పాల్గొనడం పెంచేందుకు మహిళా సిబ్బందిని అదనంగా నియమించడం.
- ☞ వృద్ధులు, దివ్యాంగుల కోసం సౌకర్యాలు, వీల్ చెయిర్లు, ర్యాంపులు, పికప్, డ్రాప్ సదుపాయాలు.
- ☞ రియల్‌టైమ్ ఓటింగ్ టర్నౌట్ మానిటరింగ్ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డులు,మొబైల్ యాప్‌లు.
- ☞ సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో కృత్రిమ మేధస్సు(ఎఐ)ఆధారిత పర్యవేక్షణ, జిపిఎస్ ట్రాకింగ్.
- ☞ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) ఉల్లంఘనలపై కఠిన చర్యలు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ.
- ☞ పర్యావరణహిత ఎన్నికలు, పేపర్ వినియోగం తగ్గించడం, డిజిటల్ సమాచార మార్పిడి ప్రోత్సాహం.

# సిజెఐపై దాడి ఆక్షేపణీయం

### హైకోర్ట్ ఎదుట ఐఎఎల్ నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు న్యాయవాది రాకేష్ కిషోర్ బూటును విసిరి దాడికి యత్నించిన ఘటనను నిరసిస్తూ తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్, న్యాయవాద సంఘాలు హైదరాబాద్‌లోని హైకోర్ట్ ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.జగన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ పొన్నం అశోక్, చిక్కుడు ప్రభాకర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రఘునాథ్, ఎస్.జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎఎల్ అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ భారత న్యాయవ్యవస్థ, విశ్వసనీయతను దెబ్బతీయడం, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను విఘాతం కలిగించే పద్ధతులు, న్యాయ మూర్తులపైన మానసిక ఒత్తిడి ద్వారా ప్రయోజనాలు పొంది, అనుకూల తీర్పులు కావాలనుకుని, చేసే విఘాత చర్యలు దేశ సమగ్రతకు నష్టదాయకమని అన్నారు. ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని, రక్షించుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ పార్టీలు, న్యాయవాదులు, సముచిత పాత్రను నిర్వర్తించడం ఒక్కటే మార్గమని ఆయన చెప్పారు. సుప్రీంకోర్టులో జరిగిన ఘటన అత్యంత హేయమైనదని, న్యాయవ్యవస్థను, న్యాయవాదుల సమగ్రతను దెబ్బతిసే విధంగా ఉన్నదని, ఈ ఘటనను న్యాయవాదులంతా ముక్తకంఠంతో ఖండించడం హర్షణీయమని తెలిపారు. ఘటనకు బాధ్యులైన న్యాయవాదిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎ.జగన్ మాట్లాడుతూ సమాజంలో బాధ్యత కలిగిన న్యాయవాదులు న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ దాడి ఘటనను ఖండించారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

## రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం మడమతిప్పని పోరాటం


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి రిజర్వేషన్లపై చట్టబద్ధతకు, హక్కుల సాధనకు ఎంతవరకైనా పోరాడుతామని పలువురు వక్తలు తెలిపారు. అన్ని బిసి కుల సంఘాలను కలుపుకొని జెఎసిగా ఏర్పాటై, రాజ్యాధికారమే ధ్యేయంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంకంటే బలమైన బిసి ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లో బిసి ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన ''బిసిలకు 42శాతం రిజర్వేషన్లు – న్యాయ వివాదాలు పరిష్కారంపై బిసి సంఘాల సమాలోచన'' కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా బిసి జాతీయ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి ఎస్‌సి, ఎస్‌టి జెఎసి చైర్మన్ డా.విశారదన్ మహారాజ్, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందన్నారు. మండల కమిషన్‌కు వ్యతిరేకంగా కమండల ఉద్యమం నడిపిన నీచ చరిత్ర బిజెపిదని విమర్శించారు. ఏ ఉద్యమం చేయకపోయినా ఆగమేఘాల మీద ఈడబ్ల్యూఎస్ బిల్లును ప్రవేశపెట్టి, నాలుగురోజుల్లో అమలు చేసిన కేంద్రం మెజార్టీ వర్గమైన బిసిలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. సమావేశంలో బిసిపిఎఫ్ అధ్యక్షులు కుమార్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ప్రణీల్ చందర్, సర్పంచ్‌ల సంఘం జెఎసి చైర్మన్ యాదయ్య గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **RACHAPALLY RAJU,** S/o. **MOGILI,** HNO: 3-92, V:- BIJIGIRI SHARIF, M:- JAMMIKUNTA, D:- KARIMNAGR, TELANGANA STATE - 505475. HAVE changed my minor son's name from **RACHAPALLY HARSHITH** (old name) to **RACHAPALLY RISHIRAJ VARMA** (new name) For All Purpose

# 'గ్రూప్ –1' నియామకాల్లో 'సుప్రీం' ఆదేశాలు అమలు

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** న్యాయస్థానాలు తుది తీర్పు వచ్చే వరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ అభ్యర్థుల మెయిన్ సమాధాన షీట్లను డిస్పోజ్ చేస్తే, నిరుద్యోగులతో కలిసి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను స్తంభింపచేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గ్రూప్ 1 నియామకాల్లో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందజేసినప్పటికీ, ఆ ఉద్యోగాలపై ఎలాంటి హక్కులేదని సర్వోన్నత న్యాయస్థానం ప్రకటించిందంటేనే, ఈ మొత్తం ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని తప్పులను చేసిందో సుప్రీం కోర్టు ఎత్తిచూపినట్టేనని కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బిఎస్‌పి నాయకులు సురేశ్ గౌడ్, తలారి బాలరాజ్ కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు రంగు నవీన్ ఆచారి, సంపత్ గౌడ్, నరేశ్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం, కాళేశ్వరం**
మహాదేవపూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

Rc.No.108/2025 (e-టెండర్ & సీల్డ్ టెండర్ - కం - బహిరంగ వేలం ప్రకటన) తేది: 07.10.2025

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, సదరు దేవస్థానం, యొక్క ఈ దిగువ లైసెన్సు హక్కుల కొరకు తేది: 15.10.2025 బుధవారం సాయంత్రం 3.30 గం.ల నుండి ఈ దేవస్థాన కార్యాలయం వద్ద e-టెండర్ & సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించబడును.

| క్ర.సం. | పాట వివరము | షాపు నెంబర్ | టెండర్ షెడ్యూల్ ధర | కాలపరిమితి | డిపాజిట్ సొమ్ము |
|---|---|---|---|---|---|
| 1. | హోటల్ నడుపుకొనే హక్కు | New Complex Shop No. 5&6 | 500/- | 01.11.2025 నుండి 30.09.2027 | 1,00,000/- |

టెండర్ షరతులు:
**1.** సీల్డ్ టెండరు దరఖాస్తు తీసుకొను చివరి తేది: 14.10.2025 సా. 4.00 గం.ల వరకు. **2.** సీల్డ్ టెండర్ తేది: 15.10.2025 సాయత్రం. 03.00 గం.ల నుండి 03.30 గం.ల వరకు స్వీకరించబడును. అనంతరం సాయత్రం 3.30 గంటల నుండి బహిరంగ వేలం నిర్వహించబడును. తరువాత సీల్డ్ టెండర్ మరియు e-టెండర్ ఓపెన్ చేయబడును. **3.** సీల్డ్ టెండర్ డిపాజిట్ సొమ్ము EO, SKMSD వారి పేరున తీసిన డి.డి. లేదా తాత్కాలిక నగదు రసీదు జతపరుచ వలెను. **4.** e-టెండర్‌లో https://tender.telangana.gov.in ద్వారా పాల్గొనవచ్చును. **5.** ఇట్టి టెండర్లలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. మిగతా షరతులు టెండర్ షెడ్యూల్ లో పొందుపరచ బడును

DIPR R.O. No. : 8866-PP/CL/ADVT/1/2025-26, Date: 07-10-2025 సం/- కార్యనిర్వహణాధికారి

## చిత్రియాల గ్రామంలో దొంగల బీభత్సం

**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో మంగళవారం 11 గంటల సమయంలో గ్రామానికి చెందిన జూలూరు మహేష్ తండ్రి కిష్టయ్య ఇంట్లో దొంగలు పడి మూడున్నర తులాల బంగారం, 65 తులాల వెండి, రూ. 61వేల నగదు అపహరణకు గురైనట్లు జూలూరు మహేష్ మంగళవారం చందంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా డిండి సిఐ బీసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ టీంలతో తనిఖీ నిర్వహించారు. అనంతరం ఫింగర్ ప్రింట్ బృందాలతో వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులకు త్వరలోనే పట్టుకుంటామని, గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు తిరుగుతున్నట్లు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** మేస్త్రీ పనితో పొట్టకూటి కోసం పనిచేసుకుంటూ బతుకుతున్న ఓగుర్తు తెలియని వ్యక్తిని అనుకోని రోడ్డు ప్రమాదంతో మృత్యువు వెంటాడింది. పోలీసులు తెలిపిన విషాద సంఘటన వివరాల ప్రకారం మృత్యువాత పడ్డ వ్యక్తి పేరు శ్రీను అని, ఇతను ఒంగోల్ నుండి మేస్త్రి పని నిమిత్తం భువనగిరి నుండి తుర్కపల్లి మండలం రామోజీ నాయక్ తండాకు వస్తున్న తరుణంలో పెద్దతండ గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం జరిగి సదరు వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయని, వెంటనే అతన్ని గాంధీ హాస్పిటల్‌కి తరలించడం జరిగిందని తెలిపారు. కాగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి గాంధీ హాస్పిటల్ చనిపోయాడని తెలిపారు. మృతుని మెడ మీద అమ్మ అని, కుడి చేతి మీద లవ్ సింబల్, స్టార్ గుర్తులతో పచ్చబొట్లు ఉన్నాయని తెలిపారు. ఎవరికైనా మృతుడు శ్రీను వివరాలు తెలిస్తే క్రింది 8712662479, 8712662805. నంబర్లకు సమాచారం ఇవ్వాలని తుర్కపల్లి ఎస్ఐ తక్కుద్దీన్ ప్రజలను కోరారు.

## స.హ చట్టం ద్వారా పాలనలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుంది

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 12 వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత పౌర సమాచార అధికారులు, పబ్లిక్ అథారిటీలపై ఉందన్నారు. ఆయా పబ్లిక్ అథారిటీలు వారి దగ్గర ఉన్న సమాచారాన్ని పౌరులు కోరితే ఇవ్వాలని, ఏ పద్ధతిలో వారు సమాచారం కోరితే ఆ పద్ధతిలో ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎట్టి పరిస్థితులలో తప్పుడు సమాచారం ఇవ్వవద్దని హెచ్చరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులు, యంత్రాంగంలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఆర్‌డిఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎఫ్ఓ సతీష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్ట్ కు భారీ వరద..

ఇన్ ఫ్లో...229950 క్యూసెక్కులు..

22 గేట్ల ద్వారా నీటి విడుదల...

**ప్రజాపక్షం/నందికొండ:** మూడు రోజులు శాంతించిన కృష్ణమ్మ మళ్ళీ తన ఉగ్రరూపాన్ని చూపించింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం ప్రాజెక్టు 6 గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి 229950 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్ కు విడుదల చేస్తున్నారు.ఆదివారం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీ టిమట్టం 587.50 అడుగులుగా ఉండి 50 వే ల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వద్ద ప్రాజెక్టు అధికారులు మొత్తం గేట్లను మూసివేశారు అయితే అప్పటి నుండి మంగళవారం వరకు వేలల్లో కొనసాగిన ఇన్ ఫ్లో ఒకేసారి లక్షా ఎనబై వేల క్యూసెక్కులకు పెరగడం అదే సమయంలో ప్రాజెక్టు నీటిమట్టం కూడా గరిష్ట సాయికి చేరుకోవటంతో వెంటనే మొదట 4 గేట్లను తరువా త 16 గేట్లను ఆ తరువాత22 గేట్లను 5అడుగుల మేర పైకి లేపి 177518 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు.అయితే కుడి ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తూ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 229950 క్యూసెక్కు ల నీరు మొత్తం అవుట్ ఫ్లో గా విడుదలవుతుంది.సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు మంగళవారం సాయంత్రానికి 589.70 అడుగులుగా ఉండి నీటి నిల్వ 312.0450 టీఎంసీలకు 311.1486 టీఎంసీలుగా ఉన్నది.


## శంకరమ్మకు చివరి వీడ్కోలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బచ్చనగోని గాలయ్య మాతృమూర్తి బచ్చన గోని శంకరమ్మ పార్థివ దేహం పై సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావులు పూల మాలలు సమర్పించి ఆమెకు చివరి వీడ్కోలు పలికారు. అంతిమయాత్రలో పార్టీ నాయకత్వం చివరి మజిలీ వరకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు చెడే చంద్రయ్య, బొలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కురుమిద్ద శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, బోడ సుదర్శన్, ఎండి ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మహేందర్, బొలుగురి నరసింహ, గురుజ రామచంద్రం, తిరుపారి వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, బబ్బూరి శ్రీధర్, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహ, పట్టణ సిపిఐ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ సిద్ధం కావాలి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గోద శ్రీరాములు పిలుపు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీకి చేసి విజయానికి సంసిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. తుర్కపల్లి మండల కేంద్రంలో వల్లపు భగవంతు అధ్యక్షతన కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణలు హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల షెడ్యూల్ వచ్చినందున ఆలేరు నియోజకవర్గంలోని గ్రామ శాఖలన్ని సమావేశం జరుపుకొని ఎన్నికలకు సిద్ధం కావాలని తెలిపారు. బలమున్నచోట్ల సర్పంచ్, ఎంపీటీసీలకు, పోటీ చేయుటకు నాయకత్వం సిద్ధం కావాలని కోరారు. ఎన్నికలలో మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి సిలువేరు దుర్గయ్య, సహాయ కార్యదర్శి గుంటిపల్లి సత్తయ్య, కలకుంట్ల సత్యనారాయణ, భూమయ్య, పేద్దులు, బుఖ్య హరి, భానోత్ యాదగిరి, దొనికెల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలుగుతండాలో ఉద్రిక్తత

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** పిఏ పల్లి మండలంలోని పలుగు తండాలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది.తండాకు చెందిన రామావత్ బాలాజీ నాయక్ నూటికి పది నుండి 16 రూపాయల వరకు వడ్డీ ఇస్తానని చెప్పి పేద ప్రజలకు ఆశ చూపి ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని కోట్ల రూపాయలను వసూలు చేశాడు.మొదట్లో వడ్డీ సక్రమంగానే చెల్లించి నమ్మకం కలిగించుకున్నాడు. తదానంతరం కొద్ది నెలలుగా ఇచ్చిన డబ్బులు గాని వడ్డీ గానీ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందిన పలువురు బాధితులు మంగళవారం నాడు పలుగుతండాలోని తన విలాసవంతమైన భవనాన్ని ధ్వంసం చేయడంతో పాటు ఇంట్లోనే సామాగ్రిని ఆరుబయట వేసి తగలబెట్టారు.

# పొరపాట్లకు తావివ్వొద్దు

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా, అలాగే నోటిఫికేషన్ జారీలో ఎలాంటి తప్పులు, కొట్టివేతలు, దిద్దివేతలు ఉండొద్దు : కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశం




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీ, జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంగళవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నామినేషన్లు మొదలుకొని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎలాంటి తప్పు జరగకుండా చూసుకోవాలని, ముఖ్యంగా నామినేషన్ల సందర్భంగా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి రాజ్యాంగపరమైన అంశాల పట్ల పొరపాట్లకు తావివ్వద్దన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలపట్ల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మొదటి విడత అక్టోబర్ 9న, రెండవ విడత ఎన్నికలకు అక్టోబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మాస్టర్ ట్రైనర్ రమేష్ జడ్‌పిటిసి, ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియపై పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నోటీసు జారీ చేయడం మొదలుకొని నామినేషన్ల స్వీకరణ, తీసుకోవల్సిన జాగ్రత్తలు, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, బరిలో ఉన్న అభ్యర్థుల ప్రకటన తదితర అన్ని అంశాలను వివరించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా, అలాగే నోటిఫికేషన్ జారీలో ఎలాంటి తప్పులు ఎలాంటి కొట్టివేతలు, దిద్దివేతలు ఉండరాదని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆదేశాల ప్రకారం 9వ తేదీ ఎంపిటిసి, జడ్‌పిటిసి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ జారీతోపాటు, ఓటరు జాబితాను సైతం ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్ని మండలాల ఆర్‌ఓలు, సహాయ రిటర్నింగ్ అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, స్వీకరించాల్సిన ధృవపత్రాలు ఇతర అన్ని అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సీఇఓ, ఇంచార్జి డిఆర్‌డిఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎఫ్ఓ సతీష్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# 1 క్వింటా 20 కేజీల గంజాయి సీజ్

ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

జిల్లా ఎస్‌పి కె నరసింహ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** నిషేధిత గంజాయి రూ.60లక్షల విలువైన 1 క్వింటా 20 కేజీలను కోదాడ పట్టణ, సిసిఎస్ పోలీసులు స్వాధీనం చేసుకొని ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్‌పి కె నరసింహ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత నెల 23వ తేదీన కోదాడ పట్టణ పరిధిలోని 65వ జాతీయ రహదారి వెంబడి దాదాపు 110 కేజీల గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు వదిలిపెట్టి వెళ్ళగా కోదాడ పట్టణ పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపగా, మూడు ప్రత్యేక బృందాలుగా పోలీసులు ఏర్పడి విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సిసి ఫుటేజ్, నమ్మదగిన సమాచారంతో పోలీసులు మంగళవారం జాతీయ రహదారి సమీపంలోని కట్టకొమ్ముగూడెం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఓ కారును వెంబడించి పట్టుకోగా హైదరాబాద్ లోని ఏ.ఎస్.రావు నగర్‌కు చెందిన కరణం రమేష్, ఏపి రాష్ట్రంలోని విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలం సీతారామపురం గ్రామానికి చెందిన చాపల అశోక్, అదే గ్రామానికి చెందిన చాపల ఎరకమ్మ అలియాస్ రోహిణిలను పట్టుకొని వారి వద్ద నుండి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా గత నెల కోదాడ పట్టణ పరిధి 110 కేజీల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేస్తుండడంతో తాము గంజాయితో దొరుకుతామనే భయంతో దానిని వదిలేసి వెళ్ళినట్లు అంగీకరించారు. ఈ గంజాయిని ఒరిస్సా నుండి కిలో రూ. 5 వేలు చొప్పున కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు ఒప్పుకున్నారు. వీరి నుండి 120 కేజీల గంజాయిని సీజ్ చేయడంతో పాటు టిఎస్ 08 ఎఫ్ ఆర్ 6521 నంబర్ గల కారును, 8 సెల్‌ఫోన్లను సీజ్ చేసి అనంతరం కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన చేధించడంలో ప్రతిభ కనబర్చిన కోదాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణ, కోదాడ టౌన్ ఎస్ఐ హనుమాన్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ బాల్తు శ్రీనివాస్, కానిస్టేబుళ్ళు ఎస్ యల్లారెడ్డి, కె సతీష్, యం వెంకటేశ్వర్లు, కె రాంబాబు, ఎస్‌కె ఫరీద్‌లను అభినందించి రివార్డులను ఎస్‌పి నరసింహ అందజేశారు.

# మా భూములు మాకే కావాలి



**ప్రజాపక్షం/చింతపల్లి:** శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన రైతులకు మా భూములు ఇవ్వద్దని మంగళవారం వర్కాల గ్రామ రైతులు తమ భూములలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని వర్కాల గ్రామానికి చెందిన రైతులు సర్వే నెంబర్ 173లో 43 మంది రైతులు కొన్ని దశాబ్దాల కాలం నుండి 45 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అప్పటి ప్రభుత్వం రైతుల పేదరికన్ని గుర్తించి అసైన్డ్ భూమికి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చినప్పటి నుండి భూమిని చదును చేసి బోరు, బావులను తొవ్వించి సాగు యోగ్యమైన భూమిగా మార్చుటకు లక్షల రూపాయలు వెచ్చించి ఖర్చు చేశామన్నారు. లక్షల రూపాయలు అప్పులైనప్పటికీ భూమినే నమ్ముకుని సేద్యం చేసుకూంటూ కాలం వెళ్లదీస్తున్నామన్నారు. శివన్న గూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన భూనిర్వాసిత రైతులకు మా భూములను ప్రభుత్వం కేటాయించాలనుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం తీసుకునే ఈ నిర్ణయం వల్ల మా జీవితాలు తారుమారు అవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాలు భూముని నమ్ముకుని సేద్యం చేసుకుంటున్నామని, జీవితాలు అంధకారంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మా పొట్ట కొట్టకుండా ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకొని భూ నిర్వాసితులకు మరొక ప్రాంతంలో భూమిని కేటాయించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

## సుప్రీంకోర్టు సిజెఐ గవాయ్‌పై దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడి

ఐఎఎల్ నల్లగొండ జిల్లా కమిటీ ఖండన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భారత అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయిపై జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య అని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సనాతన ధర్మం పేరుతో ఏకంగా దేశ న్యాయ వ్యవస్థ పైనే దాడి చేయడం దుర్మార్గమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకమైన దాడులు రాజ్యాంగ ప్రాథమిక సిద్ధాంతాలలో ఒకటైన సెక్యులరిజం నైతికతను భంగం చేసే చర్యగా వారు ఆరోపించారు. ఇటీవల కాలంలో న్యాయవాదుల పైన న్యాయమూర్తుల పైన దాడులు పరిపాటిగా మారిందని, దీనికి అడ్డుకట్ట వేయాలని, దేశ అత్యున్నత న్యాయమూర్తికే రక్షణ లేకుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఐఏఎల్ తీవ్రంగా ఖండిస్తుందని వారు తెలియజేశారు. అందుకోసమే కేంద్ర ప్రభుత్వం త్వరలో న్యాయవాద రక్షణ చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

**ఎంఎస్‌పి ఖండన:** భారతదేశ అత్యుత్తమ న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై, సనాతన హిందూ ధర్మం పేరిట ఒక ఉగ్రవాది అవమానకరమైన పద్ధతుల్లో చెప్పు విసరడాన్ని సభ్య సమాజం తలదించుకునే అంశం అని, సనాతన ధర్మాన్ని తామే మోస్తున్నామని చెప్పే దుర్మార్గ మతోన్మాదుల చర్యలను తిప్పికొట్టేందుకు భారత సమాజం సిద్ధం కావాలని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ అన్నారు.

**టిజెఎస్ ఖండన**

భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ ఘవాయిపై మతోన్మాద దాడిని తెలంగాణ జన సమితి జిల్లా కమిటీ(టిజెఎస్) తీవ్రంగా ఖండిస్తుంది అని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పన్నాల గోపాల్ రెడ్డి ,గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్ తెలిపారు.

## మహిళల రక్షణే ధ్యేయంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** సూర్యాపేట జిల్లా పరిధిలో ఎటువంటి అసాంఘీక కార్యకలాపాలు,అక్రమ రవాణాలు జరగకుండా, నేరాల నియంత్రణ విద్యార్థినులు,మహిళల రక్షణే ధ్యేయంగా జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహా తెలిపారు. జిల్లాలో పోలీస్‌స్టేషన్‌ల వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్,సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు. అంతకుముందు ఎస్పీకి పోలీస్ సిబ్బంది గౌరవవందనంతో స్వాగతం పలికి పోలీస్ పరేడ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్లోని సిసి టివి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్ నగర్‌ను సేఫ్‌టౌన్ ప్రాజెక్ట్‌గా తీసుకున్నామని, 150 సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ ఉంటుందన్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోగల హుజూర్‌నగర్ టౌన్,మఠంపల్లి,గరిడేపల్లి,నేరేడుచర్ల,పాలకవీడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతి పోలీస్‌స్టేషన్ నుండి 50 సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రణాళిక చేశామన్నారు. ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీస్ సిబ్బంది నేత్రాలతో సమానమని,సిసికెమెరాల ద్వారా నేరాలను త్వరతగతిన చేదించవచ్చునని అన్నారు. ప్రజలు వ్యాపారస్తులు,ఉద్యోగులు సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్,సర్కిల్ కార్యాలయంలోని రికార్డ్స్‌ను తనిఖీ చేసి కేసుల నమోదు,దర్యాప్తులో వేగం పెంచాలని పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీస్ సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రామారావు,డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు,హుజూర్‌నగర్ సీఐ జి.చరమంద రాజు,ఎస్‌ఐలు బండి మోహన్ బాబు,చలికంటి నరేష్,బాబు,రవీందర్,కోటేష్,ఆర్ఎస్ఐ అశోక్,డిసిఆర్‌బి,పోలీస్ సిబ్బంది అంజన్ రెడ్డి,శేఖర్,సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## అమరుల ఆశయ సాధనకు కృషి

స్థూపావిష్కరణ చేస్తున్న ఉజ్జిని యాదగిరిరావు

**ప్రజాపక్షం/చింతపల్లి :** అమరవీరుల అడుగుజాడల్లో పయనించి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల పరిధిలోని హరిజనపురం గ్రామ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నాయకులు ఏదుళ్ళ రాములు స్మారక స్థూపాన్ని మంగళవారం యాదగిరిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదగిరిరావు మాట్లాడుతూ రాములు చిన్నతనం నుండి వామపక్ష భావజాలానికి ఆకర్షితులై భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారన్నారు. సిపిఐ నిర్వహించిన ఎన్నో పోరాటాలలో రాములు పాల్గొన్నారన్నారు. ఎన్నో ప్రలోభాలకు గురిచేసినా, ఎన్ని ఇబ్బందులకు గురైనా తన తుది శ్వాస విడిచే వరకు ఎర్రజెండా పక్షాన నిలిచిన గొప్ప వ్యక్తి అన్నారు. రాములు ఆశయ సాధనకు ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, కార్యవర్గ సభ్యులు షేక్ శంశోద్దీన్, మల్లోజు శేఖరచారి, వింజమూరి నరసింహ, యాచారం శ్రీశైలం, కుటుంబ సభ్యులు ఎదుళ్ళ గణేష్, ధర్మయ్య, మధు, వెంకటరత్నం, బాదం మల్లేష్, జక్కుల లింగం, ఈధ క్రిస్టోఫర్, జక్కుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయా...?

ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ కాలనీలో అన్నెపర్తి మమత భర్త ఆంజనేయులు, అన్నెపర్తి మమత భర్త యాదగిరిలకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్లను మంగళవారం జిల్లా కలెక్టర్ హనుమంత్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయా, ఎన్ని బిల్లులు వచ్చాయి అని అడిగి తెలుసుకొని త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసుకొని గృహ ప్రవేశం చేయాలని సూచించారు. బిల్లులు పెండింగ్‌లో ఉంటే సంబంధిత అధికారులకు తెలిపి బిల్లులు క్లియర్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రికి వచ్చే బాధితులకు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ వారికి మైరుగైన వైద్య సేవలను అందించాలని అన్నారు. రికార్డును పరిశీలించి ఆసుపత్రిలో ప్రసవాలను పెంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చండీ రాణి, ఎంపివో సలీం, హౌసింగ్ ఏఈ కావ్యశ్రీ, పంచాయతీ సెక్రటరీ సలీం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కండక్టర్ ఇంట్లో చోరీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియన వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో చోటు చేసుకుంది. వన్ టౌన్ పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చామల పార్వతి రోజు మాదిరిగానే ఉదయం ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లారు. విధులు ముగించుకోని రాత్రి ఇంటికి చేరుకున్న ఆమెకు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించివెంటనే ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండి, ఇంట్లోని వస్తువులన్ని చిందరవందరగా పడి ఉండడంతోపాటు ఇంటి వెనుక తలుపు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన తీరును గమనించి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కాగా ఈ చోరీలో ఆరు తులాల బంగారంతోపాటు రూ.80వేలు నగదు అపహరణకు గురయ్యాయని బాధితురాలు తెలిపారు. బాధితురాలు పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## అరుదైన వ్యాధులకు యశోదలో చికిత్సలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** అరుదైన వ్యాధులకు అతితక్కువ ఖర్చులతో హైదరాబాద్ మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్న అధునాతనమైన డ్రామా వాస్క్యులర్ ఆర్థోపెడిక్ ప్లాస్టిక్స్ సర్జరీ సేవలు, క్రిటికల్ కేర్ సమగ్ర పునరస వైద్య సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఎక్కడలేని విధంగా యశోద సూపర్ స్పెషాల్టి హాస్పిటల్‌లో అనేక రకాలైన చికిత్సలకు అధునాతన పరికరాలతో అతితక్కువ ఖర్చులకే సర్జరీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మధ్య కాలంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వాళ్లకు చేతులు కాళ్లకు ప్రధాన రక్తనాళాలు అనుబంధ రక్తనాళాలు తెగిపోతే చాలా ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది, ప్రమాదం జరిగిన ఆరు గంటల్లో రోగిని వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకువస్తే శాశ్వతంగా వైకల్యాన్ని, ప్రాణాలను కాపాడవచ్చని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ సర్జన్ డా. ఎంఇవి చంద్రమౌళి, ఆర్థోపెడిక్ సర్జన్ డా. ప్రఫుల్ కిలార్, జనరల్ ఫిజిషియన్ గుత్తా శశిధర్ రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీనివాస్ సిద్దుర, సీనియర్ మేనేజర్ వాసుకిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు : మోదీ



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. 2001లో సరిగ్గా ఇదే రోజు నాటి చిత్రాలను షేర్ చేశారు. ఆ రోజు ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. '2001 ఇదే రోజున గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశాను. నా తోటి భారతీయులు నిరంతరం అందిస్తోన్న మద్దతుకు కతజ్ఞత తెలియజేస్తున్నాను. ప్రభుత్వాధినేతగా 25వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నాను. ఈ ప్రయాణంలో ప్రజల జీవితాలు మెరుగుపర్చడం కోసం, దేశ పురోగతికి నావంతు ప్రయత్నం కొనసాగిస్తూనే ఉన్నాను' అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన నాటి చిత్రాలను షేర్ చేశారు. మోదీ 2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. తన గుజరాత్ మోడల్‌తో 2014 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచి... ఎన్డీయేను విజయతీరాలకు చేర్చారు. వరుసగా మూడుసార్లు ప్రధాని పదవి చేపట్టారు.

### ఉమ్మడి బలం, వ్యూహాత్మక దూరదృష్టి వల్లే...

## ఉగ్రవాద మౌలిక సదుపాయాలు ధ్వంసం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెల్లడి

65వ జాతీయ డిఫెన్స్ కాలేజి కోర్స్ అధ్యాపకులు, సభ్యులను ఉద్దేశించి కీలక ప్రసంగం



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశ సాయుధ బలగాలు తమ ఉమ్మడి బలాన్ని, వ్యూహాత్మక దూరదృష్టిని ప్రదర్శించాయని, దీని ఫలితంగా నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేశామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారతదేశం మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడులు నాలుగు రోజులపాటు తీవ్ర ఘర్షణకు దారితీశాయి. ఇది మే 10న సైనిక చర్యలను నిలిపివేయడంతో ఒక అవగాహనతో ముగిసింది. మంగళవారం నాడు ఇక్కడి రాష్ట్రపతి భవన్‌లో 65వ జాతీయ డిఫెన్స్ కాలేజి కోర్స్ అధ్యాపకులు, కోర్స్ సభ్యులను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ మారుతున్న భౌగోళిక రాజకీయ పర్యావరణ భద్రతా సందర్భాలు డైనమిక్ ప్రతిస్పందనలు కోరుతున్నాయని చెప్పారు. భారతదేశం సాయుధ దళాలలను మల్టీ డొమైన్ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్లకు సామర్థ్యంగల సాంకేతిక అభివృద్ధి చెందిన పోరాట సన్నద్ధ శక్తిగా మార్చడంలో నిమగ్నమై ఉందని రాష్ట్రపతి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సాయుధ దళాలు ఉమ్మడి వ్యూహాత్మక దూరదృష్టి యొక్క బలాన్ని ప్రదర్శించాయి. నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చడం. సరిహద్దు వెంబడి లోతైన ప్రాంతాలలో చొరబడటానికి విజయవంతమైన ప్రచారం వెనక ఒక సినర్జీ ఉందని ముర్ము చెప్పారు. సాయుధ దళాల నాయకత్వం పట్ల హృదయపూర్వక ప్రశంసలను రాష్ట్రపతి వ్యక్తపరిచారు. సైనిక వ్యవహారాల శాఖకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ కార్యదర్శిగా వ్యవహరించడంతో ఉమ్మడిత్వాన్ని ప్రోత్సహించే ప్రక్రియ ప్రారంభమైందని రాష్ట్రపతి పేర్కొన్నారు. 'ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్స్, ఇంటిగ్రేటెడ్ యుద్ధ సమూహాల ఏర్పాటు ద్వారా బలగాలను పునర్‌నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని గమనించడానికి నేను చాలా సంతోషిస్తున్నాను' అని ముర్ము చెప్పారు. మన జాతీయ ప్రయోజనాలను నిర్వచించడంలో సార్వత్రిక విలువలు ప్రధానమైనవని, భారతీయ సాంప్రదాయం ఎల్లప్పుడూ మొత్తం మానవాళిని ఒకే కుటుంబంగా చూస్తుందని ముర్ము వివరించారు. 'వసుదైక కుటుంబం' అనే మన ప్రాచీన నానుడిలో ప్రపంచం మొత్తం ఒక్కటే అనే భావన వ్యక్తీకరించబడిందని, సోదర భావం, శాంతి విశ్వాస అంశాలు మనకు ఆభరణాలుగా ఉన్నాయి కానీ మన దేశానికి వ్యతిరేకంగా ఉన్న శక్తులను ఓడించడానికి యుద్ధానికి సిద్ధంగా ఉండటానికి భారతదేశం అధిక ప్రాముఖ్యతను ఇస్తుందని ఆమె చెప్పారు. 'యుద్ధాన్ని నివారించడానికి సామరస్యపూర్వక పరిష్కారాన్ని సాధించడానికి చేయాల్సిన ప్రతీ ప్రయత్నమూ జరిగిందన్నారు. శాంతి కోసం ప్రయత్నాలను కృష్ణుడు అనే పాత్ర నడిపించిందని గుర్తుచేశారు. అందుకే ఆయనను దైవిక అస్తిత్వంగా భావిస్తామని రాష్ట్రపతి ముర్ము వెల్లడించారు. 'యుద్ధం దుర్భరంగా మారినప్పుడు కృష్ణుడు అత్యంత బలహీనమైన యోధులలో ఒకరైన అర్జునుడితో అన్ని సందేహాలను వదిలించుకుని ధైర్యంగా పోరాడమని ఉద్బోధించారని, అందువల్ల, యుద్ధం శాంతిపట్ల సమగ్ర భారతీయ విధానం శాంతి,అహింస విలువలకు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తుంది అని ముర్ము చెప్పారు. యుద్ధం అనివార్యమైనప్పుడు పోరాడటానికి ఇది బలంగా స్ఫూర్తిని ఇస్తుంది అని రాష్ట్రపతి విపులీకరించారు.

## మానవత్వం, రాజ్యాంగం ఖూనీ

రాయ్‌బరేలీలో దళితుడి హత్య కిరాతకం

సమాజంపై చెరగని మరక

ఖర్గే, రాహుల్



**న్యూఢిల్లీ :** మూక ఉన్మాదానికి ప్రస్తుత కాలం భయానక గుర్తుగా మిగులుతుందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. న్యాయాన్ని అణచివేయడం, మూక హత్యలకు పాల్పడటం మూమూలైపోయిందని ఆందోళన వ్యక్తంచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో 38ఏళ్ల దళితుడు హరీం వాల్మీకి హత్య కిరాతకమని, సమాజంపై చెరగని మరకని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఇది రాజ్యాంగాన్ని, మానవత్వాన్ని ఖూనీ చేయడమేనన్నారు. అణగారిన వర్గాలపై హింస పెరుగుతుండటంపై ఆవేదన వ్యక్తంచేశారు. 'మానవులంతా సమానమని చెప్పే రాజ్యాంగం మన దేశానిది. ప్రతి పౌరుడి భద్రత, హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛకు హామీనిచ్చే చట్టాలు మనకున్నాయి. అయితే రాజ్యాంగానికి, దళిత సమాజానికి విరుద్ధమైన ఘటన రాయ్‌బరేలీలో జరిగింది. ఇది అత్యంత హేయం. దేశ ఆత్మను కళంకితం చేసింది' అని ఖర్గే, రాహుల్ పేర్కొన్నారు. దళితులు, మైనారిటీలు, పేదలపై నేరాలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. వెనుకబడిన వర్గాలపై హింస నిత్యకృత్యంగా మారిందంటూ హత్రాస్, ఉన్నావో ఘటనలు, రోహిత్ వేముల ఆత్మహత్య, ఒడిశామధ్యప్రదేశ్‌లో దళితులపై భౌతిక దాడులు, హర్యానాలో పెహ్లూ ఖాన్, ఉత్తరప్రదేశ్‌లో అఖ్లాక్ మూక హత్యలను గుర్తుచేశారు. శాంతి భద్రతల సంస్థాగత వైఫల్యానికి ఈ ఘటనలు ఆధారాలన్నారు. 'ప్రస్తుతం దళితులు, గిరిజనులు, ముస్లింలు, వెనుకబడిన వర్గాలు, పేదల ఇలా బలహీనమైన ప్రతి ఒక్కరి గొంతు అణచివేయబడుతోంది. వారిపై దాడులు జరుగుతున్నాయి. వారి భాగస్వామ్యాన్ని హరిస్తున్నారు. వారి జీవితాలకు విలువ లేదన్నట్లు హింస, ద్వేషం, మూక దాడులతో రెచ్చిపోతున్నారు. రాజ్యాంగాన్ని బుల్డోజర్‌తో భర్తీ చేస్తున్నారు. న్యాయం స్థానంలో భయం కనిపిస్తోంది' అని రాహుల్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. తాజాగా జరిగినది ఒక వ్యక్తి హత్య కాదని... మానవత్వం, రాజ్యాంగం, న్యాయం హత్యకు గురయ్యాయని ఆయనన్నారు. హరీం వాల్మికి కుటుంబానికి తప్పక న్యాయం జరుగుతుందని అభయమిచ్చారు. భారత భవిష్యత్తు సమానత్వం, మానవత్వంపై ఆధారపడి ఉందని వక్కాణించారు. దేశంలో రాజ్యాంగం ఆధారిత పరిపాలన సాగుతోంది తప్ప మూక పాలన కాదని రాహుల్ అన్నారు. 2014 నుంచి మూక హత్యలు, దాడులు, 'బుల్డోజర్' అన్యాయం, మూక పాలన పేట్రేగిపోయాయని, ఇవి మన కాలానికి భయానక గుర్తులుగా మారాయని ఖర్గే, రాహుల్ వ్యాఖ్యానించారు. హింస ఎప్పుడు సభ్య సమాజానికి చిహ్నం కాబోదన్నారు. హరీం వాల్మికి ఘటన నైతికపరంగా అనేక ప్రశ్నలకు తావిస్తోందని అన్నారు. అంబేద్కర్ కలలు కన్న దేశం... మహాత్మా గాంధీ 'వైష్ణవ్ జన్ విన్ ఇది కాదని, అందులో సామాజిక న్యాయం, సమానత్వం, దయకరుణ ఉన్నాయని, ఇటువంటి నేరాలకు స్థానం లేదని చెప్పారు. మానతత్వమే భవిష్యత్తుకు హామీ ఇవ్వగలదని రాహుల్, ఖర్గే నొక్కిచెప్పారు. అణగారిన వర్గాలు, వెనుకబడిన తరగతుల సాధికారతకు తమ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. అన్యాయాన్ని ఐక్యంగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడి హక్కులు, గౌరవ మర్యాదలకు సంపూర్ణ భద్రత లభించేంత వరకు ఈ పోరాటం జరగాలన్నారు. ఇదిలావుంటే, డ్రోన్లను దొంగలించినట్లు పుకార్లు రావడంతో తన అత్తారింటికి వెళుతుండగా హరీం వాల్మికిపై గ్రామస్తులు మూక దాడి చేసి అతనిని చంపేశారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేశారు. కాగా, బాధితుడి సోదరుడితో రాహుల్ ఫోన్‌లో మాట్లాడారని, వారి కుటుంబానికి భరోసానిచ్చారని కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడు అజయ్ రాయ్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

## బిహార్‌లో ఎంతమంది పౌరులు కానివారిని తొలగించారు?

ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఫైర్

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా నుండి పౌరులు కాని వారిని తొలగించడానికి ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా అవసరమని కాంగ్రెస్ పేర్కొంది. కానీ బిహార్‌లో ఎంత మంది పౌరులు కాని వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించారో దేశానికి అవగాహన కల్పించే సమగ్రత లేదా ధైర్యం ఎన్నికల కమిషన్‌కు లేదని విమర్శించింది. బిహార్‌లో ఎంత మంది పౌరులు కాని వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించారో ఎన్నిక సంఘం తెలియజేసి ఉంటే, అది ఇప్పటికే ఉన్నదానికంటే మరింత బహిర్గతమయ్యేదని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. బిహార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టు విచారణ మంగళవారం తిరిగి ప్రారంభమవుతుందని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ఒక వార్తాపత్రికలో ప్రచురించి ఎస్ఐఆర్ విశ్లేషణను కూడా ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. ఎన్నికల కమిషన్ నిర్వహించిన మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియ సంపూర్ణత, సమానత్వం, ఛ్చితత్వం అనే మూడు అంశాలలోనూ విఫలమైందని ఈ చక్కటి విశ్లేషణ చూపిస్తుంది' అని రమేష్ అన్నారు. బిహార్‌లో ఇసి నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రతిపక్షం నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల సంఘం అధికార బిజెపి ఆదేశం మేరకు పనిచేస్తుందని వారు ఆరోపించారు. ఏ అర్హత కలిగిన పౌరుడిని ఓటర్ల జాబితా నుండి తొలగించడానికి అనుమతించబోమని, అదే సమయంలో, ఏ అనర్హుడైన వ్యక్తిని జాబితాలో ఉండనివ్వమని కమిషన్ నొక్కి చెప్పింది.

## ఎయిర్ ఇండియా విమానాన్ని ఢీ కొట్టిన పక్షి

**చెన్నై :** ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. కొలంబో నుంచి చెన్నై వచ్చిన ఫ్లైట్‌ను పక్షి ఢీ కొట్టింది. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో విమానం ల్యాండ్ అయిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అప్రమత్తమైన అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టారు. విమానం 158 మంది ప్రయాణికులతో కొలంబో నుంచి చెన్నైకి వచ్చింది. ఎయిర్‌పోర్ట్‌లో విమానం ల్యాండ్ అయిన తర్వాత పక్షి ఢీ కొన్న విషయం వెలుగులోకి వచ్చింది. అయితే, ఈ ప్రమాదంలో ప్రయాణికులంతా సురక్షితంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఇంజినీర్లు తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటన నేపథ్యంలో విమానం తిరుగు ప్రయాణాన్ని సంస్థ రద్దు చేసింది. ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేసి 137 మంది ప్రయాణికులను కొలంబోకు పంపినట్లు సంబంధిత అధికారి వెల్లడించారు.

## కరూర్ బాధితులకు విజయ్ ఓదార్పు

**చెన్నై :** కరూర్‌లో టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈనేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్‌లో మాట్లాడారు. వారిని ఓదార్చారు. త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించి టివికెకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు.. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు (ఎస్ఒపి) రూపొందించేవరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషాదం వేళ విజయ్‌పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఇలాంటి బాధాకరమైన పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. ఇలాంటి సమయంలో నేను కరూర్‌కు వెళితే.. అసాధారణ పరిస్థితులకు దారితీయొచ్చు. త్వరలోనే బాధిత కుటుంబాలను కలుస్తా' అని ఇటీవల వెల్లడించారు. కాగా.. కరూర్‌లో ఘటనాస్థలిని సోమవారం ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. తమిళగ వెట్రి కళగం సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

## కేజ్రీవాల్‌కు ప్రభుత్వ బంగ్లా కేటాయింపు

**న్యూఢిల్లీ :** ఏడాది కాలంగా అధికారిక నివాసం కోసం ఎదురుచూస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేషనల్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక బంగ్లా కేటాయించింది. ఆయన కోరినట్టు బిఎస్‌పి అధినేత్ర మాయావతి నివసించిన బంగ్లాకు బదులుగా సెకెండ్ లార్జెస్ట్ కేటగిరి కింది లోధి ఎస్టేట్ టైప్–7 బంగ్లాను కేటాయించింది. ఈ బంగ్లాలో ఇంతకుముందు మాజీ ఐఎఇఎస్ అధికారి, బిజెపి నేత ఇక్బాల్ సింగ్ లాల్‌పుర ఉండేవారు. కేజ్రీవాల్ 2024 సెప్టెంబర్ 17న ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. నవంబర్ 4న ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని అధికారిక బంగ్లాను ఖాళీ చేసి ఆప్ పంజాబ్ రాజ్యసభ ఎంపి అశోక్ మిట్టల్ ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్నారు. బంగ్లా కేటాయింపులో జరుగుతున్న జాప్యంపై ఆయన ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. గుర్తింపు పొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడి హోదాలో తనకు తగిన ఇల్లు కేటాయించాలని కోరారు. గత మేలో బిఎస్‌పి అధినేత్రి మాయావతి ఖాళీ చేసిన భవనం తనకు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే ఆ బంగ్లాను గత జులైలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి కేటాయించారు.

## సిజెఐపై దాడిని నిరసిస్తూ ఆప్ నిరసనలు



**న్యూఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి అని వివిధ రాజకీయ పక్షాలు ఆరోపించాయి. సిజెఐపై దాడిని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మంగళవారం తూర్పు ఢిల్లీలోని మయూర్ విహార్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించింది. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ చిత్రపటాలను చేత పట్టుకుని... ఆప్ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్ నేతత్వంలోని పార్టీ కార్యకర్తలు 'జై భీమ్' నినాదాలు చేశారు. 71 ఏళ్ల న్యాయవాది అయిన దాడి చేసిన వ్యక్తిని ఖండిస్తూ నిరసనకారులు 'హల్లా బోల్', 'చీఫ్ జస్టిస్ కా అప్మాన్ నహి సహేగా హిందుస్తాన్' అని నినాదాలు చేశారు. భరద్వాజ్ బూట్ల దండను ధరించారు. సోమవారం సుప్రీం కోర్టులోని తన కోర్టు గదిలో సిజెఐ గవాయ్ వైపు ఒక న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించాడు. దాడి నేపథ్యంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవాది రాకేశ్ కిశోర్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసింది.

**మహారాష్ట్రలో ఎన్‌సిపి(ఎస్‌పి) నిరసనలు**

సిజెఐ బి.ఆర్.గవాయ్‌పై ఒక న్యాయవాది బూటు విసిరే ప్రయత్నాన్ని ఖండిస్తూ ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకులు మంగళవారం ముంబై, మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేయడానికి చేసిన ప్రయత్నమని విమర్శించారు. వందలాది మంది నిరసనకారులు హుతాత్మ చౌక్ వద్ద గుమికూడారు. వారిలో కొందరు తరువాత దక్షిణ ముంబైలోని మంత్రాలయ సమీపంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్త ఒకరు మాట్లాడుతూ తాము మొదట హుతాత్మ చౌక్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించాలనుకున్నామని, కానీ అనుమతి నిరాకరించారని చెప్పారు. ఎన్‌సిపి (ఎస్‌పి) రాష్ట్ర అధ్యక్షుడు శశికాంత్ షిండే, పార్టీ ముంబై అధ్యక్షుడు రాఖీ జాదవ్, ఇతర మద్దతుదారులు దాడిని ఖండిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మరికొంతమంది నిరసనకారులు డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన నినాదాలు చేశారు. అలాగే ఛత్రపతి శంభాజీనగర్‌లో పార్టీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రోహిత్ పవార్ మాట్లాడుతూ సిజెఐ బిఆర్ గవాయ్‌పై దాడిని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. 'ఇది చాలా ఖండించదగిన సంఘటన. చిన్న విషయాలకు కూడా వెంటనే ట్వీట్ చేసే బిజెపి నాయకులు... ప్రజల ఆగ్రహం వెల్లువెత్తిన ఏడు నుంచి ఎనిమిది గంటల తర్వాత మాత్రమే దీని గురించి ట్వీట్ చేశారు. దీనిని ఏమని అర్థం చేసుకోవాలి?' అని ఆయన అన్నారు.

### నాలుగు రాష్ట్రాలలోని 18 జిల్లాల్లో

## నాలుగు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

**న్యూఢిల్లీ:** నాలుగు రాష్ట్రాలలో నాలుగు రైల్వే ప్రాజెక్టులను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ఉన్న 18 జిల్లాల మీదుగా 894 కి.మీ మార్గంలో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ మంగళవారంనాటి సమావేశంలో ఆమోదం తెలియజేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. రూ.24,634 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ నాలుగు రైల్వే ప్రాజెక్టులవల్ల దాదాపు 3,633 గ్రామాలలో ఉన్న 85.84 లక్షలమంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. వీటిల్లో విదిష, రాజ్‌నందగావ్ జిల్లాలు కూడా కలిసే ఉన్నాయి. వార్ధా–భూతవాల్ మధ్య మూడు, నాలుడు లైన్ ప్రాజెక్టుల ద్వారా మహారాష్ట్రలో 314 కి.మీ, అదే రాష్ట్రంలో గోండియా–దంగరగర్ మధ్య నాలుగోలైను కింద 84 కి.మీ రైల్వేలైను నిర్మితమవుతుంది. గుజరాత్, మధ్యప్రదేశ్‌లలోని వదోదర–రత్నామ్ మధ్య మూడు, నాలుగు లైన్ల కింద 259 కి.మీ మార్గం, మధ్యప్రదేశ్‌లోని ఇతార్సి–భోపాల్–బినాలను అనుసంధానించే 84 కి.మీ మార్గం ఏర్పడుతుంది. రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఈ విషయాలు చెప్పారు. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్తర ప్రణాళికలో భాగంగా ఈ ప్రాజెక్టులకు ఆమోదం తెలియజేశారు. ప్రయాణికులు, సరుకురవాణా సేవలు సజావుగా సాగిపోవడానికి ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి చెప్పారు. పర్యాటక రంగానికి కూడా ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయన్నారు. సాంచి స్థూపం, టైగర్ రిజర్వ్, భీంబేత్క రాక్ షెల్టర్, హజారా ఫాల్స్, నవగాన్ నేషనల్ పార్క్‌లకు వెళ్ళడానికి పర్యాటకులకు ఈ మార్గాలలో రైళ్ళ రాకపోకలు చాలా ఉపయోగపడతాయి. అదేవిధంగా ఈ మార్గాలలో బొగ్గు, సిమెంటు, బొగ్గు బూడిద, ఆహార ధాన్యాలు, స్టీల్ వంటి అనేక సరుకులు రవాణా చేయవచ్చు. ఏడాదికి 78 మిలియన్ టన్నుల సరుకులనుఈ మార్గంలో రవాణా చేయడం సాధ్యపడుతుంది.

## ఎస్‌పి, కాంగ్రెస్‌ది కపటత్వం

బిఎస్‌పి చీఫ్ మాయావతి



**లక్నో:** సమాజ్ వాదీ పార్టీ (ఎస్‌పి), కాంగ్రెస్‌ను బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధ్యక్షురాలు మాయావతి మంగళవారం తీవ్రంగా విమర్శించారు. బిఎస్‌పి వ్యవస్థాపకుడు కాన్షీ రామ్ వారసత్వాన్ని గౌరవిస్తున్నట్లు నటిస్తూనే... ఆయన పట్ల 'అత్యంత కులతత్వ, మోసపూరిత' విధానాన్ని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. 'ఎక్స్'లో చేసిన ఒక పోస్ట్‌లో, ఎస్‌పి, కాంగ్రెస్ రెండూ కాన్షీరామ్ పట్ల 'లోతైన కుల పక్షపాతం, శత్రుత్వం' ప్రదర్శించాయని ఆమె ఎక్స్‌లో విమర్శించారు. కాన్షీరామ్ బిఆర్ అంబేద్కర్ ఆత్మగౌరవ ఉద్యమాన్ని పునరుద్ధరించారని, దోపిడీకి గురైన దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాలను పాలక వర్గాలుగా మార్చడానికి కృషి చేశారని ఆమె అన్నారు. అక్టోబరు 9న కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా సదస్సు నిర్వహించాలని ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ... మాయావతి దీనిని 'శుద్ధ వంచన' అని పిలిచారు. అది అతని 'ద్వంద్వ ముఖాల విధానాన్ని' ప్రతిబింబిస్తోందన్నారు. కాన్షీరామ్‌కు ఆ పార్టీ ద్రోహం చేసిందని, ఉత్తరప్రదేశ్‌లో బిఎస్‌పి ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నించిందని ఆమె ఆరోపించారు. 2008లో బిఎస్‌పి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాన్షీరామ్ నగర్ జిల్లా పేరును 'కుల వివక్ష, రాజకీయ దురుద్దేశం' కారణంగా ఎస్పీ ప్రభుత్వం కాస్‌గంజ్‌గా మార్చిందని మాయావతి గుర్తు చేసుకున్నారు. బిఎస్‌పి పాలనలో కాన్షీరామ్ పేరు మీద ఉన్న అనేక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులను తరువాత ఎస్‌పి ప్రభుత్వం పేరు మార్చిందని, దీని వలన వారి 'దళిత వ్యతిరేక మనస్తత్వం' బయటపడిందని ఆమె పేర్కొన్నారు. కాన్షీరామ్ మరణించిన తర్వాత ఒక్క రోజు కూడా అధికారిక సంతాప దినం ప్రకటించలేదని ఎస్‌పి, కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా అక్టోబరు 8న లక్నోలో భారీ ర్యాలీ నిర్వహించాలని బిఎస్‌పి ప్రణాళిక చేసింది.

## బిహార్ ఎన్నికకు 1,200 సిఎపిఎఫ్ కంపెనీలు

**న్యూఢిల్లీ:** బిహార్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం 1,200 కేంద్ర సాయుధ బలగాలు (సిఎపిఎఫ్)ను మోహరించనున్నట్లు అధికారి ఒకరు మంగళవారం తెలిపారు. ఎన్నికలకు ముందు మోహరింపులో భాగంగా ఇప్పటికే రాష్ట్రానికి 500 కంపెనీలు చేరుకోగా, మరికొన్ని కంపెనీలు రానున్నాయి. కేంద్ర హోం వ్యవహారాల శాఖ (ఎంహెచ్‌ఎ), ఇసి నుంచి తుది అనుమతి తర్వాత 1,200 కంపెనీలను మోహరింపజేయనున్నారు. కాగా ఎన్నికల బందోబస్తు కోసం దాదాపు 1,800 కంపెనీలను కేటాయించాల్సిందిగా ఈసీని కోరినట్లు అధికారులు వివరించారు. 243 మంది సభ్యుల బీహార్ శాసన సభకు నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ సోమవారం ప్రకటించింది. ఓట్ల లెక్కింపు నవంబరు 14న నిర్వహిస్తారు. బిహార్ ఎన్నికలకు సిఎపిఎఫ్‌కు సంబంధించిన బలగాల్లో ఎక్కువ భాగం సహస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి), అలాగే కేంద్ర రిజర్వు పోలీసు దళం (సిఆర్‌పిఎఫ్), సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్), ఇండోటిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటిబిపి), కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్), రైల్వే భద్రతా దళం (ఆర్‌పిఎఫ్) ఉన్నాయి.

## చెరువులో 500 ఓటరు కార్డులు

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని ఓ చెరువులో వందలాది ఓటరు కార్డులు పడి ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఛతర్‌పూర్ జిల్లా బిజావర్‌లోని చెరువులో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు అక్కడికి వచ్చారు. చెరువులో సుమారు 500 ఓటరు కార్డులు ఉండటాన్ని గుర్తించారు. దీంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా రాజకీయ దుమారం రేపింది. ఓటరు కార్డులు చెరువులో ఉండటంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు . దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు దీప్తీ పాండే విజ్ఞప్తి చేశారు. కార్డులు భద్రపరిచామని, దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తామని అధికారులు తెలిపారు. ఇది నిర్లక్ష్యం కారణంగా జరిగిందా, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేసిందా అనే దానిపై విచారిస్తామన్నారు.

## తొక్కిసలాట పిటిషన్‌పై 10న 'సుప్రీం' విచారణ

**న్యూఢిల్లీ :** కరూర్ తొక్కిసలాటపై సిబిఐ దర్యాప్తును నిరాకరిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. అక్టోబర్ 10న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం తెలిపింది. శుక్రవారం జాబితా చేయమని ధర్మాసనం ఆదేశించింది. ఈ ఘటనపై సిబిఐ దర్యాప్తు కోరుతూ బిజెపి నేత ఉమా ఆనందన్ పిటిషన్ దాఖలు చేశారు. కరూర్ జిల్లా వేలుసామిపురంలో టివికె అధ్యక్షుడు విజయ్ బహిరంగ ర్యాలీలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది మరణించారు. వారిలో చాలా మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. సిబిఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రత్యేక పిటిషన్‌ను ప్రధాన ధర్మాసనం తోసిపుచ్చింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (నార్త్‌జోన్) ఆస్రాగార్గ్‌ను సిట్‌కు నేతత్వం వహించాలని పేర్కొంది. కోర్టుకు కాలానుగుణ నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

## దగ్గు మందు మరణాలపై 'సుప్రీం'లో పిటిషన్

**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్‌లో దగ్గు మందు మరణాలపై దర్యాప్తు చేపట్టాలంటూ సుప్రీంకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలైంది. జ్యుడిషియల్ కమిషన్ లేదా నిపుణుల కమిటీతో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని పిటిషన్ పేర్కొంది. న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌లో ఎఫ్ఐఆర్‌లను సీబీఐకి బదిలీ చేయాలని కోరారు. పారిశ్రామిక ద్రావకాలలో వినియోగించే విషపూరిత రసాయనం డైథిలిన్ గ్లైకాల్ కలిగిన కలుషితమైన దగ్గు సిరప్‌ల తయారీ, నియంత్రణ, పరీక్ష, పంపిణీపై సమగ్ర విచారణ చేపట్టాలని, మెడిసిన్ తయారీకి సూచనలు జారీ చేయాలని కోరింది. ప్రస్తుతం నిషేధం విధించబడిన కోల్డ్రిఫ్ సిరప్ స్టాక్‌ను స్వాధీనం చేసుకోవాలని, వాటి విక్రయాలు, పంపిణీ జరగకుండా అడ్డుకోవాలని సుప్రీంకోర్టును కోరింది. సిరప్‌లు విషపూరితం కాలేదని నిర్ధారించేందుకు ఎన్ఏబీఎల్ ప్రయోగశాలకు పంపాలని పిటిషన్ కోరింది. మధ్యప్రదేశ్‌లో దగ్గు సిరప్ కోల్డ్రిఫ్‌తో 14 మంది చిన్నారులు మరణించిన సంగతి తెలిసిందే. కోల్డ్రిఫ్ సిఫారసు చేసిన ప్రభుత్వ వైద్యుడు, తమిళనాడుకు చెందిన తయారీదారుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేయడానికి మధ్యప్రదేశ్ పోలీసులు ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బందం(సిట్)ను ఏర్పాటు చేశారు.

ప్రజాపక్షం
బుధవారం, 08 అక్టోబరు


# రాజ్యాంగ విలువలపై దాడి

సోమవారంనాడు సుప్రీంకోర్టులో – కోర్టు నెం.1లో కేసులు విచారిస్తున్న ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై రాకేశ్ కిశోర్ అనే హిందూ మతోన్మాద అడ్వొకేట్ తన కాలిబూటు విసిరేందుకు చేసిన విఫలయత్నం భారత రాజ్యాంగ విలువలపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి. ఇది దశాబ్దకాలంగా హిందూ మతోన్మాదశక్తులు సాగిస్తున్న విద్వేష ప్రచార పర్యవసానం; భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంగా పీఠికలో నిర్దేశించిన ''సోషలిస్టు సెక్యులర్, డెమొక్రటిక్ రిపబ్లిక్'' పదబంధంనుంచి సోషలిస్టు సెక్యులర్ తొలగించాలని హిందూత్వ శక్తులు గావిస్తున్న ప్రచారం తలకెక్కించుకున్న ఉన్మాది చేష్ట. జస్టిస్ వినోద్ చంద్రన్ ఆ బెంచిలో సహన్యాయమూర్తి. ''సనాతన ధర్మానికి అవమానాన్ని సహించను''ని హిందూ మతోన్మాదం తలకెక్కించుకున్న ఆ అడ్వొకేట్ గొంతెత్తాడు. హిందూత్వ పేరుతో సనాతన ధర్మ పునరుద్ధరణ వాదనకు జీవం పోస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబం, ఇతర హిందూ మత సంస్థలు బిజెపి రూపంలో సమాజాన్ని మతమార్గాల్లో విభజించి ఏలుబడి సాగిస్తున్న దేశంలో ఇప్పుడు సనాతన ధర్మానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి? తిరోగమన సనాతన ధర్మ పునరుజ్జీవాన్ని కోరుకోవటం కొందరు తమ హక్కుగా భావిస్తున్నప్పుడు, దాన్ని తిరస్కరించే వారికీ అది ప్రజాస్వామిక హక్కు కాదా? సనాతన ధర్మం అనేది కేవలం దేవుడు, పూజలు, ఆచార వ్యవహారాలు పాటించటం కాదు. అదొక సామాజిక–సాంస్కృతిక జీవన విధానం. అందులోని ఎన్నో స్త్రీ వ్యతిరేక, దళిత వ్యతిరేక, బ్రాహ్మణాధిపత్య ఆదేశాలకు వ్యతిరేకంగా ఈ దేశంలో ఎన్నో సంఘ సంస్కరణోద్యమాలు నడిచాయి, విజయాలు సాధించాయి. ఆ సంస్కరణలకోసం నడుంకట్టినవారూ హిందువులే. అందువల్ల కాలగమనంలో సమాజ పురోగమనానికి, వృద్ధి చెందుతున్న ప్రాపంచిక దృక్పథానికి అవరోధంగా ఉన్న ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు తిరస్కరణకు గురవుతుంటాయి. ఛాందసవాదులు కొంతకాలం ప్రతిఘటించవచ్చు, కొన్ని సందర్భాల్లో తాత్కాలికంగా పైచేయి కూడా సాధించవచ్చు. కాని అంతిమంగా తలవంచక తప్పదు. సనాతన ధర్మ అనుకూలత – వ్యతిరేకత అనేది భావ సంఘర్షణ. స్వేచ్ఛగా అటువంటి చర్చ జరిగినప్పుడే సత్యం పైచేయి సాధిస్తుంది. కాదని అడ్డంగా నిలబడితే జగన్నాథ రథ చక్రాలు తొక్కుకుంటూ ముందు కెళతాయి. ఇది చారిత్రక సత్యం.

ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, సెప్టెంబర్ నెలలో పురాతన ఖజురహో దేవాలయం నుంచి విరిగిపడిన విష్ణుమూర్తి విగ్రహ పునరుద్ధరణను ఆదేశించాలని ఒక పరమ భక్తుడు సుప్రీంకోర్టును ఆశ్రయించినపుడు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ చేసిన వ్యాఖ్యలు ఈ అపరాధ అడ్వొకేట్ దుశ్చర్యకు హేతువుగా చెప్పబడుతున్నది. వాటిపై సోషల్ మీడియాలో వచ్చిన అపవ్యాఖ్యానాలు తన దృష్టికి వచ్చాక జస్టిస్ గవాయ్, తనకు అన్ని మతాల పట్ల సమాన గౌరవం ఉందని, తాను పరిపూర్ణమైన లౌకికవాదినని కోర్టులోనే వివరణ ఇచ్చారు. కోర్టులో జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం ఆయన మనోనిబ్బరాన్ని భంగపరచలేదు. యథావిధిగా తన విచారణ కొనసాగించారు. ఈ ఘటన సర్వత్రా ఖండనలకు గురైంది. అటువంటి గర్హనీయమైన చర్యలకు మన సమాజంలో స్థానం లేదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. కాగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సిపిఐ, సిపిఐ(ఎం)లు ఈ దాడి యత్నాన్ని యావత్ న్యాయవ్యవస్థపై, రాజ్యాంగ విలువలపై దాడిగా ఖండించాయి. 'రాజ్యాంగ పరిరక్షణకు సామాజిక అడ్డంకులను బద్దలుకొట్టిన వ్యక్తి (గవాయ్)ని బెదిరించటానికి, అవమానించటానికి ఒడిగట్టిన చర్యగా ఖర్గే ఖండించారు. ఈ మతిమాలిన చర్య గత దశాబ్దంలో ద్వేషం, మతోన్మాదం, విభజనవాదం మన సమాజాన్ని ఎంతగా ఆవహించిందో తెలియజేస్తున్నదన్నారు. ఈ దాడి యత్నం, ''భారత రాజ్యాంగానికి బదులు మితవాద ప్రవర్తనా నియమావళికి బద్దులు కావాలని యావత్ న్యాయవ్యవస్థకు సవాలు విసరటం'' అన్నారు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా.

నరేంద్రమోదీ పరిపాలనలో ఇతర రాజ్యాంగ వ్యవస్థలన్నిటినీ తమ అదుపాజ్ఞల్లోకి తెచ్చుకున్నారు. పత్రికారంగం, ఎలక్ట్రానిక్ మీడియా కూడా చాలావరకు ప్రభుత్వం చెప్పుచేతల్లోకి వచ్చాయి. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం రక్షణకు ప్రజలకు మిగిలిన ఆశల్లా ఒక్క న్యాయ వ్యవస్థే. దాన్ని లొంగదీసుకునే ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించకపోతే భవిష్యత్ అంధకారమవుతుంది. ఈ గురుతర బాధ్యత లౌకిక, ప్రజాతంత్ర శక్తులపై, శ్రమజీవులు, బడుగు బలహీన తరగతులపై ఉంది. లౌకిక ప్రజాతంత్ర పార్టీలు అప్రమత్తంగా ఉండాలి. రాజ్యాంగ రక్షణ ఉద్యమాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లాలి.

# ఉత్తర భారతంలో మత విద్వేషాలకు కొత్త సాకులు


రామ్ పునియాని

భారత రాజకీయాల పాలిట మత ఘర్షణలు శాపంగా మారాయి. ఇది వందేళ్ళుగా సాగుతున్నది. చాలామంది పండితుల ప్రకారం ఈ ఘర్షణలు సాధారణంగా ప్రణాళిక ప్రకారమే సాగుతాయి. ఈ అల్లర్లు జాతిపరమైన విభజనకు దారితీసి కాంగ్రెస్‌ను బలహీనపరిచి జాతిమతతత్వ పార్టీలు లబ్ది పొందుతాయని పండితులు అభిప్రాయపడుతుంటారు. హిందూ–ముస్లిం అల్లర్లు కాంగ్రెస్‌కు ఎన్నికల్లో నష్టం కలిగించటమే కాకుండా, ''కాంగ్రెస్ వంటి బహుళ–జాతుల పార్టీలను బలహీనపరిచి, జాతి–మతతత్వ పార్టీలను ఈ అల్లర్లు బలోపేతం చేస్తున్నాయని'' వారు పేర్కొంటుంటారు. ఈ పరిశీలనను నిజం చేస్తూ హింసను రెచ్చగొట్టి, ఎన్నికల లబ్దిని పొందేందుకు మరిన్ని సాకులను సృష్టిస్తున్నారు.

విద్వేషాలను పెంచే ఘటనలకు కారణాలైన సుదీర్ఘ జాబితాలో మసీదుల ఎదుట భారీ సంగీతం వాద్యాలు మోగించటం, మందిరాలలోకి ఎద్దు మాంసం విసరడం, పుకార్లను వ్యాపింపచేయటం వంటి కొత్త సాకులు చేరుతున్నాయి. వీటికి ముస్లిం రాజులను రాక్షసులుగా చిత్రీకరించటం, వారి చేత మందిరాలు ధ్వంసమవటం, ఖడ్గం ద్వారా ఇస్లాం వ్యాప్తి, వారి భారీ కుటుంబాలు దేశంలో హిందువులను మైనారిటీలుగా మార్చే ముప్పు ఉందనడం వంటివి అదనంగా చేరి, విద్వేష సృష్టి ప్రక్రియలకు తోడయ్యాయి. గడిచిన కొన్ని దశాబ్దాలలో గోవు, ఎద్దు మాంస భక్షణ, లవ్ జిహాద్, అనేక ఇతర జిహాద్‌లు, వాటిలో ముఖ్యమైనవిగా కరోనా జిహాద్, ల్యాండ్ జిహాద్‌లు చేరగా, తాజాగా చేరిన వాటిలో 'పేపర్ లీక్ జిహాద్' ఉంది.

ఇవన్నీ ఇలా ఉండగా, తాజాగా ''ఐ లవ్ మొహమ్మద్'' అనే నిరపాయ నినాదం చుట్టూ హింసను నిర్మిస్తుండటాన్ని దేశం గమనిస్తున్న విషయం గుర్తు చేసుకోవాలి. ఇది కాన్పూర్‌లో మహమ్మద్ ప్రవక్త జన్మదినంగా జరుపుకునే మిలాద్–ఉన్– నబీ రోజున నిర్వహించిన ఉరేగింపు సందర్భంగా మొదలైంది. 'ఐ లవ్ మహమ్మద్' అనే బ్యానర్‌ను ప్రదర్శించడం పట్ల కొంత మంది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది మతపరమైన పండుగలలో కొత్త సంప్రదాయానికి దారి తీస్తుందని వారి వాదన. పోలీసులలో ఒక వర్గం ఈ వాదనను అంగీకరించి, పోస్టర్‌లు ప్రదర్శించిన వారికి వ్యతిరేకంగా ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేసింది. ఇది నిబంధనలను సంపూర్ణంగా ఉల్లంఘించడమే. ఎందుకంటే, శాంతియుత ప్రదర్శనలో ప్రవక్తపై వారి గౌరవాన్ని వ్యక్తం చేయడం నిబంధనల ఉల్లంఘన కాదు. దీని చుట్టూ అలుముకున్న హింస ఉత్తర్ ప్రదేశ్‌లోని అనేక జిల్లాలకు విస్తరించింది.

ఇందులో కాన్పూర్ ఘటన మొదటిది కాగా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీ, బారాబంకీ, మవు జిల్లాలు, ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్, ఉద్ధం సింగ్ నగర్ జిల్లాలు, అనేక ఇతర ప్రాంతాలలో అది పునరావృతమైంది.

పోస్టర్‌ల చించివేతకు దారితీసి, హింస కొనసాగి వాతావరణాన్ని మరింత దిగజార్చింది. అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఎపిసిఆర్) నివేదిక ప్రకారం 'ఐ లవ్ మహమ్మద్'కు సంబంధించి 21 ఎఫ్‌ఐఆర్‌లు నమోదవగా, 1324 మంది పేర్లు అందులో పేర్కొనగా, 38 అరెస్టులు చోటు చేసుకున్నాయి. బరేలీలో కొద్ది రోజుల పాటు ఇంటర్‌నెట్‌ను నిలిపివేయటంతో పాటు స్థానిక ముస్లిం నాయకుడు మౌలానా తౌకీర్ రజా ఖాన్‌ను వారం రోజుల పాటు గృహ నిర్బంధంలో ఉంచారు. ముస్లింలను వివక్షాపూరితంగా వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. కాన్పూర్ ఘటనపై వినతిపత్రం సమర్పిద్దామని ఆయన పిలుపునిచ్చారు. అయితే, ఆయనే రాకపోవడంతో హింసాకాండ చోటు చేసుకుంది. ఇటువంటి బాధ్యతారహిత చర్య అనేకమంది ముస్లింల అరెస్టులకు దారి తీసింది.

ఈ మొత్తం పరిణామాల క్రమం ముస్లింలకు వ్యతిరేకంగా నెలకొన్న స్వాభావిక ద్వేషాన్ని బైటపెడుతోంది. చాలా సందర్భాలలో మతతత్వ నాయకుల సంజ్ఞలతో మతతత్వ శక్తులు విద్వేష ప్రచారాన్ని ఉధృతం చేయడం హింసకు దారితీస్తుంది. మోదీ పదేపదే ఇదే పని చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇది జరుగుతుంటుంది. ఈసారి వారి ప్రచారంలో ఘుస్‌పైటియా (చొరబాటుదారులు) అనే పదాన్ని ముందుకు తీసుకువస్తున్నారు. ఈ విధానం ముస్లింలు, ప్రత్యేకించి బిహార్, అస్సాంలో ఉండే వారి పట్ల శాపంగా మారింది. ఇది బిహార్‌లో ప్రమాదకరమైన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)ను సమర్థించుకోవడంలో ఒక అంశంగా వాడుకుంటున్నారు. దీని ద్వారా 47 లక్షల మంది ఓటర్లను తొలగించగా, తదుపరి భారతదేశం అంతటా చేపట్టాలని భావిస్తున్నారు.

ఈసారి అత్యధిక మత ఘటనలు జరిగిన ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేసిన ప్రకటనలు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి తగని విధంగా ఉన్నాయి. 'గజ్వా–ఎ–హింద్' నినాదాలు చేయాలని కలలుగంటున్నవారికి 'నరకానికి టిక్కెట్లు' ఇస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ 'గజ్వా–ఎ–హింద్' నినాదం ఎక్కడి నుంచి ఇక్కడికి వచ్చింది? భారతీయ ముస్లింలలో ఒక వర్గం నిరపాయమైన 'ఐ లవ్ మహమ్మద్' అనే నినాదమిచ్చారే తప్ప గజ్వా .. అని కాదు. గజ్వా నినాదాన్ని హిందు మితవాదపక్షంలో తాలిబాన్ వంటి వారు మొత్తం ముస్లిం వర్గాన్ని నిందించేందుకు వాడుతున్నారు. ఖురాన్‌లో ఎక్కడా 'గజ్వా–ఎ–హింద్' అనే పదం ప్రస్తావన లేదు. ఒక సందేహాస్పద హాదిలో ఈ పదం ఉన్నప్పటికీ, అందులో హింద్ అనే పదం భారత్‌ను కాకుండా బస్రాను ఉద్దేశించినది. భారత్‌కు వ్యతిరేకంగా జరిగే ప్రతి యుద్ధాన్ని పాకిస్థాన్‌లో అనేకమంది అతివాదులు గజ్వా అంటుంటారు.

'ఐ లవ్ మహమ్మద్' అనే ఈ మొత్తం వ్యవహారం ముస్లింలను మరింత భయాందోళనలకు, బెదిరింపులకు గురిచేస్తుంది. వారి ప్రవక్త పట్ల ప్రేమను ప్రదర్శించడం ప్రజాస్వామిక భావ వ్యక్తీకరణ కిందకే వస్తుంది. పాకిస్థాన్‌లో తాలిబాన్ తరహా శక్తులు భారత్‌తో ప్రతి సంఘర్షణను గజ్వా అంటుంటారు. ఇక్కడ మన ప్రధాన మంత్రి సైతం ఇదే దిశగా విషయాలను తీసుకెళ్తున్నారు. ఆసియా కప్ క్రికెట్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయం తరువాత ఆయన దానిని ఆపరేషన్ సిందూర్‌కు కొనసాగింపుగా పేర్కొన్నారు.

ఈ పరిస్థితిలో ముస్లిం సమాజం ఏ విధంగా స్పందిస్తుంది? ఇలాంటి శాంతియుత ప్రదర్శనలను నిర్వహించడం పూర్తిగా సర్వసాధారణమే. ఇది రామనవమి ఊరేగింపు సందర్భంగా భారీ శబ్దాలతో డిజెలు, మసీదులపై కాషాయ జెండాలు కట్టడం వంటి వాటికి పూర్తి భిన్నమైనది. మన హిందువుల పండుగలలో కొన్నిటిని ఆయుధంగా మార్చుకుంటున్నారు! ఇర్ఫాన్ ఇంజనీర్, నేహా దభాడే రచించిన 'వెపనైజేషన్ ఆఫ్ హిందూ ఫెస్టివల్స్ (హిందూ పండుగల ఆయుధీకరణ)' అనే పుస్తకంలో, క్షేత్రస్థాయిలో పరిశీలన తరువాత రామనవమి ఊరేగింపులను మసీదులు, ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలలో రచ్చ చేసేందుకు ఉపయోగించడాన్ని వారు వివరించారు. దానికి మరోముఖమే ముస్లిం పండుగలను భయకంపితంగా చూపించడం. మిలాద్–ఉన్–నబీలో 'ఐ లవ్ మహమ్మద్' అనేది ఇందుకు బాధాకరమైన ఉదాహరణ.

ఇటీవల ముస్లింల పండుగల పట్ల చూపుతున్న ద్వేషపూరిత స్పందనలు హృదయాలను మరింత వేరు చేస్తాయి, మత సముదాయాలను మరింత విభజించటానికి దారి తీయడమే కాకుండా, భారత రాజ్యాంగంలో అంతర్భాగమైన సౌభ్రాతృత్వ విలువలను నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. అలాగే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలు రాజ్యాంగ నైతికతను ఉల్లంఘిస్తున్నాయి. ముస్లిం సమాజం వాస్తవికంగా ఉంటూ, హిందూ మతతత్వ శక్తులు తమపై విరుచుకుపడేందుకు లేదా తమను మరింత రాక్షసంగా చిత్రించేందుకు సాకులకు అవకాశం ఇవ్వకుండా ఉండాలి.







# ప్రతి సందర్భంలో యాది...బాలగోపాల్

ఇటీవల కొంతమంది మిత్రులం ఒక చిన్న చర్చ చేసుకుంటున్న సందర్భంలో మా మిత్రుడు హరికృష్ణ 'సామాజిక పరిణామక్రమంలో ప్రతి తరము ఒక సంధి దశలోనే ఉంటుంది. ప్రతి దశ సంధి దశే.' అన్న మాటలు ఇప్పుడు పదే పదే బాలగోపాల్‌ను గుర్తు చేస్తున్నాయి. ప్రతి సంధి దశలో వచ్చే సందేహాలను నివృత్తి చేయగలిగే మనుషుల కోసం, ప్రతి తరంలో తలెత్తే సమస్యలకు పరిష్కారం మార్గాలను సూచించగలిగే మెదళ్ల కోసం సమాజం ప్రతిసారి ఎదురుచూస్తూనే ఉంటుంది. అట్లా ఇవ్వాల ప్రత్యేకించి తెలుగు సమాజంతో సహా దేశవ్యాప్తంగా ప్రతి సందర్భంలో బాలగోపాల్‌ను యాది చేసుకుంటున్న సంఘటనలు, సందర్భాలు ఎన్నో. ప్రపంచమంతటా కార్పొరేట్ శక్తులు రాజకీయాలను శాసిస్తున్న క్రమంలో వాటి ఒత్తిళ్లకు లొంగుతున్న పాలకవర్గాలు సాంప్రదాయిక ఆలోచనలతో సమాజాన్ని తిరోగమనంలోకి తీసుకువెడుతూ వారి లోపాలను కప్పి పుచ్చుకోవడానికి ఆ తిరోగమన చర్యలను లేవనెత్తినవారిని, వేలెత్తి చూపి ప్రశ్నించిన వారిని ద్రోహులుగా చిత్రిస్తున్న సంఘటనలు ప్రపంచ దేశాలన్నిటిలో ఒకే విధంగా కనపడుతున్న దృశ్యాలు. అగ్ర రాజ్యం, ఆధునిక రాజ్యం అని చెప్పుకునే అమెరికా నుండి ఇండియా వరకు ఏదైనా ఒకటే చరిత్ర. అదే సమయంలో ఒక దేశంలోని వనరుల కొరతకు, నిరుద్యోగం పెరుగుదలకు, భారమవుతున్న పేద, మధ్యతరగతి జీవన ప్రమాణాలకు అసలు కారణం పాలకుల అసమర్థ పాలన, పెట్టుబడిదారులకు కుళ్ళుగుత్తగా వనరుల అప్పగింత ప్రధాన కారకాలని ఒప్పుకోక ఇతర దేశస్థుల మీద, ఇతర మతస్తుల మీద, ఇతర కులాలకు అందిస్తున్న ప్రత్యేక సదుపాయాల వల్లనే సమాజంలోని మిగతా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రచారం ఎక్కువగా చేసుకుంటున్న సందర్భంలో ఉన్నాం.

ఒకచోట విపరీత ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా తిరగబడుతున్న దృశ్యం చూస్తున్నా ఆ పక్కనే మతం పేరుతోనో, వర్గం పేరుతోనో, జాతివాదం పేరుతోనో మరింకే పేరుతోనే ప్రజల మీద పరోక్ష నియంతృత్వాన్ని అమలుపరుస్తున్న దృశ్యాలను చూస్తున్న దశలో ఉన్నాం. మా కాలంలో విప్లవాలు చేశాం అని చెప్పుకునే సిక్స్‌టీ నుండి సిక్స్‌టీన్ జెంజీ ఉద్యమంకు మరలిన సంధి దశలో ఉన్నాం. ఈ అన్ని సందర్భాల్లో కూడా ముఖ్యంగా తెలుగు సమాజం చాలా సంక్లిష్ట సందర్భాలను, చాలా సందేహాలను ఎదుర్కొంటున్నది. ఆయా సందర్భాలలో చాలామంది మేధావులు వారికి తోచిన విధంగా వారు స్పందిస్తున్నారు. వారు కూడా బాలగోపాల్ ఉంటే ఏమనేవాడో అని ఆలోచిస్తున్నారు అంటే బాలగోపాల్ అవసరం ఇంకా ఈ సంధి దశలో ఉన్నదనే వాస్తవాన్ని తెలుపుతుంది. మణిపూర్‌లో అల్లర్లు జరిగినపుడు, మతత్వతం పేరుతో బుల్డోజర్ రాజకీయాలు నడుపుతున్నపుడు, వందేళ్ల ఆర్‌ఎస్‌ఎస్ అంటూ ప్రచారాలు చేసుకుంటున్న కాలంలో వందేళ్ల ఆర్‌ఎస్‌ఎస్ అబద్ధాలను బాలగోపాల్ కాలికి బలపం కట్టుకుని తిరిగి ప్రచారం చేసేవాడు అనేది మేధావులందరి మాట. భవిష్యత్తు భారత దేశ రాజకీయాలను బాలగోపాల్ ఇరవై ఏళ్ల క్రితమే ఊహించాడు కూడా. బాలగోపాల్ అన్న తన మాటలు 'వ్యవస్థ పట్ల ప్రజలలో ఏ విశ్వాసం (దేశభక్తి)కలిగించనిదే ఏ వ్యవస్థా నిలవదు. విశ్వాసం కలిగించడానికి నిజమైన ఆదర్శాలు, నిజమైన సామాజిక న్యాయం, నిజమైన సార్వజనీన ప్రగతి కొరవడినపుడు మతతత్వాన్ని, జాతీయవాదాన్ని పాలకులు ఆశ్రయిస్తారు.' ఇప్పుడు జరుగుతున్నదిదే. దేశంలోనే కాదు ప్రపంచ రాజకీయాలలో కూడా. ఐతే ఇటువంటి సందర్భంలో ప్రజాస్వామిక విలువలు తగ్గిపోతున్నపుడు దాన్ని తిరిగి నిలబెట్టడానికి బదులు వీలైనంత ఎక్కువగా వాడుకుని లాభపడటం కోసం మాత్రమే ప్రజాస్వామ్యం అనేది ఉన్నదనే ఆలోచన ధోరణి నేటి తరంలో ఎక్కువ అయినది. ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడి గద్దెనెక్కే నేతలు అధికారంలోకి చేరుకున్నాక దాని గురించి మాట్లాడటం కూడా తప్పుగా చూస్తూ వాటిని గురించి మాట్లాడి న వారిని రకరకాల పేర్లతో శిక్షించాలని చూస్తున్నారు. ఐతే నేతలే కాదు సామాన్య ప్రజానీకం కూడా అటువంటి ఆలోచనలతోనే మెజారిటీ సమాజం ఉన్నదిప్పుడు. ప్రసార సాధనాలు సైతం రాజకీ య పార్టీల ప్రచార గొంతుకలుగా, వారి భావజాల ప్రసార సాధనాలుగా మారిన ఇటువంటి సమయంలో బుద్ధిజీవులుగా చెప్పుకునే వారు కూడా వారివారి ప్రయోజనాల దృష్టితో పనిచేస్తునపుడు కూడా బాలగోపాల్ చెప్పిన 'ప్రజాస్వామ్యాన్ని వాడుకోవడమే తప్ప దానికి బలం చేకూర్చే కర్తవ్యం తమది కాదని ఈ దేశంలో అందరూ అనుకుంటున్నారు. ఈ విషయంలో అందరికంటే ఎక్కువ బాధ్యత బుద్ధిజీవులు, పత్రికలు, ప్రసార సాధనాలపై పెట్టక తప్పదు' అన్న మాటలు గుర్తొచ్చిన ప్రతిసారి వారిని యాది చేసుకుంటున్నది ప్రజాస్వామిక విలువల కోసం తండ్లాడుతున్న సమూహం. ఇప్పుడు పని చేస్తున్న బుద్ధిజీవులు, కాస్తో కూస్తో ప్రజల పక్షాన నిలబడుతున్న పత్రికలు, ప్రసార సాధనల బాధ్యతను మరింతగా గుర్తు చేస్తున్నది అతని స్ఫూర్తి. దానిని కొనసాగించవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నది ఇప్పుడు. అభివృద్ధి పాలకులు దోపిడీకి వాడుతున్న పర్యాయపదం ఐపోయింది. ఈ అభివృద్ధి అనకొండ ఎపుడూ బడుగు బలహీన వర్గాల పేదలనే మింగుతుందెందుకో అర్థం కాదు.అభివృద్ధి డేగ కళ్ళు ఎప్పుడూ బక్క పేదల భూముల మీదనే ఎందుకుంటాయో మాత్రం అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.పాలకులు మాత్రం ప్రజాప్రయోజన రాగమెత్తుకుంటారు సుతిమెత్తగా. కాదని అడ్డుపడితే తంతారు. నిజానికి ప్రభుత్వమే పేదల భూములను అభివృద్ధి పేర దోచుకునే పెద్ద దొంగ.లేకుంటే విస్తృత ప్రజల ప్రయోజనాలకోసం తమ జీవితాలను కోల్పోతున్న ప్రజలను గౌరవంగా చూసి వారికి గౌరవప్రదమైన ప్రత్యామ్నాయాన్ని చూపించి వారి నుండి భూములను తీసుకోవాల్సిన ప్రభుత్వాలు బలవంతంగా భూసేకరణ చేయడాన్ని దోసుకోవడం కాక ఇంకేమనాలి. ప్రజల భూములను కోర్టులో కేసులు వేసి బాలగోపాల్ కాపాడిన సందర్భాలెన్నో!



ఆపరేషన్ కగార్ పేరుతో హత్యచేసి ఎన్కౌంటర్ అని మాట్లాడుతున్న ప్రభుత్వాల దమన నీతిని బాహాటంగా ఎండగట్టేవాడు. ప్రపంచమంతా ఇస్లామిక్ ఫోబియాతో భయపడుతున్నపుడు దానివెనక ఉన్న రాజకీయ, సామాజిక కోణాలను విప్పి ప్రజలకు అర్థం చేయించేవారు. బాబాలకు బెయిల్లు వచ్చి స్వేచ్ఛగా బయట తిరుగుతున్నపుడు కొందరు విచారణే లేకుండా ఎందుకు జైల్లో మగ్గుతున్నారో నిత్యం గొంతు చించుకుని అరుచు. ఆర్థిక నేరగాళ్లంతా దేశం బయట జల్సాలు చేస్తుంటే వినోదం చూస్తున్న ప్రభుత్వాలు ప్రజల హక్కుల కోసం మాట్లాడిన వారిని మాత్రం జైల్లో వేస్తున్నపుడు ప్రభుత్వాల ద్వంద్వ నీతిని ప్రజలముందు నగ్నంగా నిలబెట్టు. న్యాయస్థానాల అసహజ న్యాయ తీర్పులను ఖండిస్తే కోర్టు ధిక్కరణకు గురవుతామేమో అన్న భయంతో ఉన్న సందర్భంలో సుప్రీం కోర్టు తీర్పులలో గల అన్యాయాలను సైతం ముఖం మీదనే చెప్పేవాడు. బిసిలకు జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో వాటాకోసం అప్పుడే అది ఎట్లా సమర్థనీయమో కోర్టులకు చెప్పినవాడు ఇప్పుడు వాటి సాధన కోసం తానే న్యాయస్థానాలలో పోరాడేవాడు. బాలగోపాల్ ను స్మరించుకోవడం అంటే అతని ఆలోచనలను, ఆశయాలను సాధించడానికి మరొక్కసారి మనల మనం సిద్ధం చేసుకోవడమే. ఈ సమాజంలో ప్రజాస్వామిక విలువలను కాపాడటానికి, దానికి బలం ఇవ్వడానికి కృషిచేయాల్సిన బాధ్యత బుద్ధిజీవులపైన ఎక్కువగా ఉన్నదని చెప్పిన బాలగోపాల్ మాటలను ఆచరణలో పెట్టడమే మనం ఆయనకు ఇచ్చే నివాళి.

**(అక్టోబర్ 08 బాలగోపాల వర్ధంతి. 12 అక్టోబర్ 2025 ఆదివారం నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో బాలగోపాల్ 16వ సంస్మరణ సభ... అందరూ ఆహ్వానితులే.)**

**దిలీప్. వి**

# పెట్టుబడిదారీ వ్యవస్థ మీద తిరగబడ్డ వీర యోధుడు చేగువేరా

అతనో మడమ తిప్పని పోరాట యోధుడు. సాహసం ఆయన ఊపిరి. ప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప వీరుడు – అతడే చేగువేరా. వీరు జూన్ 14, 1928న జన్మించారు. వీరి అసలు పేరు ఎర్నెస్టో గెవారా. ఇతడు దక్షిణ అమెరికా ఖండపు విప్లవకారుడు, రాజకీయ నాయకుడు.ఇతడు పెట్టుబడిదారీ వ్యవస్థ తో పాటు సామ్యవాదం లోని సాంప్రదాయ వాదా న్ని కూడా వ్యతిరేకించాడు.ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలోని క్యూబా ప్రభుత్వంలో కాస్ట్రో తరువాత అంతటి శక్తిమంతుడైన నాయకుడుగా చలామణీ అయ్యాడు. ఇతడు 1961 నుండి 1965 వరకు పరిశ్రమల మంత్రిగా పనిచేసి క్యూబా ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికలను చాలావరకు నిర్దేశించాడు.ఇతడు అర్జెంటీనా లోని రొసారియా అనే పట్టణంలో 1928 జూన్ 14న ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. 1953లో బ్యూనస్ ఎయిర్స్ విశ్వవిద్యాలయం నుండి వైద్య విద్యలో పట్టా పొందాడు. ఆ తదుపరి మోటారు సైకిల్ పై దక్షిణ అమెరికా ఖండమంతటా పర్యటిస్తున్న సమయంలో ప్రజల జీవన స్థితిగతుల గురించి తెలుసుకున్నాడు. హింసాత్మక విప్లవమొక్కటే సామాజిక అసమానతలను తొలగించగలదని భావించాడు.



1954లో గౌటెమాల దేశంలో ప్రజాబాహుళ్యపు అభ్యున్నతికి కృషి చేస్తున్న సామ్యవాద అనుకూల ప్రభుత్వంతో కలసి పనిచేశాడు. కానీ అదే సంవత్సరం అమెరికా సాయంతో జరిగిన కుట్ర మూలంగా ఆ ప్రభుత్వం కూలదోయబడటంతో మెక్సికో వెళ్ళిపోయాడు. ఈ ఘటనతో అతని హింసాత్మక విప్లవ దృక్పథం బలపడింది.

మెక్సికోలో ఫీడెల్ కాస్ట్రో నాయకత్వంలో అప్పటికి ప్రవాసం వచ్చిన క్యూబా విప్లవకారులతో చేతులు కలిపాడు. 1950 వ దశకం చివరలో అప్పటి క్యూబా నియంత బాటిస్టాకు వ్యతిరేకంగా కాస్ట్రో ఆధ్వర్యంలో జరిగిన గెరిల్లా పోరాటం 1956–1959 లో ముఖ్య పాత్ర పోషించాడు. డాక్టర్ గా, మిలిటరీ కమాండర్ గా సేవలందించాడు. ఈ సమయం లోనే ఇతను 'చే' గా పిలువబడ్డాడు.గెవారా ఎవరినైనా పలకరించే సమయంలో చే అనే అర్జెంటీనా శబ్దాన్ని ఎక్కువగా వాడుతుండటంతో క్యూబన్ విప్లవకారులందరూ అతన్ని 'చే' అని పిలువనారంభించారు. అలా ఆ పేరు స్థిర పడిపోయింది.ఈ పోరాటం విజయవంతమై కాస్ట్రో 1959 జనవరిలో క్యూబా ప్రభుత్వాధికారాన్ని చేపట్టినపుడు గెవారా పరిశ్రమల మంత్రిగా,క్యూబా జాతీయ బాంకు ప్రెసిడెంట్ గా పనిచేసాడు. క్యూబా ప్రతినిధిగా అనేక దేశాలు పర్యటించాడు. ఈ పర్యటనలలో భాగంగానే చే 1959 జూలై నెలలో భారతదేశంలో కూడా పర్యటించాడు. తృతీయ ప్రపంచ దేశాల మీద అమెరికా పెత్తనాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన చే గెవారా క్యూబా సామ్యవాద దేశంగా మారటానికి దోహదపడ్డాడు.

గెరిల్లా యుద్ధం గురించి వివరించే తన రచనలలో వర్ధమాన దేశాలలో రైతాంగ విప్లవోద్యమాలు నిర్మింపబడాలని కోరుకున్నాడు. పేద దేశాలలో విప్లవాన్ని వ్యాప్తిచేయ తలపెట్టిన చే 1965లో క్యూబాలో తన అతున్నత స్థానాన్ని, హోదాని, పలుకుబడిని అన్నింటిని వదలి పెట్టి కాస్ట్రో వారిస్తున్నా వినకుండా దేశం నుండి అదృశ్యమయ్యాడు.కొద్దిమంది అనుచరులతో రహస్యంగా ఆఫ్రికా దేశమైన కాంగోలో కొంత కాలం గడిపాడు. ఆ సమయంలో ఆ దేశం యొక్క తూర్పు ప్రాంతంలో గెరిల్లా తిరుగుబాటుకు ప్రయత్నించి విఫలుడయ్యాడు. 1966 చివరిలో మరలా దక్షిణ అమెరికా చేరి బొలీవియా దేశంలో మిలిటరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విప్లవకారులకు నాయకత్వం వహించాడు. ఈ సమయంలోనే బొలీవియన్ సైన్యం చేతికి చిక్కి వారిచే 1967 అక్టోబర్ 9 న వల్లెగ్రాండె అనే ప్రాంతంలో చంపబడ్డాడు. ఆనాటి నుండి చే గెవారా విప్లవానికి, తిరుగుబాటుకు చిహ్నమై ఎందరికో ఆరాధ్యుడయ్యాడు. వారి సమగ్ర జీవితం అందరికి స్ఫూర్తి కావాలి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజల గుండెలలో వీరు, వీరి రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. చేగువేర లాంటి నాయకుడు ఇక భవిష్యత్ లో పుట్టక పోవచ్చు.చెగువెర అంటేనే ఒక సాహసం,వీరోచిత పోరాటం,, పీడిత ప్రజల పక్షాన వుండే జన కెరటం. వారి జీవితం ప్రపంచవ్యాప్తంగా యువతకు స్ఫూర్తిదాయకం.

**కామిడి సతీష్ రెడ్డి,**
9848445134

**(అక్టోబర్ 9న దక్షిణ అమెరికా ఖండపు విప్లవ కెరటం చేగువేరా వర్ధంతి సందర్భంగా)**

# భారత వాయుసేనకు సెల్యూట్

దేశ భూతల సరిహద్దుల్లో ఇండియన్ ఆర్మీ, సముద్ర జలాలు/తీర ప్రాంతాల కాపలాలో భారత నావికా దళం, గగనతల నిఘా నేత్రంగా భారతీయ వైమానిక దళం అనబడే త్రివిధ దళాలు అనుక్షణం దేశ భద్రతలో కీలకపాత్రను పోషిస్తున్నాయి. గగన తలంలో భరతమాత రక్షణ కవచంగా విశిష్ట సేవలు అందిస్తూ, ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన రక్షణ శక్తిగా భారతీయ వైమానిక దళం లేదా వాయుసేన (ఇండియన్ ఏయిర్ ఫోర్స్) పేరొందింది. బ్రిటీష్ ప్రభుత్వ పాలనలో రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌ను లొంగదీసుకోవడమే లక్ష్యంగా 08 అక్టోబర్ 1932 రోజు భారత వైమానిక దళం ఏర్పాటు చేయబడింది. ప్రతి ఏట 15 జనవరి రోజు భారతీయ ఆర్మీ దినోత్సవం, 04 డిసెంబర్ రోజు భారతీయ నావికా దళ దినోత్సవాలను నిర్వహించుకుంటున్నాం. వీటికి తోడుగా 07 డిసెంబర్ రోజు భారతీయ సాయుధదళాల దినోత్సవం (ఇండియన్ ఆరమ్డ్ ఫోర్సెస్ డే) నిర్వహిస్తున్నారు. భారత ద్వీపకల్పంలో మూడు వైపుల సముద్ర జలాలు, నాలుగవ వైపు ఉత్తరాన హిమాలయ పర్వతాలు పెట్టని గోడల్లా దేశానికి సహజ రక్షణను కల్పిస్తున్నాయి.

**4వ అతి పెద్ద వాయుసేన – ఇండియన్ ఎయిర్ ఫోర్స్ :**

ప్రపంచంలో 4వ అతి పెద్ద వాయుసేనగా (అమెరికా, రష్యా, చైనా) తదుపరి నిలిచిన భారతీయ వాయుసేన నినాదంగా టచ్ ది స్కై విత్ గ్లోరీ (గౌరవం లేదా కీర్తితో ఆకాశాన్ని తాకుదాం) అనబడే అంశాన్ని తీసుకున్నారు. భారతీయ వైమానిక దళంలో ఏడు కమాండ్ విభాగాలతో (47 వింగ్స్, 19 ఫార్వర్డ్ బేస్ సపోర్ట్ యూనిట్స్) 1,70,000 మంది సుశిక్షితులైన సైనికులు, 1,500 ఎయిర్ క్రాఫ్టులు రక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాయి. భారత రాష్ట్రపతి సుప్రీం కమాండర్‌గా, ఆపరేషనల్ అధిపతిగా ఎయిర్ ఛీఫ్‌ల నాయకత్వంలో సేవలు అందిస్తున్న వాయుసేన ప్రధాన కార్యాలయం న్యూ ఢిల్లీలో ఉన్నది. గగన సీమలో నిరంతరం గస్తీ తిరగడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పౌర సమాజాన్ని రక్షించడం అనే ప్రధాన విధులను కూడా వాయుసేన సమర్థవంతంగా నిర్వహిస్తున్నది. భారత వాయుసేనలో అత్యాధునిక ఆయుధ సంపత్తిలో భాగంగా మిగ్ విమానాలు, సుఖోయ్, తేజాస్, జాగ్వార్, బోయింగ్ 707, హెలికాప్టర్లు, మెసైల్స్ లాంటివి అనేకం ఉన్నాయి. భారత వాయుసేన పాల్గొన్న ముఖ్య సంక్షోభాలు లేదా యుద్ధాల్లో ఇండో–చైనా వార్ (1962), ఆపరేషన్ కాక్టస్(1988), ఆపరేషన్ విజయ్(1961, 1999), కార్గిల్ వార్ (1999), ఇండో–పాక్ వార్ (1947, 1965, 1971, 1999), కాంగో క్రైసిస్ (1960–65), ఆపరేషన్ పూమలై(1987), ఆపరేషన్ పవన్(1987), ఆపరేషన్ మేఘదూత్(1984), గోవా దండయాత్ర (1961) లాంటివి పేర్కొనవచ్చు.

ఆపరేషన్ సిందూర్ పోరాటంలో భాగంగా భారత త్రివిధ దళాలు పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించడం, పాక్ కాళ్ల బేరానికి రావడం చూసాం, త్రివిధ దళాలను చూసి గర్వపడ్డాం. నేడు జరుగుతున్న యుద్ధాల్లో వాయుసేన మాత్రమే గెలుపోటములను నిర్ణయిస్తుంది. భారతీయ వాయుసేన వ్యవస్థాపక దినోత్సవం రోజున పెరెడ్లు, త్యాగధనులకు శ్రద్ధాంజలి, యువతకు స్ఫూర్తి రగిల్చే కార్యక్రమాలు, వాయుసేన సత్తాను చాటే ప్రదర్శనలు లాంటివి నిర్వహిస్తారు. అసాధారణ వీరత్వానికి ప్రతీకలుగా మన వైమానిక దళాలు అపార శక్తిని ప్రదర్శిస్తూ, దేశాన్ని కంటికి రెప్పవలె కాపాడడంలో విజయవంతం కావడం హర్షణీయం. మన త్రివిధ దళాలకు జై జవాన్, జై కిసాన్, జై హింద్ అంటూ దిక్కులు పిక్కటిల్లే విధంగా నినదిద్దాం.

**(08 అక్టోబరు భారత వైమానిక దళ దినోత్సవం సందర్భంగా)**

## డిజిటల్ లావాదేవీలు అలవర్చుకోవాలి

ప్రజా పక్షం/సుల్తానాబాద్ : ప్రతి వ్యాపారస్తుడు డిజిటల్ లావాదేవీలను కనబరుచుకోవాలని మునిసిపల్ కమిషనర్ రమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని చిరు వ్యాపారులకు డిజిటల్ లావాదేవీల కోసం పోస్ట్ ఆఫీస్ వారు జారీ చేసిన క్యూ ఆర్ కోడ్ స్కానర్లను మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ అందజేశారు.మంగళవారం బల్దియాకార్యాలయములో లోక కళ్యాణ్ మేళా లో స్కానర్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్ మాట్లాడుతు పేమెంట్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న అకౌంట్, జీవనజ్యోతి బీమా , ప్రమాద బీమా, డిజిటల్ లావా దేవిలువినియోగించుకోమని సూచించారు. మున్సిపల్ మేనేజర్ అలీమోద్దీన్, ఎస్. క్రాంతికుమార్,మెప్మా సి. ఓ స్వరూప, ఆర్పిలు, పోస్టల్ సిబ్బంది శ్రీకాంత్, మౌనిక , తిరుపతి, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



## గురుకులంలో విద్యార్థి వివేక్ మృతి

ప్రజాపక్షం / హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల జిల్లెల గడ్డలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న వివేక్ అనే విద్యార్థి అనుమానాస్పద సిత్థిలో మృతి చెందాడు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. విద్యార్థి హస్టల్ కారిడార్లో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు బాలుడి మెడకు తాడు చుట్టుకుని విద్యార్థి వివేక్ మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మృతుడు సిద్దిపేట జిల్లా నంగునూర్కు చెందినవాడని వివరించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సోమవారం తన కుమారుడ్ని గురుకుల పాఠశాలలో విడిచి పెట్టానని మృతుడి తండ్రి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం పాఠశాల ఉపాధ్యాయులు ఫోను చేసి మీ బాబుకు దెబ్బలు తగిలాయని చెప్పారన్నారు. అయితే తాను వచ్చేసరికి కుమారుడు చనిపోయి ఉన్నాడని తెలిపారు. తండ్రి కన్నీటి పర్యంతం అయ్యారు. ఇదిలా ఉంటే మృతుడు వివేక్ గత మూడేళ్లుగా ఇదే పాఠశాలలో చదువుకుంటున్నాడని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెల్లడించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రాజకీయాలకు అతీతంగా చాగంటి కార్యక్రమం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్



ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పుణ్యక్షేత్రం లో ఈనెల 11,12 తేదీలలో నిర్వహించనున్న ప్రముఖ ప్రవచన వేత్త చాగంటి కోటేశ్వరరావు కార్యక్రమం పార్టీలు,కులాలకతీతంగా జరుగనుందని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమ స్థలాన్ని అధికారులు, నాయకులతో కలిసి మంత్రి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ..ఈ కార్యక్రమంలో ఎలాంటి స్వప్రయోజనాలు లేవని అందరి మదిలో ఉండే దైవ కార్యక్రమమని మంత్రి అన్నారు.11,12 తేదీలలో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే చాగంటి కోటేశ్వరరావు కార్యక్రమాన్ని తిలకించేందుకు 20 వేల మందికి పైగా వచ్చే అవకాశం ఉందని వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.తన కుమారుడు హరీశ్వర్ నేతృత్వంలో శేషప్ప కవి శతకంతో కూడిన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి క్షేత్ర మహత్యం డాక్యుమెంటరీ ప్రోమో చాగంటి చేతులమీదుగా 12న విడుదల ఉంటుందని చెప్పారు. విజయవంతం చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కోరారు.

## మహిళా ఆటో డ్రైవర్లు ఆదర్శంగా నిలవాలి : కలెక్టర్ పమేల సత్పతి



ప్రజాపక్షం / కరీంనగర్ : మహిళా ఆటో డ్రైవర్లు ఆర్థిక సాధికారత సాధించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ పమేల సత్పతి అన్నారు. దుర్గాభాయ్ దేశ్ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో ఎలక్ట్రిక్ ఆటో డ్రైవింగ్లో శిక్షణ పొంది ఉపాధి పొందుతున్న మహిళలతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు విభిన్న రంగాలలో రాణించాలని స్వయం ఉపాధిపొందుతూ ఆర్థిక సాధికారత సాధించాలన్న ఉద్దేశ్యంతో ఆటో డ్రైవిం గ్లో ఉచిత శిక్షణ ఇచ్చామని అన్నారు. అంతేకాకుండా వారికి ఉచితంగా ఆటోలు అందజేశామని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మహిళా ఆటో డ్రైవర్లు ఉపాధి పొందాలని పేర్కొన్నారు.ఆటోలను కుటుంబ సభ్యులకు, ఇతరులకు ఎవరికి ఇవ్వరాదని అన్నారు. ఆటోలు కేటాయించిన మహిళలే నడుపుతూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. మహిళా ప్రాంగణం మేనేజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను విస్మరిస్తున్న కాంగ్రెస్


ప్రజాపక్షం/పెద్దపల్లి : తెలంగాణ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే 25 వేల పైగా విద్యార్థులకు సంబంధించిన రూపాయలు నూట ఎనభై కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య పెద్దపెల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆజాద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం గత రెండేళ్లుగా బకాయిలను విడుదల చేయకపోవడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు పాఠశాలలకు రావద్దంటూ వారికి లెటర్లు రాశారని,దీంతో 25 వేలకు పైగా ఎస్సీ ఎస్టీ విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.అందాల పోటీలకు పక్క రాష్ట్రాల్లో పర్యటనలకు ఉన్న నిధులు పేద విద్యార్థుల చదువులకు లేవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నష్టం జరగకుండా బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం



ప్రజాపక్షం/రామగిరి : క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలని ఎస్వోటుజీఎం ఎం.రామ్మోహన్ అన్నారు.రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు ఓసీ1, ఓసీ2, ఏ.ఎల్.పి క్రీడాకారుల మధ్య ఇంటర్ డిపార్టుమెంటల్ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు.ఈ పోటీలను ఎస్వోటుజీఎం ఎం. రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్నటువంటి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం వివిధ క్రీడలలో పోటీలను నిర్వహిస్తుందన్నారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు కే.వీ.ఎన్.రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగ అధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, ఇతర నిర్వాహకులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ఈ టెక్నోలో వాల్మీకి జయంతి



ప్రజాపక్షం / కరీంనగర్ : ఇతిహాసాలలో రామాయణానికి చాలా విశిష్టత ఉందని, రామాయణం ద్వారా సీతారాముల యొక్క వైభవాన్ని తెలుసుకుంటామని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహర్షి వాల్మీకి ప్రపంచానికి ఎంతో జ్ఞానాన్నిఅందజేశారని, బ్రహ్మ అవతారంలో ఉన్నటువంటి మహర్షి వాల్మీకి బోధనలు చాలా శ్రేయస్కరమైనవని, మానవాళికి గొప్పగా నిర్దేశిస్తుందని గుర్తు చేశారు. శ్రీరాముని యొక్కచరిత్రను చాలా చక్కగా వర్ణించడంలో వాల్మీకికి సాటి ఎవరూ లేరని కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా ఎన్నికల విధుల నిర్వహణ

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : నిబంధనల ప్రకారం ఎన్నికల విధులుకట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల సంబంధించి నామినేషన్ స్వీకరణ కు మండల కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో అవసరమైన మేర కౌంటర్ లు ఏర్పాటు చేసి సంబంధిత ఎంపిటిసి స్థానాలకు నామినేషన్లు స్వీకరించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు ఎన్నికల నిర్వహణలో సంపూర్ణ మద్దతు ఎంపీడీఓ, ఎంపీఓలకు అందించాలని అన్నారు.ప్రతి మండలం ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన మేర అధికారులు నియామకం పూర్తి చేయాలని అన్నారు.ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండేలా పటిష్ట శిక్షణ అందించాలని అన్నారు. నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన,వారికి గుర్తుల కేటాయింపు తదితర అంశాల పై పూర్తి శిక్షణ అందించాలని అన్నారు.మండలాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సంపూర్ణ సామాగ్రి అందించడం జరుగుతుందని అన్నారు.ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు అందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్వీస్ ఓటర్లకు, పీడి యాక్ట్ కింద అరెస్టైన వారికి, ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయడం జరుగుతుందని, మన ఓటర్ జాబితా పరిధిలో పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాల్సిన వారి పేర్లు రౌండాఫ్ చేసుకోవాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితా వివరాలు సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమాచారం అందించాలని అ న్నారు. నామినేషన్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ర్యాలీ,ప్రచారాలు అనుమతి లేవని, అభ్యర్ది తో పాటు 3 మాత్రమే అనుమతించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారానికి అనుమతి మంజూరు చేయాలని, సౌండ్ సెట్, వాహానానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదారులకు ఒకే రూట్ లో సమావేశాలు ర్యాలీలో నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు.ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ఓట్ల కోసం కుల,మత విద్వేశాలు రెచ్చగొట్టకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు.అధికారులు ఎన్నికల విధులను తమకు కేటాయించిన బుక్ లెట్ లోని నిబంధనల ప్రకారం పటిష్టంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, డిపిఓ వీర బుచ్చయ్య,పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

### అవగాహనతో ఉండాలి

ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ట్రైనీ కలెక్టర్ బనావత్ వనజ తో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మండలంలో ఉన్న క్రిటికల్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓలు,తహసిల్దార్, స్థానిక పోలిస్ అధికారులు సమన్వయంతో గుర్తించాలని అన్నారు. గత ఎన్నికల సమయంలో జరిగిన అంశాలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల సజావుగా గుర్తించాలని అన్నారు.గత ఎన్నికల సమయంలో 75% కంటే ఎక్కువ ఓటింగ్ ఒకే పార్టీ లేదా అభ్యర్థికి ఓట్లు పడినట్లయితే ఆ ప్రాంతాన్ని క్రిటికల్ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేయాలని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఎక్కడైనా ఎన్నికల బహిష్కరణ జరిగిందా ఇటువంటి అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు.

## సైబర్ క్రైమ్పై అవగాహన ఉండాలి



ప్రజాపక్షం/వీణవంక: వీణవంక మండల కేంద్రంలో సైబర్ క్రైమ్పై ప్రజలకు జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మి నారాయణ అవగాహన కల్పించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ రాత్రివేళల్లో ఫోన్ వచ్చిన సంధర్భంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఓటిపి అడిగినా చెప్పకూడదని సూచించారు. చెబితే డబ్బులు పోయిన వెంటనే 1930 కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బ్యాంకు సంబంధించిన సమాచారం ఎవరికి చెప్పవద్దని సూచించారు. రాత్రివేళల్లో మహిళా ప్రయాణికులకు ఆకతాయిలు ఇబ్బందులు గురిచేస్తే 100 డయల్ చేయాలని, మహిళ్లా బ్లూకోర్టు సిబ్బంది వెంటనే స్పందిస్తారని సూచించారు. ఆయన వెంట ఎస్సై ఆవుల తిరుపతి, బ్లూ కోర్టు ప్రణయ్, రఘుపతిరెడ్డి ఉన్నారు.

## పంచాయతీ ఎన్నికలపై అధికారులకు శిక్షణ




ప్రజాపక్షం/ సిద్దిపేట : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే ఆర్ఓలకు, ఎఆర్ఓలకు ర్యాండమైజేషన్ ప్రక్రియ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే స్టేజ్ 1లో 176 ఆర్ఓలు, 176 ఎఆర్ఓలు, స్టేజ్ 2 608 ఆర్ఓలకు సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. స్టేట్ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఆర్ఓ, ఎఆర్ఓలకు కేటాయించిన ర్యాండమైజేషన్ చేశారు. వీరికి నిర్ణయించిన తేదీన ఎన్నికలకు సంబంధించి మాస్టర్ ట్రైనర్తో శిక్షణ తరగతులు నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, జడ్పి సిఈఓ రమేశ్, డిపిఓ దేవకిదేవి, డిఈఓ శ్రీనివాస్రెడ్డి, ఈడిఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణపై సమీక్ష

సిద్దిపేట కలెక్టరేట్లో మంగళవారం రీజనల్ రోడ్డు భూసేకరణపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ హైమావతి సమీక్షించారు. అయా మండలాల వారిగా భూసేకరణ,రెవెన్యూ అధికారులతో చర్చించి ఆయా గ్రామాల వారిగా పక్కా ప్రణాళికతో భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. రీజనల్ రింగ్ రోడ్డుతో ఆయా ప్రాంతాలు ఏలా అభివృద్ధి జరుగుతాయయో క్లుప్తంగా వివరించాలన్నారు. ఈమొత్తం ప్రక్రియను ఆర్డీఓ చంద్రకళ ఆధ్వర్యంలో తహశీల్దార్లు, ఇతర సిబ్బంది భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు

### కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి




ప్రజాపక్షం /కరీంనగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నోడల్ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకడే తో కలిసి ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలు, ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, మ్యాన్ పవర్, బ్యాలెట్ బాక్సెస్, రవాణా, శిక్షణ, సామాగ్రి నిర్వహణ, ఖర్చుల పరిశీలన, పరిశీలకులు, బ్యాలెట్ పేపర్ పోస్టర్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్ లైన్, ఫిర్యాదులు పరిష్కారాలు, ఓటర్ స్లిప్పుల పంపిణీ, నివేదికలు, వెబ్ కాస్టింగ్, ఫలితాల పర్యవేక్షణ అంశాలకు సంబంధించి నోడల్ అధికారులను నియమించాలని తెలిపారు. డిఆర్వో వెంకటేశ్వర్లు, జిల్లాపరిషత్ సిఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయితీ అధికారి జగదీశ్వర్, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ విష సంస్కృతి వల్లే భౌతికదాడులు

### డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్



ప్రజాపక్షం/జగిత్యాల: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై, బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాదుల దాడిని ఖండిస్తు డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ నిరసన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో డిహెచ్పిఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. భూమేశ్వర్ మాట్లాడుతూ దేశంలోనేఅత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గావాయికే రక్షణ లేనప్పుడు సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ఈ ధోరణి న్యాయవ్యవస్థ స్వతంత్ర్యతకు ప్రమాదం ఉందని, జస్టిస్ గావాయి ఎల్లప్పుడు రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా తీర్పులిచ్చారని, ఆయనపై దుష్ప్రచారం దళిత సమాజ ప్రతినిధులనుభయపెట్టే ప్రయత్నమని, న్యాయవ్యవస్థను రాజకీయ ఒత్తిడిలకు లోనుచేయించేకుట్రగా భావించామన్నారు. ఆర్ఎస్ఎస్ వెనుకాల ఉన్న లాయర్లందరూ జస్టిస్ గవాయి పై దాడి కేవలం ఒక వ్యక్తి మాత్రమే చేసింది కాదని, ఇది ప్లాన్ ప్రకారం ఆర్ఎస్ఎస్ ముసుగులో జరుగుతున్న భౌతాక దాడులన్నారు. దాడికి మోడీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ బాధ్యత వహించాలన్నారు. ఆర్ఎస్ఎస్ విషసంస్కృతివల్లే ఆ భౌతిక దాడు లు జరుగుతుయన్నారు. డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమంత్, డిహెచ్పిఎస్ జిల్లా నాయకులు శనిగారపు ప్రవీణ్, రాచర్ల సురేష్, అచ్చ ప్రవీణ్, దువాస లక్ష్మీనారాయణ, బి. హిత, దాసరి సోన, నకుమల్ల జయ, కంతం లావణ్య, శేఖర్, రాజేందర్, సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

## అభివృద్ధిపై మంత్రులతో ఎమ్మెల్యే చర్చ



ప్రజా పక్షం/సుల్తానాబాద్ : పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి గురించి ఎమ్మెల్యే విజయరమణరావు నివాసంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్కుమార్లతో చర్చించారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటన సందర్భంలో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మం డలం శివపల్లిలోని శాసనసభ్యులు చింతకుంటవిజయరమణరావునివాసానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేరుకున్నారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక సంస్థల ఎన్నికలపై ఎమ్మెల్యే విజయరమణరావు చర్చించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకోం

### బిఎన్ఆర్కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: రాష్ట్రంలోని భవన నిర్మాణ రంగాల కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకోమని బిఎన్ఆర్కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిఎన్ఆర్కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్లోని ఎవిరావు లైబ్రరీ హాల్లో రాష్ట్ర భవన నిర్మాణ రంగాల కార్మికుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగినది. ఈ సమావేశంలో కార్మిక శాఖలో జరిగిన అవకతవకల గురించి చర్చించి,ఈ నెల 15న వేలాది మంది కార్మికులతో చలో కార్మిక భవన్కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం మాట్లాడుతూ కార్మిక వెల్ఫేర్ బోర్డులోని నిధులను పక్కదారి పట్టించారని, 360కోట్ల రూపాయలు ప్రవేట్ ఇన్సురెన్స్ కంపనీలకు ఎలా అప్పగించారని ప్రశ్నించారు. సెస్ రూపంలో కార్మిక వెల్ఫేర్ బోర్డుకు వస్తున్న వేల కోట్ల రూపాయలను దుర్వినియోగం చేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. కార్మిక వెల్ఫేర్ బోర్డు అధికారులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి మాట్లాడాలని సూచించారు. ఈ నెల 15న కార్మికులతో కలిసి హైదరాబాద్లోని కార్మిక భవన్కు వస్తామని,అధికారులు నిధుల దుర్వినియోగంపై సరైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఎన్ఆర్కెఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమెల రాములు,ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి గంగాధర్,నాయకులు నాయిని రామస్వామి,తుడి అంజయ్య,తాండ్ర రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ విస్తరణ

### రాజన్న సిరిసిల్ల కలెక్టర్ ఎం. హరిత



ప్రజా పక్షం/వేములవాడ : వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయం విస్తరణ, అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. మంగళవారం శ్రీ రాజరాజేశ్వర స్వామిని కలెక్టర్ దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రమాదేవి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం విస్తరణ, అభివృద్ధిపై ఆలయ అతిథి గృహంలో వీటీఏడీఏ, ఆలయ అధికారులు, అర్చకులు, ఆర్బీ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధిపై రూపొందించిన నమూనాను కలెక్టర్కు క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య నారాయణమూర్తి విపులంగా వివరించారు. కలెక్టర్ ఎం. హరిత మాట్లాడారు.భక్తులకు మెరుగైన సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులకు వీటీఏడీఏ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టిందని తెలిపారు.

### భీమేశ్వర ఆలయంలో పరిశీలన

భీమేశ్వర ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అభిషేకం, అన్న పూజ, కోడె క్యూలైన్లో, కౌంటర్స్, ప్రసాదం తయారీ విభాగం,నిత్య కళ్యాణము, సత్యనారాయణ వ్రత మండపంతోపాటు పలు ప్రదేశాలను పరిశీలించారు. ఆర్బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, ఆర్&బీ ఈఈ నరసింహ చారి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, వీటీఏడీఏ సెక్రటరీ అన్సార్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన జీవన విధానం తప్పనిసరి

### డా.బంగారి రజనీ ప్రియదర్శినికి టైమ్స్ ఆఫ్ ఇండియా హెల్త్కేర్ ఐకాన్ అవార్డు




ప్రజాపక్షం/కరీంనగర్టౌన్: తెలంగాణలో ఇన్ఫర్టిలిటీ వైద్య విభాగంలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ప్రతిష్ఠాత్మకమైన టైమ్స్ ఆఫ్ ఇండియా హెల్త్ కేర్ ఐకాన్ అవార్డు 2025ను డా.బంగారి రజనీ ప్రియదర్శినికి దక్కింది. టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం ఈ అవార్డ్స్ రాష్ట్రస్థాయిలో వైద్య రంగంలో అత్యున్నత సేవలను అందించిన ప్రముఖ వైద్యులకు ప్రధానం చేస్తారు. కేవలం వైద్యమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ వంతు బాధ్యతను నిర్వర్తించే వారిని ఎంపిక చేయడం జరుగుతుంది.అందులో భాగ ంగా కరీంనగర్కు చెందిన రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్మన్, ప్రముఖ వైద్య సంస్థ రెనే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సీనియర్ వైద్యులు డా.బంగారి రజనీ ప్రియదర్శిని ఈ అవార్డును సోమవారం హైదరాబాదులోని తాజ్ డక్కన్లో ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ చైర్మన్ డా.నాగేశ్వర్రావు చేతుల మీదు గా అందుకున్నారు. డా.రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ నేడు యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య సంతానలేమి అని, దానిని అధిగమించాలంటే ఆరోగ్యకరమైన జీవన విధానం, సరైన వ్యాయామం అవసరమని అన్నారు. ప్రతి సంవత్సరం తన అత్తగారైన కీ.శే.బంగారి లక్ష్మి స్మారకార్థం పదిమంది దంపతులకు ఉచింగా ఇన్ఫర్టిలిటీ వైద్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన తనకు ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అవార్డుతో తన బాధ్యత పెరిగిందన్నారు. తనను ప్రతిక్షణం ప్రోత్సహిస్తూ ఈ అవార్డు రావడానికి సహకరించిన తన భర్త ప్రొఫెసర్ డా.బంగారి స్వామి, కుటుంబ ప్రోత్సా హం, తన తల్లిదండ్రుల దీవెనలు ఉన్నాయని అన్నారు. ఈ సంధర్బంగా రెనే హాస్పిటల్ చైర్మన్ డా.బంగారి స్వామికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పోలీసు కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు: ఎస్‌పి

ప్రజాపక్షం/ సంగారెడ్డి:మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు జిల్లా ఎస్‌పిపరితోష్ ఫంకజ్ అర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ,సత్యం, నీతి, ధర్మం కర్తవ్య భోదనలు సమాజంలో సత్యం న్యాయం సమానత్వం పాపనకు పేరణగా నిలుస్తాయని ఆయన ఆశయాలను పాటిస్తూ నీతి మార్గంలో నడవడమే వాల్మీకి మహర్షికి మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిరఘునందన్ రావు, ఎఆర్‌డిఎస్‌పి నరేందర్ ,ఇన్స్పెక్టర్ రమేష్, ఆర్‌ఐలు రామరావు, రాజశేఖర్‌రెడ్డి, డానియల్ వివిధ సెక్షన్లకు చెందిన డిపిఒ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సిర్పూర్ (టి)లో విజిలెన్స్ అధికారుల తనిఖీ



ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ రికార్డులను విజిలెన్స్ శా ఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్. ప్రవీణ్ కు మార్ చేసిన ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు పంచాయతీ కార్యాలయానికి చేరుకొని పలు పత్రాలు, లెక్క లు, రికార్డులను తనిఖీ చేశారు. అధికారుల బృందం ముఖ్యంగా పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల కాంట్రాక్టులు, బిల్లుల లావాదేవీలపై వివరాలను పరిశీలించినట్లు సమాచారం. విజిలెన్స్ డివిజనల్ ఇంజనీర్ మాట్లాడుతూ ప్రాథమికంగా రికార్డులను పరిశీలించాం. మళ్లీ ఫీల్డ్ ఎంక్వయిరీ కోసం త్వరలో వస్తాం అని తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## కూలిన ఇల్లు .. తృటిలో తప్పిన ప్రాణాపాయం



ప్రజాపక్షం / సిర్పూర్ (టి):మండల కేంద్రంలోని రైల్వే కాలనీలో భారీ వర్షాల కారణంగా ఒక వృద్ధురాలి నివాస గృహం కూలిపోయిన ఘటన చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసి, దుర్గం చిన్ను బాయ్ అనే వృద్ధురాలి పాత ఇల్లు ఒక్కసారిగా కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఆమె ఇంటి బయట ఉండటంతో ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. వృద్ధురాలు దుర్గం చిన్ను బాయ్ తెలిపిన వివరాల ప్రకారం పాత గోడలతో ఉన్న తన ఇల్లు వర్షానికి తడిసి కూలిపోయిందని, ప్రస్తుతం ఆమె కుమారుడి ఇంట్లో తాత్కాలికంగా ఆశ్రయం పొందుతున్నానని తెలిపారు. ప్రభుత్వం తమకు తగిన నష్టపరిహారం అందించాలని, తక్షణ సాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం ఎవరూ డబ్బులు అడగలేదు




ప్రజాపక్షం/నిజామాబాద్ :డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం డబ్బులు తీసుకుంటున్నారని రాసిన వార్తలో ఏమాత్రం నిజం లేదని ఈ విషయాన్ని ఖండిస్తున్నామని గంజ్ దడువాయి చాట యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం గంజ్ గుమాస్తా సంఘంలో యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం సంఘాల ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ నాయకుడు డబ్బులు డిమాండ్ చేయటం జరిగిందని రాసిన వార్త నిజం కాదని, ఈ విషయాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్మికులకు ఇళ్లు కావలని అందుకు కృషి చేస్తున్నామని ఎవరి వద్ద నుంచి ఎవరు డబ్బులు అడగలేదన్నారు. ఎవరు సూత్రధారి లేరని, ఒక్క రూపాయి కూడా ఎవరిని డబ్బులు అడగలేదన్నారు. విలేకరుల సమావేశంలో బాల అంజయ్య, శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, పరశురాం, అనసూయ పాల్గొన్నారు.

## 16,17,18 తేదీలలో పటాన్‌చెరులో వాలీబాల్, కబడ్డీ, రాష్ట్ర స్థాయి క్రీడలు

పటాన్ చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి



ప్రజాపక్షం/ పటాన్‌చెరు:పట్టణంలో మైత్రి మైదానం కేంద్రంగా ఈ నెల 16,17,18 తేదీలలో నిర్వహించనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్, క్రీడల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు పట్టణంలోనిమైత్రి స్పోర్ట్స్ క్లబ్ భవనంలో క్రీడల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను నిర్వహించేందుకు పటాన్చెరు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానిక కోరగా ఇందుకు సమ్మతించినట్లు ఆయన తెలిపారు. అండర్ 17 బాలుర వాలీబాల్, అండర్ 14 బాలురు, బాలికల కబడ్డీ పోటీలను అక్టోబర్ 16,17,18 తేదీలలో పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 420 మంది క్రీడాకారులతో 200 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ,సిబ్బంది క్రీడలలో పాల్గొన్నాతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లను సైతం సొంత నిధులతో జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు మూడు రోజుల పాటు పటాన్చెరు కేంద్రంగా జరగబోతున్న స్కూల్ గేమ్స్ క్రీడలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పటాన్చెరు డిఎస్పీ ప్రభాకర్, సిఐ వినాయక్ రెడ్డి, జిహెచ్ఎంసి డిటేట్ కమీషనర్ సురేష్, మండల విద్యాశాఖ అదికారులు పిపి రాథోడ్ నాగేశ్వరరావు నాయక్ ఎస్ జి.ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గౌసుద్దీన్, మైత్రి క్రికిట్ క్లబ్ అద్యక్షుడు హనుమంత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

## హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు: ఎస్‌పి




ప్రజాపక్షం/ సంగారెడ్డి: హత్యకేసులో నిందితునికి జీవిత ఖైదు విధించినట్లు జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ వెల్లడించారు. నేరం సంఖ్య కేసు నెం 27 /2021 సెక్షన్ 302 ఐపిసీ ప్రకారం సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిదిలో చోటుచేసుకున్న హత్యకేసులో నిదింతుడైన పెద్దగొల్ల బీరప్ప కు యావజీవ కారాగార శిక్ష రూ. 100 జరిమాన విదిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జీ జి. భవాని చంద్ర తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని యెడల 3 రోజుల సాదారణ జైలు శిక్ష విధించాలని ఆదేశించారు. నిందితుడు పెద్దగొల్ల బీరప్ప కుటుంబ సలహాలతో భార్యను వదిలి సదాశివపేటలో కూలి పని చేసుకొని జీవిస్తున్నాడు ,ట్రాక్టర్ బ్యాటరీ దొంగతనం విషయంలో మృతుడు పాపయ్య ,మరి కొందరు తనను తిట్టి అవమానించగా పాపయ్య తనపై మూత్రం పోశాదని మనుషలో ఉంచుకొని తనను అవమానించిన పాపయ్యను చంపాలని నిర్ణయించుకొని తేది 05082021 నాటి రాత్రి ఉదయం 3 గంటల సమయంలో లక్ష్మి కాంప్లెక్స్ వద్ద నిద్రలో ఉన్న పాపయ్యను ఒక పెద్ద రాయితో తలకు మూడు సార్లు కొట్టి హత్య చేశాడు. ఇట్టి విషయమై పిర్యాది పెద్దగొల్ల సుబాస్ తన తండ్రిని చంపిన పెద్దగొల్ల బీరప్పపై చట్టరీత్య తగుచర్య తీసుకోవలసిందిగా సదాశివపేట పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు చేయగా అప్పటి ఎస్.హెఛ్ సంతోష్ కుమార్ ఇన్సెపెక్టర్ కేసు నమోదు చేసి ఇన్వెస్టీగేషన్ అనంతరం న్యాయ స్థానంలో చార్జ్ షీట్ దాఖలు చేయగా కేసు పూర్వపరాలను విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జీ జి. భవానిచంద్రనిందితునకియావజ్జీవకారాగారశిక్ష విధుస్తూ తీర్పు నిచ్చారు.

# శిథిలావస్థ నుంచి కొత్త సొబగులు

### ప్రభుత్వ పాఠశాలకు అద్భుత రూపం.. విద్యార్థుల ఆనందోత్సాహాలు



పాత చిత్రం




కొత్త చిత్రం

ప్రజాపక్షం /రామకృష్ణాపూర్:క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఠాగూర్ స్టేడియం, గంగా కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇప్పుడు సరికొత్త రూపంతో విద్యార్థుల సంతోషంతో కళకళలాడుతోంది. గతంలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని నిర్లక్ష్యానికి గురైన పాఠశాల భవనం, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా తయారైంది. ఒకప్పుడు పాడైపోయిన గోడలు ,పాతబడిన పెయింట్ స్థానంలో, పాఠశాల భవనాన్ని నూతనంగా, ఆకర్షణీయమైన రంగుల డిజైన్లు, చిత్రాల తో అందంగా తీర్చిదిద్దారు. మున్సిపల్ కమిషనర్ రాజు పర్యవేక్షణలో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులు ఇ ప్పుడు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు గొప్ప ఆనందాన్ని ఇస్తున్నాయి. ఈ సందర్భంగా పాఠశా ల ప్రధానోపాధ్యాయులు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాల ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైందని, మున్సి పల్ అధికారుల సహకారంతో నేడు ఆకర్షణీయమైన వి ద్యాలయంగా మారడం వల్ల చదువుపై పిల్లలకు ఆసక్తి పె రిగిందన్నారు.

**విద్యార్థులు, తల్లిదండ్రుల హర్షం**

పాఠశాల రూపురేఖలు మారడంతో విద్యార్థులు కూడా ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త రంగులు, చిత్రాలను చూసి చదువు మీద ఆసక్తి పెరిగిందని, క్రమం తప్పకుండా స్కూలుకు వస్తున్నామని ఆనందంగా తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా స్పందిస్తూ, తమ పిల్లలు చదివే పాఠశాల ఇంత అద్భుతంగా మారిపోతుందని ఊహించలేదన్నారు. ఇప్పుడు పిల్లలు ఎంతో ఉత్సాహంగా స్కూల్‌కి వస్తున్నారని, భవిష్యత్తులో వారికి మెరుగైన ఉన్నత విద్యను అందించేందుకు ప్రభుత్వం, అధికారులు మరిన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు.

## సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్ :వర్ని మండలం సిద్ధాపూర్ వద్ద కొనసాగుతున్న రిజర్వాయర్ పనులను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. నీటి ప్రవాహాలతో కూడిన వాగులు, ఎత్తైన కొండ ప్రదేశాలను కాలినడకన దాటుతూ రిజర్వాయర్ బండ్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్లూయిస్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలం విషయమై రెవెన్యూ అటవీ శాఖల మధ్య వివాదం నెలకొన్న ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. టోపో షీట్, గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా స్థల నిర్ధారణ కోసం రెవెన్యూ, అటవీ శాఖల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థల వివాదానికి సంబంధించిన అంశాలపై తన వెంట ఉన్న బోధన్ సబ్‌లెక్టర్ వికాస్ మహతో, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా ఇతర అధికారులతో చర్చించారు. పరస్పర సమన్వయంతో సర్వే పూర్తి చేయాలని ఇరు శాఖల అధికారులను ఆదేశించారు. స్లూయిస్‌ల నిర్మాణానికి అటవీ భూమి అవసరమైన పక్షంలో భూసేకరణ, అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అప్పటిలోగా రిజర్వాయర్ కు సంబంధించిన ఇతర పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ రాజశేఖర్, ఎఫ్‌డీఓ సుధాకర్, తహసీల్దార్ సాయిలు తదితరులున్నారు.


## సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్



ప్రజాపక్షం/గజ్వేల్:స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు అంశంపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 శాతానికి పైగా బలహీన వర్గాల జనాభా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం జాగృతి ఉద్యమించి బలహీన వర్గాల ప్రజల్లో కదలిక తెచ్చినట్లు గుర్తు చేశారు. కాగా 42 శాతం రిజర్వేషన్ పై ఈనెల 8వ తేదీన హైకోర్టులో విచారణ జ రగుతున్నందున కా ంగ్రెస్ తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని అన్నారు. అలా గే పే ద ప్రజలపై భారము మోపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పె ంచిన బస్సు చార్జీల నిర్ణ యం వెనక్కి తీసుకోవాలని డిమా ండ్ చేశారు. కాగా 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం అన్ని పార్టీలు మద్దతు ప్రకటించాలని, లేని పక్షంలో ప్రజలే వారికి తగిన బుద్ధి చెప్తారని వివరించారు.

## నిజాంసాగర్ నీటి విడుదల



ప్రజాపక్షం/నిజాంసాగర్:ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి మాంజీరా నదిలోకి వరదనీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్టు ఏఈ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎగువ ప్రాంతం నుండి 32,820 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా ప్రాజెక్టు 5 వరద గేట్లు ఎత్తివేసి మాంజీరా లోకి 32,820 క్యూసెక్కుల నీరు వదిలిపెడుతున్నట్లు చెప్పారు. కాగా నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగులు, 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1404.94 అడుగులు 17.715 టీఎంసీల నీటి నిల్వతో కొనసాగుతుందని వెళ్ళడించారు.

## మంత్రులు క్షమాపణ చెప్పాలి



ప్రజాపక్షం / శ్రీరాంపూర్:మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అట్లూరి లక్ష్మ ణ్‌కు (మాదిగ) బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సింగరేణి మాదిగ ఉద్యోగుల సంఘం శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ నేలబోయిన కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఈ విషయంపై మాట్లాడుతూ, ఇటీవల జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. బేషరతుగా క్షమాపణలు చెప్పని పక్షంలో నిరసన ప్రదర్శనలు వ్యక్తం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు చెరుపల్లి సురేష్, సదిరం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోండి

### అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / జన్నారం, దండేపల్లి :ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న అధునాతన సాంకేతిక వృత్తి విద్యను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఈ కేంద్రాలలో వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం కలెక్టర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి, ఇంటర్మీడియట్ కొరకు అదనంగా నిర్మిస్తున్న గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ విద్య సంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

**సిఎంఆర్ లక్ష్యాల పురోగతి**

దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో గల రామ్ లక్ష్మ ణ్ రైస్ మిల్లును సందర్శించి, రైస్ మిల్లుకు కేటాయించిన సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాల పురోగతిని పరిశీలించారు. రైస్ మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లుల నిర్వాహకుల సమన్వయంతో లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుమురంభీమ్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం: కలెక్టర్



ప్రజాపక్షం / కేరిమేరి/ ఆసిఫాబాద్:ఆదివాసుల ఆరాధ్య దైవం, అమరజీవి కుమ్రంభీమ్ స్ఫూర్తితోనే జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమంలో ముందుకు సాగుతామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం జోడేన్‌ఘాట్‌లో ఆదివాసుల ఆరాధ్య దైవం కుమ్రంభీమ్ 85వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం జరిగింది. గిరిజన సంప్రదాయబద్ధంగా జెండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, కుమ్రంభీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి, సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జల్ జంగల్ జమీన్ నినాదంతో గిరిజనుల అభివృద్ధి, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కుమ్రంభీమ్ అని కొనియాడారు. భీమ్ స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపారు. వర్ధంతి సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించామని, అలాగే హట్టి నుండి జోడేన్‌ఘాట్ వరకు ఉచిత బస్సులను నడిపించామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుమ్రంభీమ్ మనుమడు కుమ్రం సోనే రావు దంపతులకు నూతన వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి. కాంతిలాల్ సుభాష్ పాటిల్, ఉట్నూర్ ఐటిడిఎ పిఒ ఖుష్బూ గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, అదనపు ఎస్‌పి. చిత్తరంజన్, ఆసిఫాబాద్ ఆర్‌డీవో లోకేశ్వర్ రావు, డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, జిల్లా గిరిజనాభివద్ధి అధికారి రమాదేవి, కుమ్రంభీమ్ మనుమడు కుమ్రం సోనే రావు, సంబంధిత శాఖల అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భారీ వరదలతో రాళ్ళ చెరువుకు గండి



ప్రజాపక్షం/ముధోల్ :మండలంలోని విట్టోలి గ్రామ సమీపంలో ఉన్న రాళ్ల చెరువుకు సోమవారం రాత్రి కురిసిన భారీ వరదలకు చెరువు గండి తెగిపోవడం జరిగింది.దీంతో పక్కనున్న పంట పొలాల్లో నీరు చేరి సోయా,వరి పంటలు నీట మునిగిపోయాయి.ఇప్పటికే రైతులకు వర్షాలతో తీవ్రమైన నష్టం వాటిల్లిందంటే చెరువు నీరు చేనులో చేరడం తీవ్ర నిరాశ కలిగించే విషయమే.చెరువులో వచ్చిన నీరు సంవత్సరాంతం చేపలకు,పశువులకు ఎంతో ఉపయోగపడేవి.గండి తెగిపోవడంతో నీరంతా వృథాగా పోతుంది. సంబ ంధిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు చెరువుల పరిస్థితిని పర్యవేక్షిస్తూ వరదల వల్ల ఇతరులకు నష్టం వాటిల్లకుండా వాటిని సరి చేయాలి.ఐతే ఇప్పటివరకు అధికారులు ఎన్నడూ చెరువులను పర్యవేక్షింది లేదు.వీరి నిర్లక్ష్యం వల్లే ఇప్పుడే నష్టం వాటిల్లింది.గతంలో ఓ రోడ్డు కాంట్రాక్టర్ చెరువు నీటిని వాడుకున్న అధికారులు మౌనంగా ఉండి వారి వంతు పాడారు. ఇపృుడు సామాన్య ప్రజలకు నష్టం వాటిల్లితే ఏమి పట్టించుకోకుండా ఉన్నారు .ఇప్పటికైనా ఉన్నతాధికారులు గండి పడిన చెరువును సరి చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ అభ్యర్థుల ప్రకటన

### ప్రజలు ఎర్రజెండాకు అండగా ఉండాలి ముడుపు ప్రభాకర్‌రెడ్డి..




ప్రజాపక్షం/నిర్మల్/అదిలాబాద్:స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ(జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు),ఎంపీటీసీ(మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ సభ్యుడు) స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేస్తూ సిపిఐ(భారత కమ్యూనిస్టు పార్టీ) జిల్లా కార్యవర్గ కౌన్సిల్ నిర్ణయించింది.ఈ మేరకు ఇవాళ(తేదీ) సిపిఐ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది.సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ,స్థానిక సంస్థల్లో సిపిఐ అభ్యర్థులు గెలవడం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి,ప్రజాసేవకే అంకితమై పనిచేస్తున్న కమ్యూనిస్టు కార్యకర్తలు,నాయకులు ప్రజల పక్షాన నిలబడతారని తెలిపారు.ప్రజల దడగ ఎర్రజెం"అని చెబుతూ,కష్టం వచ్చినా,సుఖం వచ్చినా,ఏ సమస్య వచ్చినా ప్రజల ముందు నిలబడేది ఎర్రజెండా నాయకులేనని అన్నారు.న్యాయంగా పనిచేసే వారు కమ్యూనిస్టులేనని,అందులో సిపిఐ నాయకులు ముందుంటారని పేర్కొంటూ,ప్రజలు తమ ఎర్రజెండాకు అండగా ఉండాలని,సిపిఐ అభ్యర్థులను గెలిపించడం ద్వారా మీకు న్యాయం జరగడానికి సులువవుతుందని ముడుపు ప్రభాకర్ రెడ్డి ప్రజలను అభ్యర్థించారు.

**మహిళా రిజర్వేషన్లపై సిపిఐ పాత్ర..**

ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మాట్లాడుతూ,మహిళలకు చట్టాలు రావడంలో గానీ,స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో గానీ సిపిఐ పార్టీ అనేక ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు.పార్టీతో పాటు ఎన్ఎఫ్ఐడబ్ల్యూ (భారత జాతీయ మహిళా సమాఖ్య) దేశవ్యాప్తంగా గీత ముఖర్జీ వంటి పార్లమెంటు సభ్యుల ద్వారా అనేక పోరాటాలు చేసిందని,అందులో సిపిఐ పాత్ర ముఖ్యమని తెలియజేశారు.అందుకే ఇవాళ మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నామని,ఇది తమ పోరాటం ద్వారానే సాధ్యమైందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు,మండల కార్యదర్శులు అయిన ఘున్నీ,అద్దంకి రమేష్,భీంపూర్ మండల కార్యదర్శి మేకల రవి,ఆదిలాబాద్ రూరల్ మండల కార్యదర్శి మహబూబ్ ఖాన్,సిపిఐ పట్టణ కార్యదర్శి తాప్రెస్ ఖాన్,బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు ఖండాల గణేష్,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు,సీనియర్ నాయకులు షేక్ పాషా,బెజ్జంకి నర్సింగరావు,సిపిఐ సీనియర్ నాయకులు ఎస్.అరుణ్ కుమార్,మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు గేదం పుష్ప,సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



# ఇక ఆకాశంలో హంగామాకు రెడీ

## సర్టిఫైడ్ 'డ్రోన్ పైలెట్'గా ధోనీ

భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి అభిరుచులు చాలానే. క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే మహీభాయ్.. బైక్‌లు నడపడంతో పాటు యానిమేషన్, సినిమా రంగంలోనూ ప్రయోగాలు చేస్తుంటాడు. ఇప్పుడు మరో అడుగు ముందేసి సాంకేతికను అందిపుచ్చుకున్నాడు అతడు. ఇన్నిరోజులు మైదానంలో హెలిక్యాప్టర్ షాట్లతో అలరించిన ధోనీ ఇకపై ఆకాశంలోనూ తన మార్క్ చూపించనున్నాడు. అవును.. 'సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్'గా గుర్తింపు సాధించాడీ వెటరన్. ఈ సంతోషకరమైన విషయాన్ని ధోనీ అభిమానులతో పంచుకుంది గరుడ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ. భారత్‌లోని ప్రముఖ ఏరోస్పేస్ సంస్థ అయిన గరుడ ఏరోస్పేస్ నుంచి ధోనీ డ్రోన్ పైలెట్ లైసెన్స్ సాధించాడు. డ్రోన్ల తయారీకి ప్రసిద్ధి చెందిన ఈ కంపెనీకి ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న మహీ.. ఇప్పుడు అదే సంస్థ నుంచి సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్‌గా అవతరించాడు. ఇటీవలే చెన్నైలో కంపెనీ డీజీసీఏ అప్రూవ్డ్ రిమోట్ కంట్రోల్ శిక్షణ కేంద్రంలో పాల్గొన్న ధోనీ.. తన నైపుణ్యాలను ప్రదర్శించి లైసెన్స్ పట్టేశాడు. 'గరుడ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రచారకర్త, పెట్టుబడిదారుగా ఉన్న ధోనీ ట్రైనింగ్ పూర్తి చేసుకొని.. డ్రోన్ పైలెట్ లైసెన్స్ సాధించాడు. అతడు చాలా త్వరగా డ్రోన్ ఎగురేయడం నేర్చుకున్నాడు. డ్రోన్ పరిశ్రమలో విస్తరించాలనుకున్న మా టీమ్‌కు ధోనీ కీలకం కానున్నాడు. అతడి లాంటి లెజెండ్స్ ఏదైనా పాటిస్తే దేశం మొత్తం వాళ్లను అనుసరిస్తుంది. ప్రస్తుతం ధోనీ డీజీసీఏ సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్. అతడు గరుడ ఏరోస్పేస్ కేంద్రంలో శిక్షణ పొందాడు. ఇప్పటికే 2,500 మంది ఔత్సాహిక యువతకు డ్రోన్ పైలటింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చాం' అని ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది గరుడ స్పేస్.



# అగ్రస్థానంలో మంధాన..


## సెంచరీతో టాప్-5లోకి దూసుకొచ్చిన బ్రిస్త్!

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దంచికొడుతున్న బ్యాటర్ల ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో అదరగొట్టారు. న్యూజిలాండ్‌పై విధ్వంసక శతకం బాదిన తంజిమ్ బ్రిస్త్ టాప్5లోకి దూసుకొచ్చింది. ఇండోర్ స్టేడియంలో రికార్డు శతకంతో సఫారీ జట్టును గెలిపించిన బ్రిస్త్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానం సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 706 పాయింట్లు ఉన్నాయి. భారత ఓపెనర్ స్మృతి మంధాన అగ్రస్థానంలో నిలిచింది.

ఐసిసి మంగళవారం ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన అగ్రస్థానంలో నిలిచింది. వన్డే వరల్డ్ కప్ ముందు రెండు శతకాలతో మెరిసిన టీమిండియా వైస్ కెప్టెన్ 791 రేటింగ్ పాయింట్లతో నంబర్ 1 ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఇంగ్లాండ్ సారథి నాట్ సీవర్ బ్రంట్ రెండో ర్యాంక్ సాధించగా.. ఆసీస్ స్టార్ బ్యాటర్ బేత్ మూనీ 713 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియాకే చెందిన అష్ గార్డ్‌నర్ 697 రేటింగ్ పాయింట్లతో ఐదో ర్యాంక్ పట్టేసింది.



# తొలి వరల్డ్ కప్ విజేత.. వెస్టిండీస్ దిగ్గజం కన్నుమూత



వెస్టిండీస్ క్రికెట్‌లో విషాదం నెలకొంది. తొలితరం క్రికెటర్, మొట్టమొదటి ప్రపంచకప్ గెలుపొందిన బెర్నార్డ్ జులియన్‌కన్నుమూశాడు. క్లైవ్ లాయిడ్ సారథ్యంలో 1975 ప్రపంచ కప్ విజేతగా అవతరించిన జట్టులో సభ్యుడైన బెర్నార్డ్ 75 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచాడు. నార్తర్న్ ట్రినిడాడ్‌లో ఆయన మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. వెటరన్ ప్లేయర్, వరల్డ్ కప్ ఛాంపియన్ అయిన బెర్నాల్డ్ మృతిపట్ల వెస్టిండీస్ క్రికెట్ సంతాపం తెలియజేసింది. 'బెర్నాల్డ్ మరణం మమ్మల్ని ఎంతో బాధించింది. ఆయన జట్టుకు అందించిన సేవల్ని కొనియాడుతున్నాం. విండీస్ జట్టు మొదటి వరల్డ్ కప్ విజేతగా అవతరించడంలో బెర్నాల్డ్ కృషి ఎంతో ఉంది. ఈ కష్టసమయంలో ఆయన స్నేహితులు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. క్రికెట్ పట్ల ఆయన నిబద్ధత కలకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది. ఆయన ఆత్మకు చేకూరాలని ప్రార్థిస్తున్నాం' అని విండీస్ క్రికెట్ అధ్యక్షుడు కిశోర్ షాల్లో పేర్కొన్నాడు.

**1975 ప్రపంచ కప్ విజేతగా అవతరించిన జట్టు**



ఆల్‌రౌండర్ అయిన బెర్నాల్డ్ కుడిచేతివాటం బ్యాటర్, మంచి స్పిన్నర్ కూడా. అతడు 1973 నుంచి1977 మధ్య కాలంలో 24 టెస్టులు, 12 వన్డేలు ఆడాడు. వన్డే వరల్డ్ కప్‌లో విండీస్ విజేతగా నిలవడంలో బెర్నాల్డ్ పాత్ర మరువలేనిది. శ్రీలంక, న్యూజిలాండ్‌పై నాలుగేసి వికెట్లతో చెలరేగిన అతడు ఫైనల్లో బ్యాటుతో మెరిశాడు. లార్డ్స్ మైదానంలో జరిగిన టైటిల్ పోరులో ఆస్ట్రేలియాపై 26 పరుగులతో అజేయంగా నిలిచి జట్టు విజయంలో కీలకమయ్యాడు. 1973లో లారడ్స్ టెస్టులో బెర్నాల్డ్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లాండ్ బౌలర్ల వ్యూహాలను తిప్పికొడుతూ 121 పరుగులతో రాణించి జట్టును గెలిపించాడు. అయితే.. సుదీర్ఘ కాలం జాతీయ జట్టుకు ఆడాల్సిన అతడు రెబల్ గ్రూప్‌లో చేరిపోయాడు. అలా.. బెర్నాల్డ్ అంతర్జాతీయంగా ఓ వెలుగు వెలిగే అవకాశాన్ని చేజార్చుకున్నాడు.

# ఫోకస్

# మహిళ

## పెరుగుతున్న నేరాలు..

మహిళలకు భద్రత కల్పిస్తామంటూ ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు.. ఇస్తున్న హామీలు అమలుకావడం లేదని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకటించిన తాజా నివేదికను అనుసరించి 2023లో మహిళలపై మొత్తం 4,48,211 నేరాలు నమోదయ్యాయి. అంతకు ముందు సంవత్సరం కంటే ఇది ఎక్కువ. 2022లో



4,45,256, 2021లో 4,28,278 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు రికార్డుల ఆధారంగా సేకరించిన గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా ప్రతి ఒక లక్ష మహిళల జనాభాకు 66.2 కేసులు ఉన్నాయి. మధ్యంతర అంచనాల ప్రకారం మొత్తం మహిళల జనాభా 6,770 లక్షలు. ఈ కేసుల్లో మొత్తం 77.6 శాతం చార్జ్‌షీటింగ్ రేటు నమోదైంది. రాష్ట్రాల వారీగా చూస్తే, ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 66,381 కేసులు నమోదు కాగా, తర్వాతి స్థానాల్లో తర్వాత మహారాష్ట్ర (47,101), రాజస్థాన్ (45,450), పశ్చిమ బెంగాల్ (34,691), మధ్యప్రదేశ్ (32,342) ఉన్నాయి. అయితే, నేర రేటు పరంగా తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ ప్రతి లక్ష మహిళల జనాభాకు 124.9 కేసులు నమోదయ్యాయి. తర్వాత రాజస్థాన్ (114.8), ఒడిశా (112.4), హర్యానా (110.3), కేరళ (86.1) ఉన్నాయి. దేశ వ్యాప్తంగా చూస్తే, భారతీయ శిక్షాస్మృతిలోని (ఐపిసి) 498ఎ సెక్షన్ కింద భర్త లేదా బంధువుల క్రూరత్వం కేసులు అత్యధికం. ఈ విభాగంలో 1,33,676 కేసులు (సగటు రేటు 19.7) మోదయ్యాయి. ఇక మహిళల కిడ్నాపింగ్, అపహరణ కేసులు 88,605, (సగటు రేటు 13.1), మహిళలపై మర్యాద దెబ్బతీయాలనే ఉద్దేశంతో దాడులు 83,891 కేసులు, (సగటు రేటు 12.4), బలాత్కారం కేసులు 29,670, (సగట రేటు 4.4), వరకట్న మరణాలు 6,156, ( సగటు రేటు 0.9), ఆత్మహత్య ప్రేరేపణ 4,825, (సగటు రేటు 0.7), ఆత్మగౌరవానికి భంగకరమైన కేసులు 8,823, (సగటు రేటు 1.3) ఉన్నాయి. బలాత్కార కేసుల్లో 18 ఏళ్లు పైబడిన మహిళలు సంబంధం కలిగినవి 28,821 కాగా, 18 ఏళ్లు లోపువారిపై 849 కేసులు నమోదయ్యాయి. బలాత్కారం ప్రయత్నాలు 2,796 కేసులు, యాసిడ్ దాడులు 113 నమోదయ్యాయి. ప్రత్యేక, స్థానిక చట్టాల (ఎస్ఎల్ఎల్) కింద మహిళలపై నేరాలు 87,850. వరకట్న నిషేధ చట్టం, 1961 కింద 15,489 కేసులు, అనైతిక రవాణా (తప్పుడిన వ్యాపారం) నిరోధక చట్టం, 1956 కింద 1,788 కేసులు, గృహ హింస నుండి మహిళ రక్షణ చట్టం, 2005 కింద 632 కేసులు, మహిళల అసభ్య ప్రాతినిధ్యం (నిషేధం) చట్టం, 1986 కింద 31 కేసులు, పోక్సో చట్టం కింద 40,046 కేసులు (చైల్డ్ రేప్), 22,149 (లైంగిక దాడి), 2,778 (లైంగిక వేధింపులు), 698 (బాలల అశ్లీలత), 513 (ఇతర నిబంధనలు) నమోదు అయ్యాయి. గత ఏడాది వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాలు కూడా మహిళలపై మానసిక, శారీరక దాడులు పెరుగుతున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిస్థితులు దేశంలో మహిళలు అనుభవిస్తున్న దుస్థితిని కళ్లకు కడుతున్నాయి. మహిళల భద్రత, మహిళా అభ్యుదయాన్ని ప్రభుత్వాలు మాటల్లో కాకుండా చేతల్లో చూపాలి. అప్పుడే మహిళలకు కొంతవరకైనా న్యాయం జరుగుతుంది.

## ఇదెక్కడి న్యాయం?



బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాజకీయ హడావుడి మొదలైంది. 'ఓట్ల చోరీ'పై ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఫిర్యాదులు చేసినా, పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. లక్షల్లో మహిళల పేర్లు ఓటర్ల జాబితా నుంచి కనిపించకుండా పోవడంలో అంతరార్థం ఏమిటనేది ప్రశ్న. దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. రాజ్యాంగ మొదటి పేజీలోనే 'ప్రజలు' అనే సంబోధన ఉంది. కానీ, ఆ ప్రజల్లో మహిళల ప్రాధాన్యతను నామమాత్రపు స్థాయికి తగ్గించడం ఎంత వరకూ సమంజసం? చివరికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కూడా తొలగిస్తున్న వైనం. ఇదెక్కడి న్యాయం? బిహార్‌లో 22.7 లక్షల మహిళా ఓటర్ల పేర్లు జాబితా నుండి మాయమయ్యాయి. ఇది ఒక పరిపాలనా పొరపాటు కాదు.... ఒక సామాజిక దృష్టి లోపం. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు సమానత్వం, స్వేచ్ఛ, గౌరవం, హక్కులు ఇచ్చింది. కానీ, ఎంత వరకూ సక్రమంగా అమలవుతున్నాయన్నది ప్రశ్న.

ఆర్టికల్ 14 – సమానత్వం: ప్రతి పౌరుడు చట్టం ముందు సమానుడు. ఒక స్త్రీ పేరు జాబితా నుండి తొలగిస్తే, ఈ సమానత్వమే ప్రశ్నార్థకం అవుతుంది.

ఆర్టికల్ 15 – వివక్ష నిషేధం: లింగం, కులం, మతం, వర్గం ఆధారంగా వివక్ష చేయరాదు. అయితే మహిళల పేర్లు ఎక్కువగా మాయమవడం ఈ ఆర్టికల్‌ను ప్రత్యక్షంగా ఉల్లంఘిస్తుంది.


ఆర్టికల్ 19 – స్వేచ్ఛ : ఓటు హక్కు కేవలం ఎన్నికల్లో పాల్గొనడమే కాదు, అది రాజకీయంగా వ్యక్తీకరణరూపం. మహిళా ఓటు తొలగించడం అంటే ఆమె స్వరాన్ని నొక్కివేయడమే.

ఆర్టికల్ 21 – జీవన హక్కు : గౌరవంతో జీవించడానికి హక్కు ఉంది. ఓటు లేని పౌరుని గౌరవం కేవలం మౌఖిక హక్కుగా మిగిలిపోతుంది.

ఆర్టికల్ 326 – సార్వత్రిక ఓటుహక్కు : ప్రతి పౌరుడికి ఓటు హక్కు హామీ. పేర్ల తొలగింపుతో ఈ హక్కును దక్కకుండా చేసిన మరుక్షణమే ప్రజాస్వామ్యం నుండి మహిళ పాత్ర అదృశ్యమైంది.

మహిళలకు ఓటు హక్కు ఎవరి దయాదాక్షిణ్యాలుకావు. ఇది సామాజిక ఉద్యమాల ఫలితం. స్త్రీలు, దళితులు, కార్మికులు, రైతులు ఈ దేశపు ప్రజాస్వామ్యానికి మూలం. కానీ అదే ప్రజలు ఇప్పుడు జాబితా వెలుపల ఉన్నారు. ఇది యంత్రాంగ వైఫల్యం అనేకంటే, ఈ వ్యవస్థ నిజస్వరూపమనడమే అర్థవంతం. సామాజిక సమానత్వం లేని ప్రజాస్వామ్యానికి విలువ ఉండదు. మహిళల పేర్లను తొలగించినప్పుడు, ఆమె హక్కులు కేవలం చట్టాలకు, కాగితాలకు మాత్రమే పరిమితవుతుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం, దేశంలో 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉంటుంది. 1988లో, 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ వయసును 18 సంవత్సరాలకు తగ్గించారు. అయితే, దేశంలో ఉంటున్న విదేశీయులకు, పిచ్చివారికి, దివాలా పిటిషన్ (ఐపి) పెట్టిన వారికి, తీవ్రమైన నేరాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న వారికి ఓటు హక్కు ఉండదు. మరి బిహార్‌లో ఎన్నికల కమిషన్ తొలగించిన లక్షలాది మంది మహిళలు ఈ జాబితాలో ఏ విభాగానికి చెందుతారో అధికారులే వివరించాలి. ఒక స్త్రీ ఓటు వేయడం అంటే శతాబ్దాల నిషేధానికి ప్రతిస్పందన. ఒక స్త్రీ పేరు తొలగించబడడం అంటే శతాబ్దాల న్యాయం పునరుద్ధరణకు ఎదురుదెబ్బ. ప్రతి ఓటు ఒక స్వరం, ప్రతి స్వరం ఒక హక్కు, ప్రతి హక్కు ఒక గుర్తింపు. అదే గుర్తింపును చెరిపివేస్తే, ప్రజాస్వామ్యం శ్వాస తీసుకోవడం ఆగిపోతుంది. ఈ అన్యాయంపై మహిళలే గళం విప్పాలి. హక్కు కోసం ఉద్యమ బాట పట్టాలి. తనను తాను ఈ వ్యవస్థలో పునఃప్రతిష్టించుకోవాలి.

## ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ : సిపిఐ



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లా కేంద్రంలోని చైన్ గేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో కొమురం భీం విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కొమురం భీం వర్ధంతిని పురస్కరించుకుని సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూక్యా రమేష్ మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ముద్దుబిడ్డ కొమరం భీమ్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎన్ రెడ్డి, రవి, బాబూలాల్, గంగయ్య పాల్గొన్నారు.

## గాజాపై జరుగుతున్న మారణకాండ ఆపాలని ఎఐవైఎఫ్ ఆందోళన



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గాజాపై జరుగుతున్న మారణకాండని ఇజ్రాయిల్ ఆపాలని, దానికి సహకరిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో పాలస్తీనా ప్రజలకు మద్దతుగా పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేశమోని ఆంజనేయులు, బిజ్జ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండను వెంటనే ఆపాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ మౌనం వీడాలని, పాలస్తీనాకు సంఘీభావం తెలపాలని, యుద్ధం ఆపేవిధంగా ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివకృష్ణ, డిహెచ్‌పిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మి పతి, శివశంకర్, గోపాల్, రాముడు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్



**ప్రజాపక్షం/వరంగల్ :** విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ అన్నారు. వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ఖిలా వరంగల్ మండలం సమితి సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో శరత్ మాట్లాడుతూ రాష్ట్రం లో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే 25వేలకు పైగా విద్యార్థులకు సంబంధించిన రూ.180 కోట్ల బకాయిలు ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుండి విడుదల చేయకపోవడంతో ఆ స్కీం పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను మంగళవారం నుండి పాఠశాలలకు రావద్దన్న పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివ, భరత్, మదారపు శ్రేయస్, రమేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి రాజ్యాంగాన్ని అవమానించడమే

## మతోన్మాద విషసంస్కృతితో భౌతికదాడులు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిజెఐపై దాడి రాజ్యాంగాన్ని అవమానించడమేనని, మతోన్మాద విషసంస్కృతితోనే ఇలాంటి భౌతికదాడులు జరుగుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి యావత్‌దేశం తలదించుకునే నీచమైన చర్య అన్నారు. దీనికి కారణం బిజెపి, ఆర్ఎస్ఎస్, దాని పరివార్ శక్తులు అని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని అనుసరించాలని ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ సంఘటనకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని, దీనికి ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మి పతి, జిల్లా నాయకులు గోపాల్, శివశంకర్, బిజ్జశ్రీను, అంజి, శివకృష్ణ, బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో ప్రధాన న్యాయమూర్తిపై దాడి ధోరణి అరాచకత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, బానోతు లింగనాయక్, చిరాల జ్ఞానేశ్వర్, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్ రవి చంద్ర బోస్, మంద శంకర్, తండా శ్రీనాథ్, కూరాకుల పాల్, నక్క నాగార్జున, శ్యాంప్రసాద్, బేతమల్ల శ్రీనివాస్, మెతుకు కుమార్, ఎండి రఫీ, బల్లెం శ్రీకాంత్, జడలనట రాజ్, దాసు, లాలు, ఎండి షంషీర్, తోట రమేష్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా వికారాబాద్ న్యాయవాద బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించిన సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు బస్వరాజ్ పటేల్, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కమల్‌రెడ్డి, అశోక్‌కుమార్, శంకరయ్య, వసుంధర, శ్రీలత, రాంచందరావు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** సిజెఐపై దాడి రాజ్యాంగాన్ని అవమానించటమేనని సిపిఐ సీనియర్ నాయకుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ సిపిఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎల్‌బినగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నే సుజాత, కందుల సుధాకర్, ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు బోయపల్లి రాములుగౌడ్, ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశివర్ధన్‌రెడ్డి, బొంగు అరుణ్ కుమార్‌గౌడ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు మండల కార్యదర్శి సరిత, శోభ, అరుణ, సౌజన్య, సుమతి, రజిత, కళ్యాణి, శివజ్యోతి, జ్యోతి, పాల్వాయి సురేందర్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.









# సిపిఐలో చేరిన 30 కుటుంబాలు



## పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. ఆళ్లపల్లి మండలంలో పాతూరు గ్రామపంచాయితీ అనంతోగు గ్రామపంచాయతీ నుంచి సుమారు 30 కుటుంబాలు సిపిఐలో చేరారు. పాతూరు గ్రామానికి చెందిన సపన సీతారాములు, గొగ్గల రాజేందర్ సమక్షంలో 15కుటుంబాలు, ఆనంతోగు గ్రామపంచాయితీ జిన్నలగూడెం గ్రామంలో 15 కుటుంబాలు జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, జిల్లా నాయకులు గొగ్గెల కృష్ణ, మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు, మండల నాయకులు వజ్జ పగడయ్య ఆధ్వర్యంలో సిపిఐ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి సాబీర్‌పాషా పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆళ్లపల్లి మండలంలో సిపిఐ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు పూనెం సూర్యనారాయణ, నవీన్, అబ్బయ్య, కల్తి భద్రం, ప్రభాకర్, గొగ్గల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూళ్లపై నిర్లక్ష్యం

## వెంటనే బిల్లులు చెల్లించాలి

### ఎఐఎస్ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు మూసివేతకు సిద్ధమయ్యాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని, ఒకటి నుంచి పదవ తరగతి వరకు 23వేల మంది సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు, ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఏడువేల మంది విద్యార్థులు వీటిల్లో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, జిల్లా సాయి, కార్యదర్శి శివానాయక్, గోపి, చంటి, పవన్, నరేందర్, నాగరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కన్నాయిగూడెం మండల మహిళా కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు మండలాధ్యక్షుడు అప్సర్ పాషా, ఇన్‌చార్జి జాడి రాంబాబు ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి సమక్షంలో కన్నాయిగూడెం మండల మహిళా కాంగ్రెస్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా కోరగట్ల అనిత, మండల ఉపాధ్యక్షురాలుగా పుల్ల సుశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, జిల్లా నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అన్ని సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## బిజెపి కుట్రలను ప్రతీ ఒక్కరూ ప్రతిఘటించాలి

ఎంపి కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగ రాజు

**ప్రజా పక్షం/వర్ధన్నపేట:** బిజెపి పార్టీ చేస్తున్న కుట్రల పట్ల ప్రతీ ఒక్కరూ మేల్కొని ప్రతిఘటించాలని వరంగల్ ఎంపి కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం వర్ధన్నపేట బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్‌వరకు ఓటు చోరీపై బిజెపి పార్టీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజులు పాల్గొని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల్లో నెగ్గేందుకు బిజెపి ఓట్ల చోరీకి పాల్పడుతోందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపర్చే ఈ చర్యలకు వ్యతిరేకంగా మనమందరం స్వరం ఎత్తాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడి ప్రాథమిక ఓటు హక్కును బిజెపి పార్టీ కాలరాస్తోందని మండి పడ్డారు. ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేస్తున్న బిజెపి కుట్రల పట్ల ప్రతి ఒక్కరూ మేల్కొని ప్రతిఘటించాలని తెలిపారు. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి నిజమైన రక్షణ కేవలం కాంగ్రెస్ పార్టీ వలనే సాధ్యం అని స్పష్టం చేశారు. విద్యార్థులు, కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మనువాదుల కుట్రలో భాగమే ప్రధాన న్యాయమూర్తిపై దాడి



**ప్రజాపక్షం/ములుగు:** మనువాదుల కుట్రలో భాగమే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. వెంకటాపూర్ మండలం లింగాపూర్ గ్రామంలో ప్రజా సంఘాల సమావేశం ఏర్పాటు చేయగా, ఈ సమావేశంలో పాల్గొన్న రవీందర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు నడుస్తున్న సమయంలోనే అందులోనే పనిచేస్తున్న మనువాద ముసుగులో ఉన్న ఒక న్యాయవాది చేసిన దాడి మమతత్వ శక్తుల పరాకాష్టకు నిదర్శనమన్నారు. సనాతన ధర్మం పేరుతోని జరుపుతున్న దాడులను ప్రజలందరూ గమనించాలని, అనాదిగా కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజలను విభజించి పాలించాలని చూస్తున్న మనువాద పార్టీ విధి విధానాలపై తిరుగుబాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సతీష్, రవి, రాజేందర్, నారాయణ స్వామి, రాజేశ్వరరావు, కిష్టయ్య, చంద్రు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో బిఆర్ఎస్ నాయకుల చేరిక



**ప్రజాపక్షం/ఖానాపూర్:** మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై 10 కుటుంబాలు స్వచ్ఛంగా నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శాఖమూరి హరిబాబుల నాయకత్వంలో కొత్తూరు గ్రామ పార్టీ అధ్యక్షులు ఆరే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో భాషబోయిన ఐలయ్య, గాదరబోయిన యాకయ్య, మేడపల్లి శంకర్, దొంతరబోయిన ప్రవీణ్, చిరుత భాస్కర్, కడుతూరి రాములు, అంకశ్రపు రాజేష్, జాటోతు రమేష్, జంగిలి కుమార్, బుడిగె రమేష్‌లు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు వేములపల్లి వెంకట ప్రసాద్ రావు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్‌కె ముస్తఫా, మండల పార్టీ కార్యదర్శి కోరే రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి జాబు కార్డు ప్రతీ ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలి

మల్లంపల్లి ఎపిఒ ఎన్ సునీత



**ప్రజాపక్షం/ములుగు:** మల్లంపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో 100 రోజుల ఉపాధి హామీ పథకానికి సంబంధించిన జాబ్ కార్డులు కలిగిన వేతన కార్మికులు తమ గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా తప్పనిసరిగా ఇకెవైసి అప్‌డేషన్ చేయించుకోవాల్సిందిగా మండల ఎపిఒ నారగాని సునీత ఉపాధి కార్మికులను కోరారు. సోమవారం మల్లంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఈ కెవైసి అప్‌డేషన్ చేయించుకోని కూలీలు ఇకపై ఉపాధి హామీ పథకం కింద పనులకు హాజరు కావడం, పనులు పొందడం సాధ్యం కాదని అన్నారు. అట్టి కూలీలకు వ్యక్తిగత పనులకు సాంక్షన్ చేయడం కూడా కుదరదన్నారు. మండలంలోని ప్రతి జాబ్ కార్డు దారులు తమ గ్రామ పంచాయతీ సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను వెంటనే సంప్రదించి ఇకెవైసి అప్‌డేషన్ పూర్తి చేయించుకోవాలని తెలిపారు. చనిపోయిన వ్యక్తుల పేర్తు, పెళ్ళయి అత్తగారింటికి వెళ్ళిన మహిళల పేర్లు మొదలైన వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలియజేసి జాబ్ కార్డు నుండి తొలగించుకోవాల్సిందిగా కోరారు. అదేవిధంగా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు అందుబాటులో ఉండి ఎకెవైసి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ గణేష్, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## అనిల్‌కు డాక్టరేట్ ప్రదానం



**ప్రజాపక్షం/ తొర్రూరు :** మండలంలోని సోమారం గ్రామానికి చెందిన గద్దల అనిల్ తెలుగు విభాగంలో డాక్టరేట్ పట్టా పొందాడు. మంగళవారం బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి చేతుల మీదుగాపిహెచ్‌డి తెలుగు విభాగంలో గద్దల అనిల్ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. 'సరబాదముఖ్యప్రాణ్ రావు రచనలు సమగ్ర పరిశీలన' పేరుతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డాక్టర్ రజనీ పర్యవేక్షణలో సిద్దాంత గ్రంథం అందజేసి డాక్టరేట్ పట్టాను అనిల్ అందుకున్నాడు. నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నాడు. అనిల్ డాక్టరేట్ పట్టా పొందడంతో సోమారం గ్రామస్తులు, తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.

# నిబంధనల ప్రకారం కొనుగోలు

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు :** పండించిన ప్రతి నాణ్యమైన గింజను ప్రభుత్వం నిబంధనల ప్రకారం పక్కాగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఏటూరునాగారం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, తాడ్వాయి, గోవిందరావుపేట పరిధిలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా జరగాలని, జిల్లాలో దాదాపు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో ఉన్న రైతుల వివరాలు, రైతులు సాగు చేసిన భూ విస్తీర్ణం వివరాలు, వచ్చే పంట దిగుబడి వివరాలు ముందస్తుగా తెలుసుకోవాలని, షెడ్యూల్ ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయిలో 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 కంటే తక్కువ తేమ శాతంతో కొ నుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని, రైతుల ధాన్యం నాణ్యతను వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలించి ధృవీకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన మేర ప్యాడీ క్లీనర్లను ఏర్పాటు చేశామని, ధాన్యాన్ని తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్లతో శుభ్రం చేసిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ట్రక్ షీట్ అందించాలని, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కటింగ్ విధించడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో డిజిటల్ వేయింగ్ యంత్రాలను మాత్రమే వినియోగిస్తున్నామని, వాటి పనితీరును జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల కొరత ఏర్పడితే వెంటనే సమాచారం అందించాలని, సకాలంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే గన్నీ బ్యాగుల నాణ్యతను ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పరిశీలించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సైతం గన్నీ బ్యాగుల నాణ్యత పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, సమస్య ఏదైనా ఏర్పడితే వెంటనే ఎలక్ట్రీషియన్ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాతావరణ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎక్కడ, ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో వాట్సాప్ గ్రూపు తయారు చేశామని, కొనుగోలు ప్రక్రియలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్యాడీ క్లీనర్లు పెట్టక పోయినా, వాటిని సరిగా వినియోగించకపోయినా, రైస్ మిల్లుల వద్ద కోత పెట్టినా, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ట్రక్ షీట్ జారీ చేయకపోయినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మొదటి రోజు నుండి నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి షా ఫైజల్ హుస్సేని, సివిల్ సప్లయి కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాంపతి, జిల్లా సహకార అధికారి సర్ధార్ సింగ్, సంబంధితఅధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎటిసి నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ప్రజాపక్షం/వాజేడు:** ఎటిసి నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మంగళవారం అన్నారు. వాజేడు మండలంలోని , ప్రభుత్వ ఐ.టి.ఐ, ఎ.టి.సి కేంద్రాలను సందర్శించారు. ఆయన క్యాంపస్‌లను పరిశీలించి సిబ్బందితో, శిక్షణార్థులతో మాట్లాడి శిక్షణా కార్యక్రమాల పురోగతి, సదుపాయాలు, ఏటీసీ పనుల స్థితిని సమీక్షించారు. అలాగే ఏటీసీ కోసం వచ్చిన మెషినరీ, ఫర్నిచర్, కంప్లీట్ కావలసిన పెండింగ్ పనులు, రిక్రూట్మెంట్ అయిన ట్రైనర్స్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణ నాణ్యత, వృత్తి విద్యా సదుపాయాల విస్తరణ, విద్యార్థుల ప్రాక్టికల్ నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల శిక్షణా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణా విధానాలను సవీకరించాలని అధికారులకు సూచనలు సలహాలు తెలిపారు. ప్రస్తుత ఏటిసి సెంటర్ ద్వారా అందించే నైపుణ్య శిక్షణ చాలా ప్రాముఖ్యమైందని అన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా పిల్లలు బాగా చదువుకొని మన జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ సందర్శనతో సంస్థలలో సిబ్బంది విద్యార్థుల్లో ఉత్తేజం నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కలెక్టర్‌ని కోరితే ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వాజేడు ప్రిన్సిపాల్ శేఖర్, ఎంపీఓ శ్రీకాంత్, ఆర్ఐ కుమారస్వామి, ఐటిఐ ఉపాధ్యాయులు రాము, సన్నీ,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ సత్య శారద




**ప్రజాపక్షం/ వరంగల్:** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని జిల్లా ఇవిఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్‌పిసిఇఒ రామిరెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



**ప్రజా పక్షం/రాయపర్తి:** కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మహబూబ్ గ్రామంలో బిఆర్ఎస్‌కు చెందిన సుమారు 30 కుటుంబాలు బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రజల పక్షాన పనిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విశేష మార్పులు తీసుకొచ్చిందన్నారు. అభివృద్ధిని చూసి ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

**స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం పాలకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో మండల ముఖ్య నాయకులతో కలిసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ భవిష్యత్‌కు ఎంతో కీలకమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం కోసం ప్రతీ ఒక్కరూ ఒక టీమ్‌గా పనిచేయాలన్నారు. ప్రతీ గ్రామంలో, ప్రతీ బూత్ స్థాయిలో కాంగ్రెస్ బలాన్ని పెంచి అభ్యర్థులను అత్యధిక మెజార్టీలో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్, మాజీ టిపిసిసి కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆకుల సురేందర్‌రావు, పెండ్లి మహేందర్‌రెడ్డి, ఎసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కంజర్ల ఎల్లయ్య, ఇల్లందుల భగవాన్, ఎండి నయీం, కుంట రమేశ్, పాల్వంచ కోటేశ్వర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, నంగునూరి అశోక్, కుందూరు రత్నాకర్ రెడ్డి, కుంట రమేశ్, మందాటి సుదర్శన్‌రెడ్డి, ఎనగందుల మురళి, భూక్య సమ్మయ్య, చిర్ర మల్లయ్య, ఎండి ఉస్మాన్, జినుగు రత్నాకర్‌రెడ్డి, ఇల్లందుల భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/ కమలాపూర్:** ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న సిపిఐ అభ్యర్థులను స్థానిక ఎన్నికలలో గెలిపించాలని సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమలాపూర్ మండలం జెడ్‌పిటిసితో సహ ఎంపిటిసి స్థానాలకు అభ్యర్థులను బరిలోకి దించుతాం ఆయన అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలో పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం వంద సంవత్సరాల నుంచి భారత కమ్యూనిస్టు నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న రైతులు, వ్యవసాయ కూలీల, కార్మిక, విద్యార్థి మహిళ యువజన సమస్యలు, అంతర్గత రోడ్ల నిర్మాణం, విద్యా, వైద్యం, పేదవారికి ఇండ్ల స్థలాలు, నిరంతరం ప్రజా ఉద్యమాలు చేస్తూ సమస్యల పరిష్కారం కోసం అధికార ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయి స్నేహపూర్వకంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తప్పకుండా స్థానాలను కేటాయించి ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఐ పార్టీ అభ్యర్థులకు సహకరించాలని భిక్షపతి కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి నకిర్త ఓదేలు, ఉట్కూరు రాములు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, కర్రె లక్ష్మ ణ్, ధర్మల రామ్మూర్తి, కొలుగోరు బాలరాజు, నిమ్మల మనోహార్, బొజ్జం లక్ష్మి , శిరీష తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కార్యాలయంలో పర్గత్ దివస్



**ప్రజాపక్షం/భూపాల-పల్లి :** భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో పర్గత్ దివస్ సందర్భంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం ప్రతి మనిషి జీవితానికి మార్గదర్శక గ్రంథం అని కొనియాడారు. ఆయన చూపిన సత్యం, ధర్మం, కర్తవ్య మార్గాలు నేటి సమాజానికీ ప్రేరణ అని, ఆయన ఆచరించిన ఆధ్యాత్మిక, నైతిక విలువలను మనమందరం జీవితంలో అనుసరించాలని తెలిపారు. ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, డిపిఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాటు



వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**ప్రజాపక్షం/రాయపర్తి:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం రాయపర్తిలోని ఎంపీడీఓ కార్యాలయం సందర్శించి స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సామాగ్రి, రిటర్నింగ్, సహాయ అధికారి స్వీకరణ గదులను, జనరల్ అబ్జర్వర్, వ్యయ పరిశీలకుల గదులు, ఎన్నికల సిబ్బంది తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరగాలని, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, పాటించాల్సిన విధానాలు, ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై సమీక్షించారు. ఎలాంటి పొరపాట్లు, ఆలస్యం లేకుండా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరగాలని, భద్రతా పరంగా పోలీసు విభాగంతో సమన్వయం చేసుకోవాలన్నారు. అనంతరం రైతు వేదిక పక్కనే నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం వరంగల్ జిల్లా సరిహద్దు కిష్టాపురం క్రాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈఓ రాంరెడ్డి, డిపిఒ కల్పన, హౌసింగ్ పిడి గణపతి, డిబిసిడిఒ పుష్పలత, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపిడిఒ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నెరవేర్చేంతవరకు ప్రతిపక్ష పార్టీగా నీడల వెంటాడుతామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజలకు ఆనాడు ఎన్నికలలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపుగా 660 రోజులు, 22 నెలలు అయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోఇచ్చిన హామీలను అమలు చేస్తామన్న మీ హామీలను గుర్తు చేస్తున్నామని అన్నారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను మర్చిపోయిందని అన్నారు. నియోజకవర్గం ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలను కలిసి కాంగ్రెస్ బాకీ కార్డు ఇస్తూ వివరిస్తూ ఉంటే వాళ్ళ పునాదులు కదులుతాయనే భయంతో ఈ కాంగ్రెస్ నాయకులు ప్రశ్నకు ప్రశ్న సమాధానం ఇస్తూ ఏదో ధోఖా కార్డుల పేరుతో కొత్త రాజకీయం మొదలు పెట్టారని అన్నారు. ఇప్పటికైనా తమ విధానాన్ని మార్చుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సిగ్గం వెంకటరాణి సిద్ధు, మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నిత్యం పేద ప్రజల పక్షాన పోరాటం

సిపిఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజల పక్షాన పోరాటం చేసే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి కోరారు. మంగళవారం మండలంలోని శ్రీమన్నారాయణపురం గ్రామంలో సిపిఐ నాయకుడు మరాఠీ యాదగిరి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా యాదగిరి పాల్గొని మాట్లాడుతూ నిత్యం పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తూ, ప్రజా సమస్యలే తమ ఎజెండాగా పోరాడుతున్న సిపిఐ నాయకులను స్థానిక ఎన్నికలలో నిలిచిన అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యానికి నాంది పలకాలని ఆయన మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్రీనివాస్, రెయిన్ బాబు, భిక్షపతి, చంద్రమౌళి, రాములు, అనుమాజీ, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఉద్యోగుల సహనాని పరీక్షించకండి!

**ప్రజాపక్షం/కొణిజర్ల:** ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లు ఆశగా రెండు అంశాల కోసం చకోర పక్షకుల్లా ఎదురుచూస్తూ ఉంటారు. వాటిలో ఒకటవది నిర్ణీత సమయానికి కరువు భత్యం, రెండోది వేతన సవరణ. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వారి పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఏటా రెండుసార్లు జనవరి, జులై నెలల్లో కరువు భత్యం(డిఏ) మంజూరు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ పరిధిలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు కరువు భత్యం మంజూరు చేస్తుంది.పెండింగ్‌లో పెట్టడం విడ్డూరం. జులై 2023 నుండి ఐదు డిఏలు కలిసి మొత్తంగా 14.56% పెండింగ్‌లో పెట్టడంతో వేతన జీవులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఇక జులై 2023 నుండి రెండో వేతన సవరణ(పిర్సీ) అమలు జరగాల్సి ఉండగా, నేటికి రెండు సంవత్సరాల కాలం గడిచిపోయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. ముఖ్యమంత్రి చొరవ తీసుకొని వెంటనే ఐదు పెండింగ్ డిఏలను మంజూరు చేస్తూ రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని వేతన జీవులు ఆకాంక్షిస్తున్నారు. అని ఎస్‌టియు టిఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరామత్ అన్నారు.

## ఎసిపి విష్ణుమూర్తి మరణం బాధాకరం




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తి సోమవారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణిచారు. మంగళవారం ఆయన స్వగృహంలో వారి పార్థివదేహాన్ని సందర్శించి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలో విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్, విద్యార్థి సం ఘంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విష్ణుమూర్తి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని, ఎప్పుడూ నవ్వుతూ, ధైర్యంగా ఉండే విష్ణుమూర్తి మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. వారి మరణం పట్ల ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి సిపిఐ అం డగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు ఎస్‌కే నాగుల్ మీరా, ఎల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, ఎస్‌కే చాంద్ పాషా, గుడిమెట్ల సీతయ్య, గుండెపిన్ని మధు, కొండా వీరయ్య, పాలెపు ప్రభాకర్, కిలారి ముత్యాలు, నివాళులర్పించారు.

## క్రమశిక్షణ, సమయపాలనే విజయానికి సోపానాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** క్రమశిక్షణ, సమయపాలన విజయానికి సోపానాలని ఖమ్మం అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ రామానుజం తెలిపారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు చేయూతగా అందించిన రూ. 20వేల చెక్కును మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిరుపేద ఇంజనీరింగ్ విద్యార్థి పండిట్ జయంత్‌బాబుకు అడిషనల్ డిసిపి రామానుజం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న చేయూతను అభినందించారు. ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య సేవలను కొనియాడారు. సమయపాలన, క్రమశిక్షణ పాటించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య ఆకాంక్షించారు. ట్రస్టు ద్వారా నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తమకు అందించిన సహాయాన్ని మరిచిపోకుండా ఉన్నత స్థానంలో ఉన్నప్పుడ మరికొంత మందికి చేయూత నందించాలని కోరారు. విశ్రాంత పోలీస్ శాఖ ఉద్యోగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన సాయిశ్రీజ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాల్లో బిసి సంక్షేమ అధికారిగా ఎంపికైన సాయిశ్రీజ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. రాజన్న సిరిసిల్ల బిసి సంక్షేమ అధికారిగా కేటాయించబడి శిక్షణలో భాగంగా ఖమ్మంజిల్లాకు వచ్చిన సాయి శ్రీజ మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా సాయిశ్రీజను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి తదితరులున్నారు.

## ఎటిసి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ప్రారంభించిన ఏటిసి కేంద్రాన్ని మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్ ఆకస్మికంగా సందర్శించారు. ఏటిసి లో పెండింగ్ పనులను గురించి వాటి పురోగతి విషయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొదించుకోవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో స్కిల్స్ పెంచుకోవాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతిదీ మన నిత్య జీవితంలో ఉపయోగపడేలా తయారుచేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపాల్ జి రవి, సూపరిటెండెంట్ టి ఎన్, జ్యోతి రాణి, ఏటిఓలు శ్రీనివాసరావు, జి వి కృష్ణారావు, నర్సయ్య, వేణుగోపాల్, ఏటిసి సిబ్బంది పూర్ణచంద్రరావు, సూనాథ్ అశోక్, శ్రావణి, చందు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులకు బ్రేక్



**ప్రజాపక్షం/ తిరుమలాయ-పాలెం :** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల పరిధిలో ని పలు గ్రామాల్లో ఎన్నికల కోడ్ నెపంతో పారిశుద్ధ్య పనులు నిలిపివేసిన వింత సంఘటన ఎ దురవుతుంది. ఇన్ని రోజుల నుంచి గ్రామపంచాయతీల్లో నిధులు లేవు అనే సాకుతో పారిశుద్ధ్య పనులు అరకొర చేసి పంచాయతీ కార్యదర్శులు చేతు లు దులుపుకున్నారు. ఇప్పుడు కొత్తగా తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ ఎన్నికల కమీషన్ విడుదల చేయగా గ్రామపంచాయతీ పారిశుద్ధ్య పనులకు ఎన్నికల కోడ్‌కు పంచాయతీ కార్యదర్శులు లింకు పెడుతున్నారు. నిలిచిపోయి సైడ్ కాలువల్లో చెత్త అంతా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతూ దోమలు చేరి విష జ్వరాలతో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మల్టీ పర్పస్ వర్కర్స్‌కు దోమలు నివారణ పనులు చేపట్టకుండా వారి సొంత పనుల్లో నిమగ్నమవుతున్నారు.

# జనాభాకు అనుగుణంగా వసతుల కల్పన

అభివృద్ధి పనులకు తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని 46వ డివిజన్‌లో మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. రూ. 1.65 కోట్లతో డివిజన్‌లో నిర్మించనున్న సిసి రోడ్లు, సిసి డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఖమ్మం నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుంద ని దానికి అనుగుణంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కక్ష్యలు, కార్పణ్యాలు, కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి అ న్నదమ్ముల్లా ఉండాలన్నారు. ఖమ్మం ప్రశాంతతకు, శాంతిభద్రతలకు మారుపేరుగా ఉండాలన్నారు. రాజకీయ వేధింపులు, అక్రమ కేసులు వంటివి లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజ లు జీవించేలా కృషి చేస్తున్నామన్నారు. రహదారుల విస్తరణకు ప్రజలు సహకరిస్తే ట్రాఫిక్ కష్టాలు ఉండవన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం మొ దలు పెట్టినప్పుడు నన్ను విమర్శించారని ఇప్పుడే అదే బైపాస్ రోడ్డు ఖమ్మం నగరానికి కీలకంగా మారిందన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి వారి సొంతింటి కలను నెరవేరుస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ఖమ్మం నగరానికి మహర్దశ వచ్చిందన్నారు. అవకాశం ఉన్న మేర నిధులను తీసుకువచ్చి ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, కమర్తపు మురళి, నాయకులు పాల్గొన్నారు.

## మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని వాల్మీకి చిత్ర పటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి ఆధ్యాత్మిక వేత్తగా రామాయణ కావ్యం రచించి ఆదికవిగా వెలుగొందారన్నారు. రామాయణం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవునికి ఉండాల్సిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికి బోధించారన్నారు. ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సిబ్బంది, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు పటిష్టమైన చర్యలు

ఎస్‌పి రోహిత్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ సూచించారు. మంగళవారం ఆయన కొత్తగూడెం పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయాన్ని సందర్శించారు. డిఎస్‌పి రెహమాన్ ఎస్‌పికి పుష్పగుచ్చాన్ని అందించి స్వాగతం పలికారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రజలు సైబర్ నేరాల భారిన పడకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకాన్న పెం చేలా ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు 1టౌన్ సిఐ కరుణాకర్. 2టౌన్ సిఏ ప్రతాప్, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, 3 టౌన్ సిఐ శివప్రసాద్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పైలేరియాసిస్ నిర్మూలనే లక్ష్యం

డిఎంఅండ్‌హెచ్ఒ కళావతి బాయి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పైలేరియాసిస్ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ట్రాన్స్‌మిషన్ అసెస్మెంట్ సర్వే చేపట్టిందని దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ బి. కళావతిబాయి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రగతి మీటింగ్ హాల్‌లో జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో జాతీయ వెక్టర్ బోర్న్ డిసిజ్ కంట్రోల్ సెంటర్ పరిధిలోని ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే శిక్షణా కార్యక్రమానికి డిఎంఅండ్‌హెచ్‌వో బి. కళావతిబాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింఫాటిక్ పైలేరియాసిస్ నిర్మూలనలో ట్రాన్స్‌మిషన్ అసెసెమెంట్ సర్వే ఎంతో కీలకమైన దశ అన్నారు. ఈ సర్వే ద్వారా వ్యాధి వ్యాప్తి ఆగిపోయిందా లేదా అనేది తెలుసుకోవచ్చన్నా రు. సమాజంలో ఇన్ఫెక్షన్ ఏ దశలో ఉందో నిర్ధారించుకోవచ్చునన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాలలో విధులు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందికి సర్వేపై ఒక రోజు శిక్షణా కార్యక్రమా న్ని నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. జిల్లా వెక్టర్ బోర్న్ డిసిస్ కంట్రోల్ బృం దాలు, మెడికల్ ఆఫీసర్లు, ఫీల్డ్ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నా రు. సర్వే విధానం ఫీల్డ్ అమలు, డేటా సేకరణలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. శిక్షణలో సర్వే విధానం, శాంప్లింగ్ పద్ధతి ఫీల్డ్ డేటా సేకరణ, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలను జిల్లా అదనపు డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ వివరించారు. సాం కేతిక బృందం సభ్యులు శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డా క్టర్ చందునాయక్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రా మారావు, పిహెచ్‌సి, యుపిహెచ్‌సి వైద్యాధికారు లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నిషియ న్లు, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్ దందా

మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్‌ల మాయాజాలం కొనసాగుతూనే ఉంది. ట్రేడ్ లైసెన్స్‌లు నిబంధన ప్రకారం కొలతలతో తీస్తే షాపులు పొడవు, వెడల్పు బట్టి ఆ షాప్‌కు ఎంత అమౌంట్ వస్తుందో అంత అమౌంట్ కట్టించుకోవాలి. ట్రేడ్ లైసెన్స్ సిబ్బంది ముందుగానే మీకు ఇంత పెద్ద ఎత్తున లైసెన్స్ ఫీజు కట్టవలసి ఉంటుంది అని వారిని బెదిరించడంతో పాటు భయపట్టే విధంగా మాట్లాడతారు. తర్వాత మేము ఫీజు తగ్గించేస్తాం అని డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపణ సైతం వినిపిస్తున్నాయి. ఓ బాధ్యతగల అధికారి కనుసైగల్లోనే మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్ దందాలు దందా కొనసాగుతుందని ఆరోపణలు లేకపోలేదు. మాపై అధికారులకు కూడా చూసుకోవాలి అని దందాకు తెర లేపారు. ఇటీవల వైరాలో ఓ హాస్పిటల్ ట్రేడ్ లైసెన్స్ విషయంలో రూ.20వేలు తీసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆటో మొబైల్ షాప్ యజమానిని కూడా రూ.15వేలు ఇవ్వండి ఫీజు తగ్గిస్తాం అని అన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజు తగ్గింపు విషయంలో వసూలు చేసి వారిని ఓ అధికారి అండదండలు పుష్కలంగా ఉన్నాయని తెలుస్తుంది. ఆ అధికారి సూచనల మేరకే ట్రేడ్ లైసెన్స్ దందా కొనసాగుతుందని చెప్పవచ్చు. గతంలో వైరా మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలతో పక్కన పెట్టిన వారిని మరల విధుల్లోకి తీసుకోవడం వారికి కీలకమైన రెవిన్యూ వచ్చే బాధ్యతలు అప్పజెప్పడం జరిగింది. అవినీతి ఆరోపణలతో పక్కన పెట్టిన వారిని తీసుకోవడమే కాకుండా ఇప్పుడు మరల వారికే మున్సిపాలిటీలో పెత్తనాలు అప్పజెప్పడం వారి వెనక ఓ అధికారి నేనున్నానని భరోసా ఇవ్వడం అంత ఓ ప్లాన్ ప్రకారం జరుగుతుందని తెలుస్తుంది. జిల్లా కలెక్టర్ వైరా మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్‌ల విధానంలో జరుగుతున్న దందాపై ఒక్కసారి దృష్టి సారించాలి. ట్రేడ్ లైసెన్స్‌కి వెళ్లిన వారి వెనుక ఉండి నడిపించే ఆ అధికారి ఎవరు? ఎందుకంత తప్పుడు మార్గంలో పోతూ మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి

చిత్రపటానికి పూల మాలలు వేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి ఐడిఓసిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చి త్ర పటానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆదికవి అని, ఆయన చెప్పిన హితోక్తితో దేశ జనబంధువులు నియమాన్ని పాటిస్తే వారంతా ఉత్తమ పురుషులు అవుతారన్నారు. ఆ మహనీయుడు రాసిన రామాయణ కావ్యం అంతా చదివి అర్థం చేసుకుని ఆచరిస్తూ జనమంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొదమూరి సత్యనారాయణ, బిసి సంక్షేమ అధికారి విజయలక్ష్మి, ముదురుకోళ్ల కిషోర్, వాల్మీకిబోయ సంఘం జిల్లా అధ్యక్షులు మురికి వెంకన్న, బి నందకిషోర్, మురికి శ్రీనివాస్, సాంబయ్య, గుమలాపురం సత్యనారాయణ, వాల్మీకి బోయ సంఘం నాయకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కమిషనర్ అగస్త్య



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రి పరిసరాలలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో బైక్, ఆటో, కారు పార్కింగ్‌కు కేటాయించిన ప్రాంతాలను తనిఖీ చేశారు. పార్కింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఏజెన్సీ పని తీరును సమీక్షించారు. ఆసుపత్రి పరిసరాలలో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణాన్ని నెలకొల్పాలని హార్టికల్చర్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా రహదారులను సక్రమంగా వినియోగించాలన్నారు. ఎక్కడపడితే అక్కడ వాహన పార్కింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దన్నారు. శానిటేషన్, క్లినింగ్ కోసం సిబ్బందికి ప్రణాళిక తయారు చేసి దాని ప్రకారం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని సమస్యలను, అభివృద్ధికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌కు నివేదిస్తానని ఆయన తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

## సంతకాల సేకరణ ముమ్మరం చేయండి

కాంగ్రెస్ జిల్లా అధ్యడు పువ్వాళ్ల




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓట్ల చోరీపై సంతకాల సేకరణ ముమ్మరం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఓట్ల దొంగలు గద్దె దిగండి అనే ఉద్యమ పిలుపులో భాగంగా ఓట్ల చోరీపై సంతకాల సేకరణకు సంబంధించి మండల, పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. బిజెపి, ఎన్నికల సంఘం కుమ్మక్కుపై ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తుందన్నారు. వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లి బిజెపి అక్రమాలను ఎండగట్టి ప్రజాభిప్రాయ సేకరణ కు సంతకాలు తీసుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, బాలగంగాధర్ తిలక్, సతీష్, వేణు, వీరబాబు, కృష్ణ ప్రసాద్, వడ్డె నారాయణరావు, వెంకటరెడ్డి, బాలాజీ నాయక్, కిషోర్, రమేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, వెంకట నర్సారెడ్డి, నరేంద్ర, చంద్రప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్‌పిటిసిగా బోడ గెలుపు నల్లేరు మీద నడకే..!




**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం జెడ్పిటిసి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపిపి బోడ మంగీలాల్ నాయక్ సతీమణి బోడ జయను ఎంపిక చేస్తే సునాయాసంగా జెడ్పిటిసి స్థానం గెలుచుకోవచ్చని తిరుమలాయపాలెం రాజకీయ నేతల్లో చర్చ జరుగుతుంది. 2014 ఎ న్నికల్లో టిడిపి పార్టీ నుండి జెడ్పిటిసి స్థానానికి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలు కాగా అనంతరం జరిగిన పరిణామాలు భాగంగా స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత కేసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాక అప్పటి మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ సూచనల మేరకు ఇప్పటి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అప్పుడు బిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోగా పాలేరు శాసనసభ్యులు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా పాలేరు ఉప ఎన్నిక ల్లో తుమ్మల నాగేశ్వరరావు భారీ విజయాన్ని సాధించారు. తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి పాలేరు నియోజకవర్గంలో తనదైన శైలిలో అభివృద్ధి చేశారు. ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యులు రాష్ట్ర రెవె న్యూ గృహ నిర్మాణ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అత్యంత సన్నిహితుడు చావా శివరామకృష్ణ, రామసా యం నరేష్‌రెడ్డి న మ్మిన బం టుగా ఉంటున్న బోడ మం గీలాల్ నా యక్ 2023 శాసనసభ ఎన్నికల్లో కాం గ్రెస్ పా లేరు అభ్యర్థి పొంగులే టి శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం ఆహర్నిశలు కృషి చేశారు. జెడ్పిటిసి గెలుపు నల్లేరు మీద నడకే అ ని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. ఇటీవల వై రా స్థానిక కాంగ్రెస్ నాయకురాలు బా ణోతు విజయభాయిని తిరుమలాయపాలెం జెడ్పిటిసిగా రంగంలో దించుతారని తెలియగా స్థానిక కాం గ్రెస్ నాయకులు అసంతృప్తిగా ఉన్నారని, స్థానికేతర నాయకురాలను ఇ క్కడ పోటీ చేస్తే కొన్ని భిన్న అభిప్రాయాలు రావడంతో మంత్రి మ నసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణం లో మంత్రి పొంగులేటి ఎవరికి బీఫామ్ ఇ స్తారో ఉత్కంఠ నెలకొంది. ఈ నె ల 8వ తేదీ త ర్వాత కోర్టు నిర్ణయంతో ఈ ఉత్కంఠకు తెరపడనున్నది.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/పాల్వంచ :** మారుమూల గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి ల్యనూర్, చంద్రాలగూడెం, రేగులగూడెం, బంజెర, లక్ష్మీదేవిపల్లి, మల్లారం, నరసింహసాగర్, మందెరికలపాడు, కారెగట్టు, మొండికట్ట, రెడ్డిగూడెం, యానంబైల్ తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ బానోత్ భిక్షం ఆయన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేశారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గిరిజన గ్రామాలలో మౌళిక వసతులను కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు. నాయకులు బరపటి వాసుదేవరావు, జాలే జానకిరెడ్డి, గ్రంశెట్టి ముత్తయ్య, బాలినేని నాగేశ్వరరావు, కొండం వెంకన్న గౌడ్, వాసం మంగయ్య, జమ్ముల రాజశేఖర్, ఆనంద్, బ్రహ్మచారి, వర్సా నారాయణ పాల్గొన్నారు.

## సిపిఐ కార్యకర్త సభ్యుడు లోక్య మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూ-రల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని చిన్న తండాకు చెందిన బానోత్ లోక్య(95) అనారోగ్యంతో ఇంటివద్ద మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ భౌతికకాయాన్ని సందర్శిం ఎర్రజెండాను కప్పి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుడికి భార్య ఐదుగురు కుమారులు, ఇద్దరుకుమార్తెలు ఉన్నారు. వీరిలో నాలుగో కుమారుడు బానోత్ రాంకోటి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా సమితి సభ్యుడిగా క్రియాశీలకంగా కొనసాగుతున్నాడు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీరా రామ్మూర్తి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు దండి రంగారావు, బానోత్ గద్ద, పాల్తీయా శ్రీను, రామ్మూర్తి, జగన్, శాఖ కార్యదర్శి ధరావత్ కృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు మాంమిండ్ల సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు రాజు, వైరా మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకురాలు చంద్రావతి, మాజీ ఆర్డీఓ పాండురంగ తదితరులు పాల్గొన్నారు.






## 'మిత్ర మండలి' ట్రైలర్ ఆవిష్కరణ

నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ పతాకాలపై నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత. ఈ వినోదభరిత చిత్రానికి నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్, విష్ణు ఓఐ, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వెండితెరపై నవ్వుల టపాసులు పేల్చడానికి, దీపావళి కానుకగా అక్టోబర్ 16న 'మిత్ర మండలి' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు.



## 'సీతా పయనం'లో యాక్షన్ లుక్ రిలీజ్

మల్టీ ట్యాలెంటెడ్ అర్జున్ సర్జా దర్శకత్వం వహిస్తున్న తాజా సినిమా 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలమ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య అర్జున్, నిరంజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. అర్జున్, ధ్రువ సర్జా పవర్ ఫుల్ పవర్ ఫుల్ పాత్రల్లో కనిపించనున్నారు. ధ్రువ సర్జాకు సంబధించిన యాక్షన్ భరితమైన ఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి అద్భుతమైన స్పందన లభిస్తోంది. పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి.



## 'కానిస్టేబుల్' ప్రీ రిలీజ్ వేడుక


'నా కెరీర్‌లో అక్టోబర్ నెలను మరచిపోలేను. ఎందుకంటే దాదాపు పద్దెనిమిది ఏళ్ల క్రితం నేను నటించిన తొలి చిత్రం 'హ్యాపీడేస్' 2007లో ఇదే నెలలో విడుదలై, ఘన విజయం సాధించి, నా కెరీర్ నే మలుపు తిప్పింది. అందుకే నా జీవితంలో అక్టోబర్ మాసం గుర్తుండి పోయింది. ఇప్పుడు ఈ చిత్రం కూడా ఇదే నెలలో విడుదలవుతుండటంతో ఆ రోజులు గుర్తుకు వస్తున్నాయి' అని హీరో వరుణ్ సందేశ్ అన్నారు. వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు.

## 'బ్యాడ్ బాయ్'గా నాగ శౌర్య

హీరో నాగ శౌర్య తాజాగా నటిస్తున్న సినిమా 'బ్యాడ్ బాయ్'. కార్తీక్ అనే పవర్ ఫుల్ పాత్రలో యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. నూతన దర్శకుడు రామ్ దేసినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవి ఫిలమ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. టీజర్‌లో నాగ శౌర్యను రగ్గడ, ఇంటెన్స్ స్టైలిష్ న్యూ అవతార్‌లో కనిపించరు. యాక్షన్ సన్నివేశాలు, మూమెంట్స్‌తో మాస్ పాత్రలో నటిస్తున్నాడు.



## డిసెంబర్ 25న 'ఛాంపియన్'



యాంకర్ సుమ, నటుడు రాజీవ్ కనకాల దంపతుల కుమారుడు హీరో రోషన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'ఛాంపియన్.' ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాను, జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఛాంపియన్ ఫస్ట్ లుక్, ఆసక్తికరమైన టీజర్ గ్లింప్స్ విడుదల చేశారు. ప్రస్తుతం షూటింగ్ వేగంగా సాగుతుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. చాంపియన్ డిసెంబర్ 25న, క్రిస్మస్ సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.

## 25 మిలియన్ వ్యూస్ దాటిన 'నువ్వుంటే చాలే' పాట


రామ్ పోతినేని హీరోగా నటిస్తుబూతాజా చిత్రం




ఆంధ్రా కింగ్ తాలూకా. మహేష్ బాబు పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవల విడుదలైన 'నువ్వుంటే చాలే' సాంగ్ రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఈ సాంగ్ 25 మిలియన్ + వ్యూస్ క్రాస్ చేసి ఆల్‌టైమ్ ఫేవరెట్‌గా ఆడియన్స్ మనసుల్ని గెలుచుకుంది.

## ఆ పాత్ర చాలా పవర్ ఫుల్

-రవితేజ



'మాస్ మహారాజా' సినిమాలో తాను పోషించిన ఆర్‌పిఎఫ్(రైల్వే పోలీస్ ఫోర్స్) అధికారి పాత్ర పవర్ ఫుల్‌గా ఉంటుందని హీరో రవితేజ అన్నారు. ఈ పాత్ర గురించి ఆయన మాట్లాడుతూ, ఇది తన సినీ ప్రయాణంలో సరికొత్త, ప్రత్యేకమైన పాత్ర అని అభివర్ణించారు. అలాగే చిత్ర దర్శకుడు భాను భోగవరపు, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియోపై ప్రశంసలు కురిపించారు. భాను ప్రతిభావంతుడని, చిత్రీకరణ సమయంలో కూడా సన్నివేశాన్ని ఇంకా మెరుగ్గా మలచడానికి ప్రయత్నిస్తుంటాడని, చాలా వేగంగా మార్పులు చేయగలడని కొనియాడారు. భీమ్స్ ఎంతో కృషి చేసి, ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందించాడని అన్నారు. ఇక మాస్ జాతర సినిమా గురించి మాట్లాడుతూ.. వినోదం, మాస్ అంశాలతో పాటు హృదయపూర్వక కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుందని తెలిపారు.'మాస్ జతర'. రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హాస్యం, భావోద్వేగాలు మరియు మాస్ అంశాలతో నిండిన వినోదభరితమైన కుటుంబ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న 'మాస్ జతర' సినిమా, భారీ అంచనాల నడుమ అక్టోబర్ 31న థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలకు విశేష స్పందన లభించింది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఈ క్రమంలోనే తాజాగా సుమతో కలిసి ఒక ఉల్లాసమైన మరియు వినోదాత్మక సంభాషణలో చిత్ర బృందం పాల్గొంది. 'మాస్ జతర' సినిమా ఎంత ప్రత్యేకమైనదో తెలిపేలా వీరి సంభాషణ సాగింది. రవితేజ గారితో కలిసి నటించడం చాలా ఆనందకరమైన అనుభవమని శ్రీలీల అన్నారు. అత్యంత ఆహ్లాదకరమైన సహనటులలో ఆయన ఒకరని శ్రీలీల తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. మాస్ జతారలో తాను సైన్స్ టీచర్‌గా, శ్రీకాకుళం యాసలో మాట్లాడే ఉల్లాసభరితమైన పల్లెటూరి అమ్మాయిగా కనిపిస్తానని ఆమె వెల్లడించారు. తన మునుపటి పాత్రలకు పూర్తి భిన్నంగా ఇది ఉంటుంది. స్క్రిప్ట్ చదివినప్పుడే తాను నవ్వుకున్నానని, ఇక సెట్‌లో దానిని ప్రదర్శించే సమయంలో ఆ నవ్వులు రెట్టింపు అయ్యాయని శ్రీలీల పేర్కొన్నారు. రవితేజ అంకితభావం గురించి మాట్లాడుతూ.. గాయంతో బాధపడుతున్నప్పటికీ, ఆయన ఆసుపత్రికి వెళ్లే ముందు 'తూ మేరా లవర్' పాటను పూర్తి చేసి, తన నిబద్ధతను చాటుకున్నారని శ్రీలీల కొనియాడారు. 'మాస్ జాతర' ప్రేక్షకులను అలరించడానికి ఈనెల 31న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలవుతోంది.

## విజయ్ దేవరకొండకు కారు ప్రమాదం



తెలుగు సినిమా నటుడు విజయ్ దేవరకొండకు ప్రమాదం తప్పింది. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి సమీపంలో విజయ్ దేవరకొండ ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. తన స్నేహితులతో కలిసి పుట్టపర్తికి వెళ్లి వస్తుండగా ఘటన జరిగింది. ప్రమాదం నుంచి సురక్షితంగా విజయ్ బయట పడ్డారు. విజయ్ కారు స్వల్పంగా ధ్వంసమైంది. దీంతో స్నేహితుడి కారులో విజయ్ అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. విజయ్ కారును మరో వాహనం బొలేరో ఢీ కొన్నట్టు విజయ్ తరఫు వ్యక్తి ఒకరు తెలిపారు.

## ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్ ట్రైలర్ విడుదల




20th సెంచరీ స్టూడియోస్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్‌అడ్వెంచర్ చిత్రం ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్ ఫైనల్ ట్రైలర్‌ను అధికారికంగా విడుదల చేసింది. డైరెక్టర్ డాన్ ట్రాచ్టెన్‌బర్గ్ ఈ ఐకానిక్ ఫ్రాంచైజీకి కొత్త బోల్డ్ విజన్‌ను అందిస్తున్నారు. ట్రైలర్‌లో ఎక్స్‌ప్లోసివ్ సెట్ పీసెస్, అనూహ్యమైన అలయన్సెస్, ప్రెడేటర్ వర్సెస్ ప్రెడేటర్ బ్యాటిల్స్ లాంటివి ప్రేక్షకులు ఇంతకు ముందు చూడని విధంగా టీజ్ చేస్తున్నాయి.

# ముందుకెళదాం

(మొదటి పేజీ తరువాయి)

ఆశిస్తున్నామని చెప్పారు. డి.రాజా మంగళవారం బిహార్‌లో పర్యటించారు. ఇండియా భాగస్వామిగానే కాకుండా బిహార్‌లో ప్రతిపక్ష మహాకూటమిలో సిపిఐ ఉన్న నేపథ్యంలో బిహార్‌లో సీట్ల సర్దుబాటుపై చర్చలు ప్రారంభమయ్యాయి. వీటిలో పాల్గొనేందుకు రాజా పట్నా చేరుకున్నారు. ఇదే క్రమంలో విలేకరుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఓ ఛానల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. సీట్ల సర్దుబాటుపై చర్చలు త్వరలోనే కొలిక్కివస్తాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. సముచిత స్థానాల్లో పోటీ చేసేందుకుగాను పెద్ద పార్టీల మద్దతు కోరుతున్నట్లు తెలిపారు. 'ఎన్నికల సంఘం బిహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించింది. ఎస్ఐఆర్‌పై అనేక ప్రశ్నలు వచ్చాయి. సుప్రీంకోర్టు జోక్యం తర్వాతే ఆధార్, ఇతర పత్రాలను ఇసి అనుమతించింది' అని రాజా అన్నారు. ఎన్నికల సంఘం తన విశ్వసనీయతను పునరుద్ధరించుకోవాలని, బిహార్ అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా ఇసి హామీనివ్వాలన్నారు. బిహార్ అసెంబ్లీలో 243 స్థానాలు ఉండగా, 24 చోట్ల పోటీ చేస్తామని సిపిఐ ఇప్పటికే వెల్లడించింది. 2020లో ఆరు స్థానాల్లో పోటీ చేసిన సిపిఐ రెండు సీట్లు గెలుచుకుంది. ఈసారి మంచి ప్రదర్శన ఇవ్వగలమన్న దీమాతో



ఉంది. ఇదే క్రమంలో డి.రాజా మాట్లాడుతూ పెద్ద పార్టీలకు పట్టువిడుపు అవసరమని, చిన్న పార్టీలకు సముచిత స్థానాలు కేటాయించాలన్నారు. ఈసారి ఎన్నికల ప్రచారాన్ని సిపిఐ పెద్దఎత్తున నిర్వహిస్తుందని చెప్పారు. ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్‌తో ముఖాముఖి భేటీలో కీలక అంశాలపై చర్చించి సమస్యలను పరిష్కరించుకుంటామన్నారు. ప్రతిపక్ష కూటమి తరపున సిఎం అభ్యర్థిగా తేజస్వికి మద్దతు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. కమ్యూనిస్టు భావజాలం, సిద్ధాంతాల బలం తగ్గలేదని డి.రాజా నొక్కిచెప్పారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడులు పెరిగినా పార్లమెంటులో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తగినా ప్రస్తుత సామాజిక నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూపగల సామర్థ్యం కమ్యూనిస్టులకు ఉందని వక్కాణించారు. కులరహిత సమాజ స్థాపన కమ్యూనిస్టులతోనే సాధ్యమన్నారు. మత తత్వవాదం, ఫాసిస్టు శక్తులపై రాజీలేని పోరాటానికి సిపిఐ కట్టుబడి ఉందని, పార్టీ బలాన్ని పెంచుకుంటూనే ఈ పోరాటాన్ని సాగిస్తామని డి.రాజా అన్నారు. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు అన్ని ఎన్నికల్లోనూ సిపిఐ పోటీ చేస్తుందని చెప్పారు. వామపక్ష ఐక్యతను పెంచడం కోసం ఇతర కమ్యూనిస్టు పార్టీల అగ్ర నాయకులను చండీగఢ్‌లో నిర్వహించిన సిపిఐ జాతీయ మహాసభలకు ఆహ్వానించినట్లు వెల్లడించారు. శతవార్షికోత్సవం సందర్భంగా వామపక్ష పార్టీల పునరేకీకరణ కోసం పిలుపునిచ్చాం... ఆ దిశగా ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని డి.రాజా తెలిపారు. బిహార్‌లోనే కాకుండా 2026లో కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపైనా సిపిఐ దృష్టిని కేంద్రీకరించిందన్నారు. పశ్చిమ బెంగాల్ వామపక్షాల పునరుద్ధరణే తమ లక్ష్యమన్నారు. తమ పార్టీతో పాటు ఇండియా అభ్యర్థుల తరపున ప్రచారం కోసం బిహార్‌లో సిపిఐ నాయకులు తరచూ పర్యటిస్తారని రాజా చెప్పారు.

## ఐదు రాష్ట్రాలకు కేంద్రం వరద సహాయం

**న్యూఢిల్లీ:** ఐదు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1600 కోట్లు పైగా వరద సహాయం ప్రకటించింది. 2024లో వచ్చిన వరదలు, కొండచరియలు విరిగి పడి జరిగిన నష్టాలకుగాను ఈ మొత్తాన్ని కేటాయించింది. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా నాయకత్వానగల ఉన్నతస్థాయి కమిటీ దీనికి ఆమోదం తెలియజేసింది. అసోం,గుజరాత్ రాష్ట్రాలలో గత ఏడాది వరద నష్టాలకుగాను 707.97 కోట్లు అదనపు కేంద్ర సహాయం కేటాయించగా, జాతీయ ప్రకృతి వైపరీత్యాల ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్ఎఫ్)ఖాతా కింద హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు రూ.903.67 కోట్లు కేటాయించారు. ఈ మొత్తాన్ని ఈ రాష్ట్రాలలో అగ్నిమాపకదళ సేవలను ఆధునీకరించి విస్తరించేందుకు ఖర్చుచేస్తారు. కాగా అసోం,గుజరాత్‌లకు కలిపి కేటాయించిన అదనపు సహాయంలో రూ.313.69 కోట్లు అసోం వాటా ఉండగా, రూ.394.28 కోట్లు గుజరాత్‌కు వరదసహాయం కింద వాటా వెళుతుంది. హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లకు కేటాయించిన రూ.903.67 కోట్లలో రూ.676.33 కోట్లు కేంద్రం వాటా ఉంది.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com